గురువారం

05-12-2024

హైదరాబాద్ ప్రచురణ

సంపుటి : 09, సంచిక : 74

పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

నమీబియాకు తొలి మహిళా అధ్యక్షురాలు

విండ్‌హోక్: నమీబియా అధ్యక్ష పదవికి నవంబరులో జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత ఉపాధ్యక్షురాలు నెటుంబో నందీ ఘన విజయం సాధించారు. దేశానికి తొలి మహిళా అధ్యక్షురాలిగానే కాక మొత్తం ఆఫ్రికా ఖండంలోనే అధ్యక్ష పగ్గాలు చేపట్టే రెండవ మహిళగా ఆమె చరిత్రకెక్కారు. ఈ మేరకు నమీబియా ఎన్నికల సంఘం తాజాగా ప్రకటించింది. సౌత్ వెస్ట్ ఆఫ్రికాస్ పీపుల్స్ ఆర్గనైజేషన్ పార్టీ (స్వాపో)కు చెందిన నెటుంబోకు 57.3శాతం అంటే 6,83,000 ఓట్లు వచ్చినట్లు వెల్లడించింది. ఎన్నికల చట్టంలోని సెక్షన్ 109 ప్రకారం ఆమెను విజేతగా ప్రకటించింది. అయితే ఈ ఫలితాలను విపక్షాలు వ్యతిరేకించాయి.

రైతులకు ఈ దుస్థితి ఎందుకు?

కేంద్రానికి ఉపరాష్ట్రపతి ప్రశ్న

న్యూదిల్లీ: దేశానికి అన్నం పెట్టే రైతన్న ఆందోళనతో రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందంటూ రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్కర్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాజ్యసభలో మంగళవారం ఈమేరకు కేంద్ర వ్యవసాయ మంత్రికి అనేక ప్రశ్నలు సంధించారు. 'దేశం మారుతుండడం తొలిసారి చూస్తున్నా... అభివృద్ధి చెందిన భారతదేశం కోసం కలలు కనడం కాకుండా దానిని లక్ష్యంగా నిర్ణయించుకుని ముందుకు సాగడం మొదటిసారి చూస్తున్నా.. దేశం ఉన్నత

- మిగతా 2 లో

పీఎస్ఎల్వీ-సీ59 ప్రయోగం నేటికి వాయిదా

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: ఇస్రో తలపెట్టిన పీఎస్ఎల్వీ-సీ59 ప్రయోగం వాయిదా పడింది. ప్రోబో-3 ఉపగ్రహంలో సాంకేతిక లోపం కారణంగా ప్రయోగాన్ని వాయిదా వేసినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. కౌంట్‌డౌన్ సమయంలో ఈ లోపాన్ని గుర్తించినట్లు చెప్పారు. పీఎస్ఎల్వీ-సీ59 రాకెట్‌ను గురువారం సాయంత్రం 4.12 గంటలకు ప్రయోగిస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు.

అసోంలో బీఫ్‌పై నిషేధం

గువహతి: గోవుల రక్షణ నినాదంతో బీజేపీ పాలిత రాష్ట్రాలు ఒకదాని తర్వాత ఒకటిగా చర్యలు చేపడుతున్నాయి. తాజాగా అసోం ప్రభుత్వం బీఫ్ (గో మాంసం)ను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఇకపై హోటళ్లు, రెస్టారెంట్లు, బహిరంగ ప్రదేశాల్లో బీఫ్ తినడాన్ని, అమ్మడాన్ని నిషేధిస్తూ ముఖ్యమంత్రి హిమంతా బిశ్వశర్మ బుధవారం ఆదేశాలిచ్చారు. ఇందుకోసం ప్రస్తుతమున్న బీఫ్ చట్టాన్ని సవరించేందుకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. 'హోటళ్లు, రెస్టారెంట్లు, బహిరంగ

- మిగతా 2 లో

బాదల్‌పై హత్యాయత్నం

స్వర్ణదేవాలయంలో ఘటన

అమృత్‌సర్: పంజాబ్‌లోని ప్రఖ్యాత స్వర్ణ దేవాలయంలో పంజాబ్ మాజీ ఉపముఖ్యమంత్రి, శిరోమణి అకాలీదళ్ పార్టీ నేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై హత్యాయత్నం జరిగింది. ఆయనపై ఖలిస్థానీ ఉగ్రవాదిగా అనుమానిస్తున్న నిందితుడు కాల్పులకు తెగబడ్డారు. అయితే ఆయన తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. స్వర్ణదేవాలయంలో సేవాదార్‌గా శిక్ష అనుభవిస్తుండగా ఈ ఘటన

- మిగతా 2 లో

పురుషులకూ నెలసరి వస్తే తెలిసేది

సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

న్యూదిల్లీ: మహిళా న్యాయాధికారులను విధుల నుంచి తొలగింపునకు సంబంధించిన అంశాన్ని సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. గర్భస్రావం కారణంగా ఓ మహిళా న్యాయమూర్తి అనుభవించిన మానసిక, శారీరక క్షోభను మధ్యప్రదేశ్ హైకోర్టు విస్మరించిందని పేర్కొంది. పురుషులకు నెలసరి వస్తే వారి పరిస్థితి తెలిసేది అంటూ సుప్రీం ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. అదేసమయంలో సివిల్ జడ్జీల తొలగింపు విధివిధానాలపై వివరణ ఇవ్వాలని హైకోర్టును ఆదేశించింది. ఆశించిన స్థాయిలో పనితీరు లేదనే కారణంతో ఆరుగురు సివిల్ జడ్జిలను తొలగిస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు గతేడాది నిర్ణయం తీసుకుంది. అందులో నలుగురిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు పూర్తిస్థాయి ధర్మాసనం నిర్ణయించగా...

- మిగతా 2 లో

ఎమ్మెల్సీ కవితకు దిల్లీ హైకోర్టు నోటీసులు

న్యూదిల్లీ: దిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఈడీ పిటిషన్‌పై ప్రతిస్పందించాల్సిందిగా ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్, కవిత సహా కొంతమంది ఆప్ నేతలను దిల్లీ హైకోర్టు బుధవారం ఆదేశించింది. దిల్లీ లిక్కర్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో నిందితులకు పోలీసు నివేదిక, ఇతర పత్రాల కాపీలు అందించాలంటూ ట్రయిల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఈడీ దిల్లీ హైకోర్టులో సవాలు చేసింది. ఈడీ పిటిషన్‌తో పాటు ఈ కేసులో స్టే విధించాలని కోరుతూ దాఖలైన దరఖాస్తుపై 40 మంది నిందితులకు జస్టిస్ మనోజ్ కుమార్ ఒహ్రీ నోటీసులు జారీ చేశారు. ఈ కేసు తదుపరి విచారణను 2025 జనవరి 30కి వాయిదా వేశారు. దిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఆప్ నేతలు మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్‌తో పాటు కొంతమంది వ్యాపారవేత్తలు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులకు చార్జిషీట్, డిజిటల్ రికార్డులు, అభియోగంతో సంబంధం లేనివి అందించాలని నవంబర్‌లో ట్రయల్ కోర్టు ఈడీని ఆదేశించింది. ఎక్సైజ్ పాలసీ సవరణలో అవకతవకలు జరిగాయని, లైసెన్స్ హోల్డర్లకు అనవసరమైన ప్రయోజనాలు కల్పించారని సీబీఐ, ఈడీ ఆరోపించింది.

కంపించిన భూమి

తెలుగు రాష్ట్రాల్లో కొన్ని సెకన్లపాటు...

- రోడ్లపైకొచ్చిన జనం
- హైదరాబాద్, విజయవాడ, విశాఖలో ప్రకంపనలు
- మేడారంలో భూకంప కేంద్రం
- రిక్టర్ స్కేల్‌పై 5.0గా నమోదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో భూప్రకంపనలు ప్రజల్ని భయాందోళనలకు గురిచేశాయి. బుధవారం ఉదయం 7.27 గంటలకు కొద్ది సెకన్లపాటు భూమి కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 5.0గా నమోదైంది. తెలంగాణ ములుగు జిల్లా మేడారంలోని భూకంప కేంద్రం నుంచి 225 కిలోమీటర్ల పరిధిలో ప్రకంపనల ప్రభావం కనిపించింది. తెలంగాణలో హైదరాబాద్‌లోని హయత్‌నగర్, వనస్థలిపురంలోను, ఉమ్మడి రంగారెడ్డి, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, జనగామ జిల్లాల పరిధిలో భూ ప్రకంపనలు వచ్చాయి. ఉమ్మడి వరంగల్‌జిల్లాలోని హనుమకొండ, భూపాలపల్లి, ములుగుతోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, చింతకాని, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ తదితర ప్రాంతాల్లో భూమి కంపించింది. 20 ఏళ్ల తర్వాత సంభవించిన ఈ భూ ప్రకంపనలకు కొన్ని చోట్ల ఇంటి గోడలు బీటలు వారాయి. ఇళ్లల్లోని సామాన్లు చెల్లాచెదురయ్యాయి. ఇళ్ల గోడలపై ఉంచిన కుండీలు కిందపడి ధ్వంసమయ్యాయి. ఇంటి ఫ్లోరింగ్‌లోనే పగుళ్లు కనిపించాయి. ఒక్కసారిగా ఏం జరిగిందో తెలియక ప్రజలు ఆందోళన చెందారు. ఆ తర్వాత కొన్ని క్షణాలకు భూమి కంపించినట్లుగా వచ్చిన వార్తలతో తమకూ వచ్చిందని

- మిగతా 2 లో

గూగుల్‌తో ఈ-సేఫ్టీ ఒప్పందం

రాష్ట్రానికే గర్వకారణం

ఐటీ, ఇన్నోవేషన్ హబ్‌గా హైదరాబాద్: రేవంత్

విశాలాంధ్ర-హైదరాబాద్: ఈ-సేఫ్టీ కేంద్రం ఏర్పాటుకు గూగుల్ ముందుకు రావటం ఆనందంగాను, రాష్ట్రానికే గర్వకారణంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్య ఒప్పందం... ప్రపంచంలో మేటి ఐటీ, ఇన్నోవేషన్ హబ్‌గా హైదరాబాద్ అందరి దృష్టిని ఆకర్షిస్తుందని తెలిపారు. గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాయల్ హాన్సెన్ అధ్వర్యంలో కంపెనీ ప్రతినిధి బృందం బుధవారం జూబ్లీహిల్స్ లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హాన్సెన్ మాట్లాడుతూ డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో తెలంగాణ ముందంజలో ఉందని అన్నారు. 'ప్రపంచ వ్యాప్తంగా ఐటీ, ఐటీ ఇంజినీరింగ్ సర్వీసెస్ అభివృద్ధికి హైదరాబాద్ కేంద్రంగా ఉంది. ఇప్పటికే ప్రపంచంలో పేరొందిన అయిదు టెక్ కంపెనీలు గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్, అమెజాన్, ఫేస్‌బుక్ ఇక్కడే ఉన్నాయి. ఇప్పుడు సేఫ్టీ సెంటర్ ద్వారా సైబర్ సేఫ్టీ సమస్యలను వేగంగా పరిష్కరించే వీలుంటుందని అభిప్రాయపడ్డారు. ఈ సెంటర్ ఏర్పాటుతో వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

దేశంలోనే మొట్టమొదటిది

రాష్ట్ర ప్రభుత్వం గూగుల్ కంపెనీతో కీలక ఒప్పందం చేసుకుంది. దేశంలోనే హైదరాబాద్‌లో మొట్టమొదటి గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ని నెలకొల్పేందుకు ఆ కంపెనీ ముందుకొచ్చింది. ఇది ప్రపంచంలోనే అయిదవది. ఏసియా-పసిఫిక్ జోన్‌లో టోక్యో తర్వాత ఏర్పాటు చేస్తున్న రెండో సెంటర్ ఇదే. గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ ప్రత్యేకమైన అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ హబ్ కావడంతో ఇది అధునాతన భద్రత... ఆన్‌లైన్ భద్రతా ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించనుంది. అత్యాధునిక పరిశోధన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత భద్రత, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, పరిశోధకులకు ఈ సేఫ్టీ సెంటర్ సహకార వేదికగా ఉపయోగపడుతుంది. దేశంలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించి, ఉపాధి పెంచడం, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలు పెంపొందించే లక్ష్యంగా ఈ సెంటర్ పని చేయనుంది. ఈ ఏడాది అక్టోబరు మూడో తేదీన జరిగిన గూగుల్ ఫర్ ఇండియా 2024 కాన్‌క్లేవ్‌లోనే సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ ఏర్పాటు విషయాన్ని ఆ కంపెనీ ప్రకటించింది. అప్పటి నుంచి జీఎస్ఈసీని తమ రాష్ట్రంలోనే నెలకొల్పాలని, గూగుల్ పెట్టుబడులను ఆహ్వానించేందుకు వివిధ రాష్ట్రాలు పోటీ పడ్డాయి. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన సందర్భంగా గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. అప్పటి నుంచి హైదరాబాద్‌లో ఈ అత్యాధునిక సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది.

చట్టసభల్లో కొరవడిన స్ఫూర్తి

- రాజకీయాల్లో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం
- హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం
- వర్ధంతి సభలో సీఎం రేవంత్

2లో

తొలగిన ప్రతిష్టంభన

నేడు సీఎంగా ఫడ్నవీస్ ప్రమాణం

ముంబై: మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై ప్రతిష్టంభనకు తెరపడింది. ముఖ్యమంత్రిగా బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్ పేరు ఖరారైంది. బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో ఫడ్నవీస్ పేరు ప్రతిపాదించగా... ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆ తర్వాత బీజేపీ శాసనసభాపక్ష సమావేశంలో ఫడ్నవీస్‌ను తమ నేతగా ఎన్నుకున్నారు. దీంతో గురువారం ఆయన మహారాష్ట్ర సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. కోర్ కమిటీ భేటీ తర్వాత విధాన్ భవన్‌లో బీజేపీ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. కేంద్ర పరిశీలకులుగా నిర్మలా సీతారామన్, విజయ్ రూపానీ హాజరయ్యారు. సీఎం ఎంపికపై ఎమ్మెల్యేలతో వారు చర్చించారు. బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఫడ్నవీస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫడ్నవీస్ ఎన్నికతో ముంబైలోని ఆజాద్ గ్రౌండ్స్‌లో ప్రమాణస్వీకారం కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాని మోదీ సహా ఎన్డీయే కీలక నేతలు హాజరుకానున్నారు. సీఎంగా ఫడ్నవీస్‌తో పాటు శివసేన నేత ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీ నేత అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణస్వీకారం చేస్తారని తెలుస్తోంది. ఆ తర్వాత మహారాష్ట్రలో 'మహాయుతి' కూటమి కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన తర్వాత ఫడ్నవీస్... భాగస్వాములైన ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌తో కలిసి గవర్నర్ రాధాకృష్ణన్‌ను రాజ్‌భవన్‌లో కలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరారు. 288 శాసనసభ స్థానాలు ఉన్న మహారాష్ట్రలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. 230 స్థానాలతో భారీ మెజార్టీ దక్కించుకుంది.

ఇదీ లోకం!

మనుషులను ఉతికే వాషింగ్ మెషీన

ఆలయాల్లో మౌలిక వసతులు

మంత్రి సురేఖ

విశాలాంధ్ర-హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాలయాలను వైభవోపేతంగా తీర్చిదిద్దుతూనే, సామాన్య భక్తులకు దృష్టిలో పెట్టుకుని మౌలిక సౌకర్యాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చిందని దేవదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి తొమ్మిది వరకు నిర్వహిస్తున్న ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా తమ శాఖ సాధించిన వార్షిక ప్రగతి నివేదికను మంత్రి బుధవారం శ్రీనగర్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆవిష్కరించారు. సుదర్శన, గణపతి, నవగ్రహ చండీ హోమాలు, పూర్ణాహుతి పూజల్లో పాల్గొన్నారు. మంత్రి సురేఖ మాట్లాడుతూ దేవాలయాలను ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ప్రజల నమ్మకాలు, విశ్వాసాలకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రంలో సమ్మక్క, సారలమ్మ జాతర, బోనాల జాతరను ప్రభుత్వం విజయవంతంగా చేపట్టిందని

- మిగతా 2 లో

రాహుల్... ప్రియాంక అడ్డగింత

- సంభల్ వెళ్లకుండా నిలువరించిన పోలీసులు
- ఘాజీపూర్ సరిహద్దులో ఉద్రిక్తత
- ఇది రాజ్యాంగంపై దాడి: రాహుల్ గాంధీ
- అప్రజాస్వామిక చర్య: ప్రియాంక వాద్రా

న్యూదిల్లీ/ఘాజీపూర్: దేశ రాజధాని దిల్లీ సరిహద్దుల్లో బుధవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని సంభల్‌లో ఇటీవల హింసాత్మక ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల్లో బాధితులను పరామర్శించేందుకు బయలుదేరిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాను పోలీసులు అడ్డుకున్నారు. స్థానికేతరులు అక్కడికి రావడంపై ఆంక్షలున్న నేపథ్యంలో ఘాజీపూర్ సరిహద్దు వద్ద కాంగ్రెస్ ఎంపీల వాహనాలను యూపీ పోలీసులు అడ్డగించారు. రాహుల్, ప్రియాంక సంభల్ పర్యటనకు సిద్ధమైన నేపథ్యంలో ఉదయం నుంచే ఘాజీపూర్ సరిహద్దు వద్ద భారీగా పోలీసులు

- మిగతా 2 లో

యూన్ రాజీనామా చేయాల్సిందే

ద.కొరియా అధ్యక్షుడిపై అభిశంసనకు విపక్షాల పట్టు

మార్షల్ షా వ్యతిరేక తీర్మానానికి పార్లమెంటు ఆమోదం

సియోల్: దక్షిణ కొరియా రాజకీయ సంక్షోభంలో చిక్కుకుంది. అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ దేశంలో అత్యవసరంగా మార్షల్ లా విధిస్తూ ప్రకటన చేయడంతో విపక్షాలు మండిపడ్డాయి. అధ్యక్షుడిపై అభిశంసనకు పార్లమెంటులో తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. మార్షల్ లా అమలును వ్యతిరేకిస్తూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. మార్షల్ లా అమలు చట్టవిరుద్ధం అంటూ స్పీకర్ ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో అధ్యక్షుడు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నా... పదవికి రాజీనామా చేయాల్సిందేనని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. దక్షిణ కొరియాలోని ముఖ్యమైన కార్మిక సంఘం సైతం యూన్ రాజీనామాకు పట్టుబడుతోంది. విద్రోహ చర్యలకు పాల్పడుతున్నారని, ఉత్తర కొరియాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ అత్యవసరంగా మార్షల్ లా విధిస్తూ అధ్యక్షుడు ప్రకటించారు. యూన్ సుక్ యోల్ అధ్యక్ష పదవి నుంచి వైదొలిగే యోచనలో ఉన్నట్లు ఆయన సీనియర్ సలహాదారులు, కార్యదర్శులు చెబుతున్నారు. మరోవైపు కేబినెట్ మంత్రులు సైతం సామూహిక రాజీనామాలకు సిద్ధమైనట్లు తెలిసింది. ఇప్పటికే రక్షణ మంత్రి తన రాజీనామా లేఖను సమర్పించారని స్థానిక మీడియా తెలిపింది. మార్షల్ లా విధించడంపై దక్షిణ కొరియా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. వేలాది మంది వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. రాజధాని సియోల్‌లోని గ్వాంఘమున్ స్క్వేర్ వద్ద 'అక్రమంగా మార్షల్ లాను యోన్ సుక్ యోల్ విధించడాన్ని ఖండిస్తున్నాం' అన్న బ్యానర్‌తో భారీ ప్రదర్శన నిర్వహించారు. మంగళవారం రాత్రి కూడా అనేక మంది వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. యూన్‌ను తక్షణమే వైదొలగాలని లిబరల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ కొరియా (డీపీకే) డిమాండ్ చేసింది. మార్షల్ లా అమలు చేయడం రాజ్యాంగాన్ని తీవ్రంగా ఉల్లంఘించడమే అని పేర్కొంది. కాగా, యూన్‌ను అభిశంసించాలంటే పార్లమెంటులో మూడింట రెండొంతుల మంది లేదా 300 మంది సభ్యులలో 200 మంది మద్దతు అవసరం. డెమొక్రటిక్ పార్టీ, ఇతర విపక్ష పార్టీలకు కలిపి 192 సీట్లు ఉన్నాయి.

పీపుల్స్ పవర్ పార్టీ (పీపీపీ)కి చెందిన పది మంది కూడా వ్యతిరేకంగా ఓటు వేసినట్లు పార్లమెంట్ వర్గాలు తెలిపాయి. దీంతో యూన్ పదవిని కోల్పోయే అవకాశముంది. యూన్ అభిశంసను గురైతే దేశంలో నం.2 గా ఉన్న ప్రధాని హాన్ డక్ సూ అధ్యక్ష బాధ్యతలను చేపట్టాల్సి వస్తుంది.

పలస్తీనాను ఇజ్రాయిల్ వీడాలి

ఐరాసలో తీర్మానం: మద్దతిచ్చిన భారత్ సహా 157 దేశాలు

ఐరాస: పలస్తీనా భూభాగాన్ని ఇజ్రాయిల్ ఛిద్రం చేస్తోంది. వైమానిక, భూతల దాడులతో నిత్యం ప్రాణ, ఆస్తి నష్టం కలగజేస్తోంది. మానవతా సంక్షోభ పరిస్థితులను తీవ్రరం చేస్తోంది. పలస్తీనా ప్రజలకు గుక్కెడు మంచినీళ్లు, ఆహారం లభించని పరిస్థితులు దాపురించేలా చేసి కర్కశంగా వ్యవహరిస్తోంది. ఈ పరిస్థితుల్లో అంతర్జాతీయ సమాజం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇజ్రాయిల్ తీరును ఆక్షేపిస్తోంది. పలస్తీనా భూభాగంలో దురాక్రమణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తోంది. తాజా పరిణామాల దృష్ట్యా పలస్తీనా నుంచి ఇజ్రాయిల్ దళాల ఉపసంహరణకు డిమాండ్ చేస్తూ ఐక్య రాజ్య సమితి సర్వసభ్య సమావేశం ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. దీనిపై ఓటింగ్ నిర్వహించింది. దీనికి భారత్ అనుకూలంగా ఓటేసింది. పలస్తీనా డిమాండ్‌కు మద్దతు తెలిపింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తెర దించి... శాశ్వతంగా శాంతిని నెలకొల్పాలని సభలో భారత్ పేర్కొంది. తమ భూభాగాలను ఇజ్రాయిల్ ఆక్రమించుకోవడం చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని అంతర్జాతీయ న్యాయస్థానానికి పలస్తీనా విన్నవించింది. దీంతో ఐరాస సర్వసభ్య సమావేశం తాజా తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. 1967 నుంచి తూర్పు జెరూసలెంతో పాటు అనేక ప్రాంతాలను ఇజ్రాయిల్ ఆక్రమించడంపై శాంతియుత పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన ముసాయిదా తీర్మానంపై ఐరాసలో ఓటింగ్ నిర్వహించగా, భారత్‌తో సహా 157 దేశాలు అనుకూలంగా ఓటు వేశాయి. అమెరికా, ఇజ్రాయిల్, అర్జెంటీనా సహా ఎనిమిది దేశాలు వ్యతిరేకంగా ఓటేశాయి. ఉక్రెయిన్, ఉరుగ్వే, పరాగ్వే, జార్జియా, ఈక్వెడార్, చెకియా, కామెరూన్ దేశాలు ఓటింగ్‌లో పాల్గొనలేదు.

నేపాల్, చైనా మధ్య అవగాహన ఒప్పందాలు

బీజింగ్: నేపాల్, చైనా దేశాధినేతలు కలిసి ముందుకెళ్లాలని సంకల్పించాయి. కొన్ని అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి చైనా పర్యటన క్రమంలో రెండు దేశాల మధ్య తొమ్మిది అంశాల ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయిన ఓలీ అనేక అంశాలపై చర్చించారు. బీజింగ్‌లోని స్టేట్ హాల్‌లో వీరిద్దరు సమావేశమయ్యారు. పారిశ్రామికాభివృద్ధి, మౌలికాభివృద్ధి, వాణిజ్యం, పర్యాటకం సహా అనేక రంగాల్లో సయోధ్య పెంచుకోవాలని నిర్ణయించారు. అవగాహనా ఒప్పందాలతో సహా తొమ్మిది అంశాల ఒప్పందంపై ఇద్దరు నేతలు సంతకాలు చేశారని నేపాల్ విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి కృష్ణ ప్రసాద్ ధాకల్ ప్రకటించారు. నేపాల్-చైనా వాణిజ్య అభివృద్ధి, ఆర్థిక, సాంకేతిక సహకారం, నిర్మాణ పనులు, ఇరు దేశాల మీడియాల మధ్య కమ్యూనికేషన్ టెక్నాలజీలో సహకారంపై అవగాహన ఒప్పందాలు కుదిరాయని వెల్లడించారు.

బాదల్‌పై హత్యాయత్నం

(మొదటిపేజీ తరువాయి)

చోటుచేసుకుంది. శిక్షలో భాగంగా స్వర్ణ దేవాలయ ప్రవేశద్వారం వద్ద సుఖ్‌బీర్ చక్రాల కుర్చీపై కూర్చొని సేవాదార్ (కాపలాదారుడు)గా ఉండగా... ఓ వృద్ధుడు ఆయనను సమీపించాడు. కొన్ని అడుగుల దూరంలోనే ఉన్న అతడు తుపాకీతో సుఖ్‌బీర్‌పై కాల్పులు జరిపాడు. దీనిని గమనించిన సుఖ్‌బీర్ వ్యక్తిగత సిబ్బంది వెంటనే వృద్ధుడిని అడ్డుకొని పక్కకు తీసుకెళ్లడంతో ప్రమాదం తప్పింది. భద్రతా సిబ్బంది అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో సుఖ్‌బీర్‌కు ఎలాంటి హానీ జరగలేదు. ఈ ఘటనపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ స్పందించారు. 'సుఖ్‌బీర్ బాదల్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. దీనిపై తక్షణమే దర్యాప్తు చేపట్టి నివేదిక సమర్పించాలని పోలీసులను ఆదేశించా' అని వెల్లడించారు. కాల్పుల ఘటన అనంతరం సుఖ్‌బీర్ తన శిక్ష కొనసాగించారు. సతీమణి హర్ సిమ్రత్ కౌర్ బాదల్‌తో కలిసి స్వర్ణదేవాలయంలో వంటపాత్రలు శుభ్రం చేశారు. నిందితుడిని నరైన్ సింగ్ చౌరాగా గుర్తించారు. అతడు గతంలో బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ అనే ఉగ్రముఠాలో పనిచేసినట్లు ఆంగ్ల మీడియాల్లో కథనాలు వచ్చాయి. 1984లో నరైన్ సింగ్ సరిహద్దులు దాటి పాకిస్థాన్ వెళ్లినట్లు కథనాలు పేర్కొన్నాయి. పంజాబ్‌లోకి అక్రమ ఆయుధాలు తేవడం, పేలుడు పదార్థాల రవాణాలో అతడు కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. ఆ తర్వాత కొంతకాలానికి భారత్ తిరిగొచ్చిన అతడిని పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు. కొన్నాళ్ల పాటు జైలుశిక్ష అనుభవించినట్లు తెలుస్తోంది. శిరోమణి అకాలీదళ్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ మతపరమైన తప్పిదాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. 2007-17 మధ్యకాలంలో పార్టీతోపాటు ఆయన ప్రభుత్వం రాజకీయంగా తప్పుడు నిర్ణయాలు తీసుకున్నట్లు అకల్ తఖ్త్ నిర్ధారించింది.

పురుషులకూ నెలసరి వస్తే తెలిసేది

(మొదటిపేజీ తరువాయి)

మరో ఇద్దరికి మాత్రం ఉపశమనం కలగలేదు. ఇందులో ఓ న్యాయమూర్తి తనకు గర్భస్రావం కావడంతోపాటు తన సోదరుడు కేన్సర్ బారినపడినట్లు హైకోర్టు ధర్మాసనం ముందు వివరణ ఇచ్చినప్పటికీ ఎటువంటి ఫలితం కనిపించలేదు. ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. 'ఆ మహిళా న్యాయమూర్తికి గర్భవిచ్ఛిత్తి జరిగింది. అటువంటి మహిళ మానసికంగా, శారీరకంగా ఎంతో వేదనకు గురయ్యే అవకాశం ఉంటుంది. పురుషులకూ నెలసరి వస్తే సమస్య ఏమిటనేది తెలిసేది' అని జస్టిస్ బీవీ నాగరత్న వ్యాఖ్యానించారు. ఆరోగ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం పనితీరు ఆధారంగా ఆమెను తొలగిస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టారు. అటువంటి ప్రమాణాలు పురుష న్యాయమూర్తులకూ ఉండాలని ఆశిస్తున్నట్లు చెప్పారు.

రైతులకు ఈ దుస్థితి ఎందుకు?

(మొదటిపేజీ తరువాయి)

శిఖరాలవైపు పయనిస్తోంది. అయితే, రైతులు మాత్రం ఆందోళన చేస్తున్నారు. రోడ్లపైకెక్కి తమ ఆవేదన వెలిబుచ్చుతున్నారు. దేశంలో రైతు మాత్రమే అసహాయుడిగా మిగిలిపోతున్నాడు. అసలేం జరుగుతోంది?' అంటూ మంత్రిని ధన్కర్ ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన హామీలు ఏంటి... వాటిని ఎందుకు అమలు చేయలేకపోతున్నామని ధన్కర్ నిలదీశారు. రైతులు గతేడాది ఆందోళన చేశారు... ఈ ఏడాది ఇప్పుడు కూడా ఆందోళన చేస్తున్నారని గుర్తుచేశారు. అయితే, కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దీనికి ఎలాంటి జవాబు ఇవ్వలేదు. ఉపరాష్ట్రపతి ప్రశ్నలకు చౌహాన్ మౌనాన్ని ఆశ్రయించారు. గత పదిహేనేళ్లుగా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా వ్యవహరించిన శివరాజ్ సింగ్ చౌహాన్ ను బీజేపీ హైకమాండ్ కేంద్ర కేబినెట్ లోకి తీసుకుని వ్యవసాయ శాఖను అప్పగించిన విషయం తెలిసిందే.

చట్టసభల్లో కొరవడిన స్ఫూర్తి

విశాలాంధ్ర-హైదరాబాద్: నేడు చట్టసభల్లో ఆనాటి స్ఫూర్తి పూర్తిగా కొరవడిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతిపక్షాలకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వొద్దన్నట్టుగా పరిస్థితులు తయారయ్యాయన్నారు. హైటెక్స్ లో బుధవారం మాజీ గవర్నర్, మాజీ సీఎం రోశయ్య మూడో వర్ధంతి సభ జరిగింది. సీఎం రేవంత్... రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఎం మాట్లాడుతూ శాసనమండలి, శాసనసభలో పోటీపడి మాట్లాడాలన్న స్ఫూర్తిని రోశయ్య తమకు ఇచ్చారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆర్థిక మంత్రిగా రోశయ్య క్రమశిక్షణ పాటించడం వల్లనే రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ ఏర్పడిందని గుర్తు చేశారు. చుక్క రామయ్య, ప్రొఫెసర్ నాగేశ్వర్, రోశయ్య వంటి వారి మధ్య శాసనమండలిలో ఎమ్మెల్సీగా మాట్లాడేందుకు తాను భయపడ్డానని చెప్పారు. నీటి పారుదల శాఖపై మండలిలో తాను మాట్లాడినప్పుడు ... రోశయ్య తన ఛాంబర్‌కు పిలిపించుకొని తనను ప్రోత్సహించారన్నారు. ప్రతిపక్ష సభ్యుడినైనప్పటికి మండలి గౌరవం పెంచాలన్న ఉద్దేశంతో రోశయ్య ఆనాడు అలా వ్యవహరించారన్నారు. ప్రతిపక్షంలో ఉంటే ప్రశ్నించాలి ... పాలక పక్షంలో ఉంటే పరిష్కరించాలని రోశయ్య నాకు సూచించారన్నారు. రోశయ్య కుటుంబం రాజకీయాల్లో లేకపోయినా... 50 ఏళ్లపైగా ఆయన రాజకీయాల్లో గొప్పగా రాణించారని కొనియాడారు. తమిళనాడు గవర్నర్‌గా వివాదాలు లేకుండా రాణించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పదవి కోసం ఏనాడు రోశయ్య తాపత్రయపడలేదని, పార్టీ క్లిష్ట సమయంలో రోశయ్యను ముఖ్యమంత్రి చేయాలని సోనియా గాంధీ నిర్ణయించారన్నారు. రాష్ట్ర ఆర్థిక ఎదుగుదల ఆర్యవైశ్యుల చేతిలో ఉందని, మీరంతా తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లు కావాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో ఆర్య వైశ్యులకు సముచిత స్థానం ఇస్తామని భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లో ప్రభుత్వం తరపున రోశయ్య విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు.

విలువలకు చిరునామా రోశయ్య: భట్టి

విలువలు, ప్రశాంతతో కూడిన జీవితాన్ని గడిపి రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలిచిన ఆర్థిక చాణిక్యుడు కొణిజేటి రోశయ్య అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీర్తించారు. ఆయన క్రమశిక్షణ, నిజాయితీ... విద్యార్థి సంఘం నాయకుడి నుంచి ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా రోశయ్య ఎదిగేందుకు దోహదపడింది అన్నారు. ఆయన ఆర్థిక మంత్రిగా, సీఎంగా ఉన్న సమయంలో ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, చీఫ్ విప్‌గా ఆయన నాయకత్వంలో పని చేసే అదృష్టం తనకు కలిగిందన్నారు. రాజనీతి, సరళమైన భాష, ప్రతిపక్షాల విమర్శలకు సహేతుకమైన సమాధానాలతో ప్రభుత్వాన్ని నిలబెట్టిన విధానం అందరికీ ఆదర్శం అన్నారు. వ్యక్తిగత దూషణలు లేకుండా సమాధానం చెప్పే విధానం రోశయ్య దగ్గర నేర్చుకోవాలన్నారు. అత్యధిక సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత ఉమ్మడి రాష్ట్రంలో ఆయనకే దక్కిందన్నారు. ఆచార్య ఎన్.జి.రంగా శిష్యునిగా వ్యవసాయ రంగంపై అవగాహన పెంచుకొని ఆయనకు ప్రియ శిష్యునిగా గుర్తింపు సాధించారని వివరించారు. మహాత్మా గాంధీ, కాంగ్రెస్ సిద్ధాంతాలు, ఆలోచనలను ఆయన ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లారని పేర్కొన్నారు.

ఆలయాల్లో మౌలిక వసతులు

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. తెలంగాణ కుంభమేళాగా ఖ్యాతిగాంచిన సమ్మక్క-సారలమ్మ జాతర నిర్వహణకు రూ.110 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. కార్తీక మాసంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరివేసేలా సామూహిక కార్తీకమాస దీపోత్సవాలను నిర్వహించినట్టు పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో మొదటిసారిగా 126 ఉత్సవ కమిటీలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 408 దేవాలయాలకు ట్రస్ట్ బోర్డుల ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇచ్చినట్టు చెప్పారు. 33 మంది జూనియర్ అసిస్టెంట్లకు ప్రభుత్వం గ్రేడ్-××× ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లుగా పదోన్నతి కల్పించినట్టు చెప్పారు. భద్రాచలం, బాసర, అలంపూర్ జోగులాంబ దేవాలయాల్లో నదీ హారతి దేదీప్యమానంగా చేపట్టామని వివరించారు. ఆలయ భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు ఇందిరా మహిళా శక్తి గ్రూపులతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్టు వివరించారు. పర్యాటక శాఖతో అనుసంధానమై మూడు టెంపుల్ టూరిజం సర్క్యూట్‌లను తీర్చిదిద్దుతున్నట్టు మంత్రి స్పష్టం చేశారు. సీజీఎఫ్ నిధులు రూ.10.37 కోట్లతో 25 పనులు మంజూరు చేసినట్టు చెప్పారు. దాదాపు రూ.400 కోట్లతో ఆలయాల అభివృద్ధి పనులతో పాటు మౌలిక వసతులు చేపడుతున్నామన్నారు. దేశంలోనే ఎత్తైన స్వర్ణ గోపురంగా యాదాద్రి దేవాలయం ఖ్యాతిగాంచనుందని మంత్రి చెప్పారు. వేములవాడ, భద్రాచలం ఆలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌లతో ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. తొలుత మంత్రి సురేఖకి వేదపండితులు ఆలయలాంఛనాలతో స్వాగతం పలికారు. దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, అడిషనల్ కమిషనర్ జ్యోతి, కృష్ణవేణి, అసిస్టెంట్ కమిషనర్లు అంబుజ, లావణ్య, అంజానారెడ్డి, రామాంజనేయులు, సంధ్యారాణి, బాలాజి, ఈవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్, ఆలయ ఈవో శ్రీనివాస శర్మ, టెంపుల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రంగారెడ్డి పాల్గొన్నారు.

అసోంలో బీఫ్‌పై నిషేధం

(మొదటిపేజీ తరువాయి)

ప్రదేశాల్లో బీఫ్ తినడం, వడ్డించడంపై నిషేధం విధించాలని నిర్ణయించాం' అని విలేకరుల సమావేశంలో సీఎం తెలిపారు. 'గో హత్యలను నిషేధిస్తూ మూడేళ్ల కిందట చట్టం తెచ్చాం. ఇప్పుడు బీఫ్‌ను నిషేధిస్తున్నాం. ఇప్పటివరకు ఉన్న చట్టం ప్రకారం ఆలయాలకు ఐదు కిమీల పరిధిలో బీఫ్ అమ్మడం, తినడంపై నిషేధం ఉండేది కానీ ఇకపై రాష్ట్రమంతటా నిషేధం ఉంటుంది' అని బిశ్వశర్మ వెల్లడించారు.

కంపించిన భూమి



(మొదటిపేజీ తరువాయి)

గుర్తించారు. ఇక ఏపీలో విజయవాడ, జగ్గయ్యపేట, నందిగామ, ఏలూరు, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో స్వల్పస్థాయిలో భూ ప్రకంనలు చోటు చేసుకున్నాయి. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరంతోపాటు నందిగామ, గంపలగూడెం, తిరువూరు, పెనుగ్రంచిప్రోలు, జగ్గయ్యపేట పరిసర గ్రామాల్లో సైతం కొద్ది సెకన్లపాటు భూమి కంపించింది. దీంతో ఇళ్లు, అపార్ట్‌మెంట్ల నుంచి ప్రజలు ప్రాణ భయంతో బయటకు పరుగులు పెట్టారు. పెనుగంచిప్రోలు, గంపలగూడెం, పాత తిరువూరులో కొన్ని సెకన్లపాటు ప్రకంపనలు వచ్చాయని స్థానికులు చెబుతున్నారు. మైలవరం నియోజకవర్గంలో ఇదే పరిస్థితి కనిపించింది. రెడ్డిగూడెం, నందిగామ, కంచికచర్ల మండలాల్లోనూ స్వల్పంగా భూమి కంపించింది. విస్సన్నపేటలో బుధవారం ఉదయం అనేక ప్రాంతాల్లో భూ ప్రకంపనలు రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ మండలంలోని కమ్మటూరు, నిమ్మతోట, యాదబజారులోని అనేక అపార్టుమెంట్లలో పై అంతస్తుల్లో ఉన్న వారికి భూకంపం వచ్చినట్లు స్పష్టం తెలిసింది. ఏలూరు జిల్లా నూజివీడులోనూ భూప్రకంపనలు వచ్చాయి. కొన్ని సెకన్లపాటు ఇళ్లు, భవనాలు కదిలినట్లు స్థానికులు చెబుతున్నారు. రాజమహేంద్రవరంలో అతి స్వల్పంగా భూ ప్రకంపనలు వచ్చాయని తెలిసింది. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం, వేలేరుపాడు, కుక్కునూరు, బుట్టయగూడెం, టి.నరసాపురం మండలం బొర్రాంపాలెం, జంగారెడ్డిగూడెంలో భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. ఈ భూ ప్రకంపనల వల్ల ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. 40కిలో మీటర్ల లోతులో ప్రకంపనలు వచ్చాయని, భూకంప కేంద్రం ఎక్కువ లోతులోఉ న్నందున ప్రకంపనల తీవ్రత తక్కువగా ఉందని తెలంగాణ విపత్తు నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విండ్ కుమార్ వెల్లడించారు. ప్రస్తుతానికి ఈ భూప్రకంపనల వల్ల ఎలాంటి నష్టం జరగలేదని, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని చెప్పారు.

మేడారంలో కూలిన వృక్షాలు

తెలంగాణ రాష్ట్రంలోని ములుగు జిల్లా మేడారంలో భూకంప కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. మేడారంలో సెప్టెంబర్ 4న లక్ష వృక్షాలు కూలిపోయాయి. సరిగ్గా నాలుగు నెలల తర్వాత ఇప్పుడు అదే ప్రాంతంలో భూకంపం వచ్చినట్లు తెలుస్తోంది. ములుగు నుంచి 50 కిలోమీటర్ల ఈశాన్యం వైపు ఏటూరు నాగారం భూ కంప కేంద్రంలో రిక్టర్ స్కేల్‌పై 5.0గా భూకంప తీవ్రత నమోదైందని వరంగల్ కాకతీయ వర్సిటీ జియాలజీ విభాగాధిపతి ఆర్.మల్లికార్జునరెడ్డి వెల్లడించారు. దీని ప్రభావంతో ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లెలో ఓ ఇంటి గోడ కూలిపోయింది. భూమి పగుళ్లలో ఒత్తిడితో స్థానచలనం కలిగి ప్రకంపనలు వస్తుంటాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. వాతావరణంలోచోటు చేసుకున్న మార్పులకు, భూ ప్రకంపనలకు సంబంధంలేదని చెబుతున్నారు.

ఏపీలో అతి స్వల్పంగానే...

ఏపీలో స్వల్పంగా సంభవించిన భూప్రకంపనలు రిక్టర్ స్కేలుపై మూడు పాయింట్లలోపే నమోదై ఉంటుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారి రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. రాష్ట్రంలో అనేక చోట్ల రెండు నుంచి మూడు సెకన్లు మాత్రమే భూమి కంపించిందని తెలిపారు. తెలంగాణ ములుగు జిల్లాలో 5.3 తీవ్రత నమోదు కాగా...ఏపీలో రాజమండ్రి వరకు 230 కిలోమీటర్లు వాయువ్య దిశలో దాని ప్రభావం 2.9 లోపుగా ఉంటుందని వివరించారు.

ఏపీలో చాలా స్వల్ప స్థాయిలో భూమి కంపించిందని, 12 స్థాయిలతో కూడిన భూకంప తీవ్రత జాబితాలో ఇది రెండో స్థానమేనని, దీన్ని ఫీబుల్ స్థాయి అని పిలుస్తారని పేర్కొన్నారు. ఫీబుల్ స్థాయిలో భూకంపం సంభవిస్తే ఎలాంటి ప్రమాదాలకు అవకాశం ఉండబోదని, ప్రజలెవరూ ఆందోళన చెందొద్దని భరోసానిచ్చారు. సిస్మిక్ జోన్ పరంగా చూసినా ప్రస్తుతానికి ఏపీ సేఫ్ జోన్‌లోనే ఉందని స్పష్టంచేశారు.

రాకేశ్ తికైత్ అరెస్టు

గ్రేటర్ నోయిడా వెళ్లకుండా అడ్డుకున్న అలీగఢ్ పోలీసులు

న్యూఢిల్లీ: ఢిల్లీకి రైతాంగం కదం తొక్కిన క్రమంలో గ్రేటర్ నోయిడా సమావేశానికి వెళ్లకుండా బీకేయూ నేత రాకేశ్ తికైత్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ఆయనను అదుపులోకి తీసుకొన్నారు. బీకేయూ నేతను, ఆయన సహచరులను ఒక బస్సులో తప్పల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. తికైత్‌ను నిర్బంధించామేగానీ అరెస్టు చేయలేదంటూ అలీగఢ్ పోలీసుల అధికారి వెల్లడించారు. గ్రేటర్ నోయిడాకు వెళ్లే క్రమంలో ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు అధికారి ఒకరు చెప్పారు. వారిని యమునా ఎక్స్‌ప్రెస్ వే వద్ద అడ్డుకున్నట్లు వెల్లడించారు. తికైత్ విలేకరులతో మాట్లాడుతూ నోయిడాలోని గౌతం బుద్ధనగర్‌కు వెళ్లే రైతులను పోలీసులు అడ్డుకుంటున్నారని, వారిని గడప దాటనివ్వడంలేదని అన్నారు. 'మమ్మల్ని ఎప్పటివరకు నిర్బంధిస్తారు? మమ్మల్ని బయటకు రానివ్వకుండా తాళాలు వేసివుంచితే ఎవరితో మాట్లాడతారు? అని ప్రశ్నించారు. అధికారులు ఇదే ధోరణి కొనసాగిస్తేగనుక రైతుల ఆందోళన మరింత ఉగ్రరూపం దాల్చుతుందని తికాయత్ హెచ్చరించారు. ముజఫర్‌నగర్‌లోని సిసౌలీ గ్రామంలోని కిసాన్ భవన్‌లో అత్యవసర సమావేశానికి బీకేయూ మంగళవారం పిలుపునిచ్చింది. నోయిడా, గ్రేటర్ నోయిడాలో రైతుల ఆందోళనకు మద్దతివ్వాలని సంకల్పించింది. పశ్చిమ ఉత్తరప్రదేశ్ జిల్లాలోని తమ కార్యకర్తలు, సభ్యులను కదలి రావాలని, గ్రేటర్ నోయిడాలోని జీరో పాయింట్‌కు చేరుకోవాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు పార్టీ యూత్ వింగ్ అధ్యక్షుడు అనుజ్ సింగ్ వెల్లడించారు.

6న పంజాబ్ రైతుల దిల్లీ చలో

తమకిచ్చిన డిమాండ్ల అమలులో రాజకీయ పార్టీల అలసత్వంపై అసహనంతో, అన్ని పంటలకు ఎంఎస్‌పీకి చట్టబద్ధత కోసం పంజాబ్ రైతులు 'ఢిల్లీ చలో'ను శుక్రవారం చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి తమ డిమాండ్లను పరిష్కరించుకోవాలని రైతులు సంకల్పించారు. ఢిల్లీ చలోకు కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం), సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయతర) పిలుపు మేరకు రైతులు ఈనెల 6వ తేదీన ఢిల్లీకి కదం తొక్కనున్నారు. ఉత్తరప్రదేశ్ రైతులు కూడా ఢిల్లీ చలో తరహా ఆందోళనను ఇదే సమయంలో చేపట్టడంతో నోయిడా-ఢిల్లీ సరిహద్దు వద్ద పోలీసులు భారీ బందోబస్తు చేశారు.

రైతుల సమస్యల పరిష్కారానికి యూపీ ప్రభుత్వ కమిటీ

ఉత్తరప్రదేశ్ రైతులు ఆందోళన బాట పట్టడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారానికి ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా ఐఏఎస్ అధికారి అనిల్ కుమార్ సాగర్ వ్యవహరిస్తారు. ఈ కమిటీ నెలరోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని, సిఫార్సులు చేయాలని ఉత్తర్వులు పేర్కొన్నాయి.

రాహుల్... ప్రియాంక అడ్డగింత

(మొదటిపేజీ తరువాయి)

మోహరించారు. బారికేడ్లు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నేతలు అక్కడికి చేరుకోగా పోలీసులు నిలువరించారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసుల తీరుపై కాంగ్రెస్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బారికేడ్లు ఎక్కి నిరసన తెలిపారు. రాహుల్ కారు దిగి పోలీసులతో మాట్లాడినప్పటికీ వారు అనుమతివ్వలేదు. చేసేదేమీ లేక రాహుల్, ప్రియాంక సరిహద్దు నుంచే వెనుదిరిగి ఢిల్లీ వెళ్లారు.

ఒంటరిగా వెళతానన్నా అనుమతించలేదు...

ఈ ఘటనపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ పోలీసులు తన కాన్వాయ్‌ను ఘాజీపూర్ సరిహద్దులో నిలిపివేశారని, హింసాత్మక సంభల్‌లో తన ప్రణాళికాబద్ధమైన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేత హోదాలో బాధిత పౌరులను కలుసుకునేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కును ఉల్లంఘించడమేనని గాంధీ విమర్శించారు. 'నేను పోలీసులతో ఒంటరిగా వెళతానని ప్రతిపాదించాను. కానీ వారు నిరాకరించారు. కొన్ని రోజుల తర్వాత తిరిగి రావాలని కోరారు. ఇది నాపై దాడి మాత్రమే కాదు. డా.అంబేద్కర్ రాజ్యాంగానికి ముప్పు' అని తెలిపారు. 'లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా అక్కడికి వెళ్లడం నా హక్కు. కానీ వారు నన్ను అడ్డుకుంటున్నారు. సంభల్ వెళ్లి అక్కడి పరిస్థితుల గురించి తెలుసుకోవాలనుకుంటున్నాం. అక్కడ ఏం జరుగుతోందో చూడాలనుకుంటున్నాం. కానీ మమ్మల్ని అక్కడికి వెళ్లకుండా అడుగడుగునా అడ్డుకుంటున్నారు' అంటూ రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్‌తో పాటు వచ్చిన కాంగ్రెస్ వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా మాట్లాడుతూ తమ పర్యటనను అడ్డుకోవడం అప్రజాస్వామికమని నొక్కి చెప్పారు. 'రాహుల్ జీ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నారు. రాజ్యాంగ హక్కు కలిగి ఉన్నారు. బాధిత కుటుంబాలను కలిసేందుకు ఆయనను అనుమతించాలి' అని అన్నారు. ఉత్తర ప్రదేశ్ పోలీసులు శాంతి భద్రతలను పరిరక్షించడంలో అసమర్థులుగా ఉన్నారని తెలిపారు. మరోవైపు, ఈ పరిణామాలతో ఘాజీపూర్ సరిహద్దు వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఇదిలాఉండగా, సంభల్ జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర పెన్సియా మంగళవారం గౌతమ్ బుద్ధ్ నగర్, ఘజియాబాద్ పోలీసు కమిషనర్‌లకు, అమ్రోహా, బులంద్‌షహర్ జిల్లాల పోలీసు సూపరింటెండెంట్‌లకు లేఖ రాస్తూ, రాహుల్ గాంధీని తమ జిల్లాల సరిహద్దుల్లో ఆపాలని కోరారు. 'రాహుల్ గాంధీని సంభల్‌కు అనుమతించం. ఎందుకంటే అక్కడ నిషేధాజ్ఞలు ఉన్నాయి. పోలీసులు గాంధీని యూపీ గేటు వద్ద ఆపుతారు' అని ఘజియాబాద్ పోలీసు కమిషనర్ అజయ్ కుమార్ మిశ్రా పీటీఐకి తెలిపారు. నవంబరు 18 నుంచి సంభల్‌లో ఉద్రిక్తత ఏర్పడింది, మొఘల్ కాలం నాటి మసీదును కోర్టు ఆదేశాలపై సర్వే చేయడంతో గతంలో హరిహర ఆలయం ఆ స్థలంలో ఉందని వాదనలు జరిగాయి. నవంబరు 24న రెండో సర్వే సందర్భంగా షాహి జామా మసీదు సమీపంలో ఆందోళనకారులు గుమిగూడి భద్రతా సిబ్బందితో ఘర్షణకు దిగడంతో హింస చెలరేగింది. ఈ హింసాకాండలో నలుగురు మృతి చెందగా, అనేక మంది గాయపడ్డారు. మరోవైపు హింసను కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని ఉత్తర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ ఆరోపించారు. సెక్షన్ 144 అమలును ఉటంకిస్తూ, ఉద్రిక్తత ఉన్న ప్రాంతాల్లో పెద్దగా గుమికూడదాన్ని నిషేధిస్తూ పోలీసుల చర్యలను ఆయన సమర్థించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - కొత్తగూడెం : కొత్తగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్వర్యంలో నిర్వహించబడుతున్న సుజాతనగర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేసినారు. బుధవారం ఈ కేంద్రంలో ధాన్యంను ఆరబెట్టుకున్న రైతులతో మాట్లాడారు. ధాన్యం బాగా ఆరబెట్టుకుని తేమ శాతం 17లోపు వచ్చిన తర్వాతనే తూర్పాల పట్టాలని రైతులకి తగు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్మి మద్దతు ధరను పొందాలన్నారు. తప్పని సరిగా నిబంధనల ప్రకారం ధాన్యంలో తేమ 17 శాతంలోపే ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే రైతులు చేపలు పెంచాలని, మునగ సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వరి ధాన్యం బోనస్‌పై ఎటువంటి అపోహలు వద్దన్నారు. ఈ కార్యక్రమాల్లో డిఎస్‌సిఓ రుక్మిణిదేవి, డిఎం సివిల్ సప్లై శ్రీనాథ్ బాబు, మండల వ్యవసాయ అధికారి జి. నర్మద, తహసిల్దార్ శిరీష, ఎంపీడీఓ భారతి, డిటి ఉమామాహేశ్వరరావు, సినయర్ అసిస్టెంట్ తోలెం బాబు, మానిటరింగ్ అధికారి జయశ్రీ, ఎస్ఐ మాలోతు రామాదేవి తదితరులు పాల్గొన్నారు.

భూకంప తాకిడితో జిల్లా యంత్రాంగం అప్రమత్తం

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ములుగు జిల్లాలో బుధవారం ఉదయం ఏడు గంటల 30 నిమిషాల సమయంలో వచ్చిన భూకంప తాకిడితో జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 2 సెకండ్ల పాటు భూమి కంపించడంతో, తాను సైతం ఆందోళనలకు గురై, ఇంటి నుండి బయటకు వచ్చానని, జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకొని, అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందని అన్నారు. ప్రాణం నష్టం కానీ, ఆస్తి నష్టం గానీ జరిగిన విషయంలో వెంటనే తెలియజేయాలని అధికారులకు సూచించడం జరిగిందని వివరించారు. జిల్లాలో చిన్నచిన్న ఇండ్లున్న వారి వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు.

దాతృత్వం చాటుకున్న ఉపాధ్యాయులు

గార్ల - విశాలాంధ్ర : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన తోటి ఉపాధ్యాయుని కుటుంబాన్ని ఆర్ధికంగా సాయం చేసి బయ్యారం మండల ఉపాధ్యాయులు తమ దాతృత్వం చాటుకున్నారు. ఇటీవలే ఉపాధ్యాయుడుగా ఉద్యోగం సంపాదించిన సంద్ర ఉపేందర్ రోడ్డు ప్రమాదంలో మార్నించాడు. తోటి ఉపాధ్యాయులు బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్థిక సహాయాన్ని అందించారు. ఎంతో కష్టపడి ప్రభుత్వ ఉద్యోగం సాధించి మొదటి నెల జీతం అందుకోకుండానే ఉపేందర్ మృతి చెందడం బాధాకరమని టిఎస్ టిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాలోత్ భద్రు నాయక్ ఈ సందర్భంగా విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితి ఏ కుటుంబానికి రాకూడదన్నారు. ఆ కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, బిచ్చనాయక్, రూప్ల నాయక్, రవి, వీరన్న, దస్తగిరి, కృష్ణ, ఆవు నూరి రవి, శ్రీకాంత్, భావు సింగ్, రాము, రాజా, రాంజీ, రవీందర్ రావు, కిషన్, సత్యనారాయణ సింగ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 14న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : రాజీ మార్గమే రాజ మార్గమని, రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి సత్వర న్యాయం పొందా లని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ టి.రాజగోపాల్ పిలుపు నిచ్చారు. బుధవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవాధికార సంస్థ హాల్లో ఈ నెల 14న చేపట్టబోయే జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 14న జరగబోయే జాతీయ లోక్ అదాలకు ఉపయోగించుకొని పరిష్కారం చేసుకునేందుకు వీలున్న ప్రతి కేసులోనూ రాజీ మార్గం ద్వారా లబ్ధి పొందాలని ఆయన సూచించారు. ఎలాంటి ఫీజు లేకుండా న్యాయ సేవా సంస్థ సహకారంతో కేసులను పూర్తి చేసుకోవచ్చని ఆయన తెలిపారు. గత లోక్ అదాలత్ ద్వారా జిల్లాలో 10712 కేసులు పరిష్కరించి, రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని వివిధ కోర్టుల్లో 6277 కేసులు గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖర రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నెరేళ్ల శ్రీనివాసరావు, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

భద్రాద్రి ఏజెన్సీ జిల్లాను భయపెట్టిన భూకంపం

కొన్ని రోజుల్లో మళ్లీ వచ్చే అవకాశాలు...?

విశాలాంధ్ర బ్యూరో- కొత్తగూడెం, పినపాక : పక్క ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తెల్లవారుజామున ఏర్పడిన భూ ప్రకంపనలు ప్రజలను భయాందోళన గురిచేశాయి. జిల్లా సరిహద్దులు ఆనుకుని ఉన్న ములుగు ప్రాంతం కేంద్రంగా ఈ ప్రకంపనలు రియాక్టర్ స్కేల్‌పై 5.3గా నమోదైనట్లు తెలుస్తుంది. బుధవారం ఉదయం 7.28 నిముషాలకు జిల్లా వ్యాప్తంగా భూమి రెండు నుంచి మూడు సెకండ్ల వరకు కనిపించింది. ఎన్‌జిఆర్‌ఐ శాస్త్రవేత్త శేఖర్ దీనిపై స్పందించి మాట్లాడారు. ములుగు సమీపం లో మణుగూరు, పగిడేరు ఈ- బయ్యారం, జనంపేట, పినపాక ప్రాంతాల్లో ప్రకంపనలు అధికంగా కనిపించాయి. దీంతో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. మళ్లీ కంపనలు వస్తాయని భయంతో చాలాసేపటి వరకు రోడ్ల మీదే గడిపారు. ఉపరితలం నుంచి 40 కిలోమీటర్ల దిగువన ఫలకాల్లో చోటు చేసుకున్న పెను కదలికల వల్ల భూకంపం సంభవించినట్లు నేషనల్ సెస్మాలజీ సెంటర్ తెలిపింది. మళ్లీ భూకంపం వచ్చే అవకాశం ఎన్‌జిఆర్‌ఐ శాస్త్రవేత్త శేఖర్ వెల్లడించారు. పాత భవనాలు, నిర్మాణాలను ఖాళీ చేయడం మంచిదన్నారు. బయట ఉండటం వల్ల కరెంటు తీగలు, హెార్డింగ్ లు, పడే అవకాశాలు ఉన్నాయన్నారు. మరోసారి భూకంపం ఎప్పుడైనా వచ్చే అవకాశం ఉందని తెలియడంతో ప్రజలు భయాందోళన నెలకొన్నాయి.

చేగుంట కేజీబీవీ తనిఖీ చేసిన కలెక్టర్ రాహుల్

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: గుణాత్మక విద్య, పరిశుభ్రతతో కూడిన మెనూ జిల్లాలో అన్ని సంక్షేమ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులకు సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం చేగుంట కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్‌రూమ్, కూరగాయల నాణ్యత, పప్పు దినుసులు, విద్యార్థినీలకు వడ్డించే ఆహార పదార్థాలను పరిశీలించారు. తరగతి గదులలో విద్యార్థినుల సామర్థ్యాల ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సంక్షేమ, రెసిడెన్షియల్, పాఠశాలలు, వసతిగృహాలు, అంగన్వాడి సెంటర్లు, ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పటిష్ట పర్యవేక్షణకు జిల్లాస్థాయిలో అదనపు కలెక్టర్, డివిజనల్ స్థాయిలో ఆర్డీవో, మండల స్థాయిలో ప్రత్యేక అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తూప్రాన్ ఆర్డిఓ జయచంద్రారెడ్డి, చేగుంట తహసిల్దార్ నారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో-పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన యువ వికాసం విజయోత్సవ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సభాస్థలం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. రూ.1000 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. యువ వికాస సభను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం 9 వేల మంది నిరుద్యోగులకు నియామకపు పత్రాలు అందించే కార్యక్రమంలో నిరుద్యోగులకు నియామక పత్రాలు అందించారు. స్కిల్ యూనివర్సిటీ కోసం ఏడు కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. ముఖ్యమంత్రి బహిరంగ సభకు జిల్లా నుండి లక్ష మందికి పైగా జనం తరలివడంతో సభ సక్సెస్ కావడంతో కాంగ్రెస్ కార్యకర్తల్లో నాయకులలో నూతనోత్సాహం వచ్చింది.

జిల్లా పరిధిలో చేపట్టే రూ.1000 కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. 82 కోట్ల రూపాయలతో నిర్మించే పెద్దపల్లి బైపాస్ రోడ్డు, సుల్తానాబాద్ బైపాస్ రోడ్ల నిర్మాణాలకు, జిల్లా కేంద్రంలో రూ.5 కోట్లతో స్వశక్తి మహిళా ప్రాంగణం భవన నిర్మాణానికి, రామగుండం నియోజకవర్గంలో రూ. 60 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనులకు, మంథనిలో ఆర్అండ్‌బీ పెండింగ్ రోడ్ల పూర్తికి, రూ. 10 కోట్లతో అంతర్గాంలో, మంథని గంగపురిలో, పోతారం గ్రామంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులకు, అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లిలో బండ్లవాగు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పెద్దపల్లి జిల్లా ఎమ్మెల్యేలు జెడ్పిటిసిలు ఎంపీటీసీలు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు మంత్రి పొన్నం ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - హుస్నాబాద్ : ప్రజా పాలనలో ప్రజలకు ఇబ్బందులు కలగని వ్వమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్న ప్రభాకర్ అన్నారు. బుధవారం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో హుస్నాబాద్ ప్రజలకు అన్యాయం జరిగిందని, పార్టీలకతీతంగా హుస్నాబాద్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుపుతానన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిందని, నాటి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి పూర్తిస్థాయిలో అమలు చేసి ప్రజల్లో నిలిచామన్నారు. హుస్నాబాద్ అభివృద్ధి పథంలో నడిపేందుకు మహాసముద్రం గండి, ఎల్లమ్మ దేవాలయం, ఎల్లమ్మ చెరువు, సర్దార్ సర్వాయి పాపన్న కోట, సింగరయ్య జాతర్లను టూరిజంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు నాటి వైస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను పూర్తిచేసి హుస్నాబాద్ నియోజకవర్గంలోని 160 గ్రామాలకు సాగునీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అన్ని గ్రామాలకు సాగునీరు అందించాలంటే భూసేకరణ తప్పనిసరని, కాలువల నిర్మాణానికి రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 115 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేయడంతో పాటు ఉచిత విద్యుత్తు, రూ.500 గ్యాస్, విద్యార్థులకు కాస్మోటిక్ అండ్ డైట్ చార్జీలను 40శాతం పెంచామని ఆయన పేర్కొన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ఒక్క ఏడాదిలోనే హుస్నాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ. 1000 కోట్ల నిధులు మంజూరయ్యయని తెలిపారు. భూకంపం తీవ్రత చిన్నదైనా ప్రకృతి పరంగా ప్రమాదగంటిగా మోగితే ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. భూకంపం తీవ్రతతో ప్రాణనష్టం, ఆస్తి నష్టం సంభవించలేదని ఆయన చెప్పారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 3వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గ్రంధాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తణుకు ఆంజనేయులు, తేరాల మారుతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యా విధానానికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - చర్ల : పాఠశాలలతో పాటు గురుకులాల్లో విద్యార్థుల కోసం మౌలిక సదుపాయాలు పెంపొందించి మెరుగైన విద్యా విధానం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు అన్నారు. బుధవారం మండలంలోని మామిడి గూడెం గ్రామంలో ఉన్న అంగన్ వాడి కేంద్రంలో పిల్లలకు నూతన యూనిఫామ్ దుస్తుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు దుస్తులు పంపిణీ చేసారు. అనంతరం ఇదే గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సందర్శించి మాట్లాడారు. పాఠశాలలో మౌలిక వసతులు, భోజన సౌకర్యం, పాఠశాల కిచెన్ గది, తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో విద్యా సౌకర్యాలపై ఎమ్మెల్యే ముచ్చటించారు. ప్రధాన ఉపాధ్యాయులతో చర్చించి దిశా నిర్దేశం చేసారు. కష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాల దొంగ అరెస్టు : 8 బైకులు స్వాధీనం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బైకుల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేసినట్లు సిఐ ఎం కరుణాకర్ బుధవారం తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు సిఐ వెల్లడిరచారు. విలాసాలకు అలవాటై శ్రమ లేకుండా ఈజీ మని సంపాదించాలని ఆలోచన దొంగలా మార్చాయన్నారు. భద్రాచలం పట్టణానికి చెందిన గుమ్మడి రాజు గత కొంతకాలంగా ద్విచక్ర వాహనాలను దొంగిలించి వాటిని విక్రయిస్తూ వచ్చిన డబ్బుతో జల్సా జీవితాన్ని గడుపుతున్నట్లు చెప్పారు. మంగళవారం రాత్రి కోతగూడెం బస్టాండ్ సెంటర్‌లో పోలీసులు సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా కనిపించడంతో రాజు నూ ఆధీనంలో తీసుకొని ప్రశ్నించారు. ఇటీవల కాలంలో ఖమ్మంలో రెండు, కొత్తగూడెం జిల్లాలో ఆరు ద్విచక్ర వాహనాలను దొంగిలించినట్లు రాజు అంగీకరించాడన్నారు. రాజును పోలీసులు అరెస్టు చేసి ఎనిమిది వాహనాలను రికవరీ చేసుకున్నట్లు సిఐ తెలిపారు. ఈ దొంగను పట్టుకోవడంలో కృషి చేసిన సిఐ కరుణాకర్, కానిస్టేబుల్స్ శంకర్, సురేష్, నరేష్‌లను డిఎస్పి అబ్దుల్ రహమాన్ ప్రత్యేకంగా అభినందించారు.

తెలంగాణ ఉద్యమకారుడు మోరె భాస్కర్ మృతి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : మలిదశ తెలంగాణ ఉద్యమంలో అంకితభావంతో చురుకైన పాత్ర వహించిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ మోర భాస్కర్ అనారోగ్యంతో మృతి చెందారు. తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో మంగళవారం హుటాహుటిన హైదరాబాద్ చికిత్స కోసం తరలించారు. ఆరోగ్యం విషమించి చికిత్స పొందుతూనే మృతిచెందారు. రాజకీయ పార్టీల కతీతంగా అందరితో ఆత్మీయంగా ఉండే స్నేహశీలి భాస్కర్ మరణంతో జిల్లావ్యాప్తంగా పార్టీ వర్గాలతో పాటు ఇతర పార్టీల శ్రేణుల్లోనూ విషాదం నెలకొంది. నిన్న మొన్నటి వరకు ఎంతో ఆరోగ్యంగా ఉన్న భాస్కర్ ఇటీవల జరిగిన బిఆర్ఎస్ దీక్షా దివస్ కార్యక్రమంలొ చురుకైన పాత్ర వహించారు. ఎలాంటి కల్మషం లేకుండా అందరిని సౌమ్యంగా పలకరించే భాస్కర్ అకాల మరణ సమాచారం తెలుసుకొని బుధవారం నాలుగడ్డలోని అతని స్వగృహానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం పట్టణంలో గల నాగయ్య గడ్డ ప్రాంతానికి చెందిన భాస్కర్ 2001 నుంచి అప్పటి టిఆర్ఎస్ పార్టీలో చేరి అనేక ఉద్యమాలు నిర్వహించారు. ఎన్నో ఆటుపోట్లు,అవమానాలు, కేసులను భాస్కర్ ఎదుర్కొ న్నారు. చాలా సాదాసీదాగా ఉండే భాస్కర్ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం కలలను సాఫల్యం చేసుకునేందుకు పార్టీలో నిజాయితీగల కార్యకర్తగా, నాయకుడిగా పని చేస్తూ ఎన్నో ఉద్యమాలకు సారథ్యం వహించారు. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ ఒక మంచి ఉద్యమకారుడిని కోల్పోయింద న్నారు. వారితో పాటు గ్రంథాల మాజీ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్ మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, కౌన్సిలర్ అంబుల వేణు, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, మాజీ ఉర్దూ కమిటీ చైర్మన్ అన్వర్ పాషా, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు బొందుగల శ్రీధర్, బొమ్మిడి రమాకాంత్, అహ్మద్, అరుణ్, గౌస్, సురేందర్ భాస్కర్ పార్థీవ దేహాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు.

పినపాకలో 108 అంబులెన్స్ సేవలు ప్రారంభం

విశాలాంధ్ర - పినపాక : ఎన్నికల సమయంలో పినపాక మండల ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం 108 వాహనాన్ని మంజూరు చేయించానని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108 అంబులెన్స్ వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్యం, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టితో పనిచేస్తుందన్నారు. పక్క ఏజెన్సీ మండలమైన ఇక్కడ అత్యవసర వైద్య సేవలకు 108 వాహనం చాలా అవసరమన్నారు. 24 గంటలు అందుబాటులో ఉంటుందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహశిల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీ ఓ వెంకటేశ్వరరావు, డాక్టర్ శృతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామనాథం, నాయకులు పేరం వెంకటేశ్వర్లు, గంగిరెడ్డి వెంకటరెడ్డి, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సాంబ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫారెస్ట్ కార్యాలయాలు ప్రారంభం

విశాలాంధ్ర - కొత్తగూడెం : ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కార్యాలయాలను బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాదు నుండి వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. కార్పొరేషన్ సముదాయాలతో పాటు బీట్ ఆఫీసర్స్ క్వార్టర్స్‌ను కూడా వర్చువల్ పద్ధతిలో సీఎం ప్రారంభించారు. కొత్తగూడెంలో అటవీ కార్యాలయ సముదాయాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా అటవీ శాఖ అధికారి కిష్టా గౌడ్ టీజీఎఫ్డిసి. కొత్తగూడెం డివిజన్ మేనేజర్ జి.చంద్రమోహన్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల అన్నదానాన్ని ప్రారంభించిన సీఐ

విశాలాంధ్ర - కారేపల్లి : ఎంతో పవిత్రమైన అయ్యప్ప స్వామి మాల ధరించి భక్తిశ్రద్ధలతో మండలం రోజులు స్వామివారి సేవ చేసి అయ్యప్పను దర్శించుకున్న వారికి ఎంతో పుణ్యఫలం లభిస్తుందని కారేపల్లి రూరల్ సీఐ తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం కారేపల్లి మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు సహకారంతో గురుస్వాములు గొడుగు శ్రీను, జంగా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వాముల అన్నదాన కార్యక్రమాన్ని కారేపల్లి సిఐ తిరుపతిరెడ్డి ప్రారంభించారు. సిఐ మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మాల ధరించి 41 రోజుల పాటు ఎంతో పవిత్రతో దీక్ష చేస్తున్న అయ్యప్పలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఎంతో పుణ్య ఫలం అన్నారు. మానవుడు భక్తితో కఠోర దీక్ష చేస్తే స్వామి అనుగ్రహం కలిగి ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలతో సకల సంపదలు కలుగుతాయన్నారు. గురుస్వాములు కేశగాన్ని బాలకృష్ణ, సతీష్ కొమరయ్య నాయకులు తోగర శ్రీను, అయ్యప్ప స్వామి మాలదారులు, సాయి భక్తులు పాల్గొన్నారు.

యూరోపియన్ యూనియన్ ఫిల్మ్ ఫెస్టివల్ 29వ ఎడిషన్

హైదరాబాద్: న్యూఢిల్లీ, కోల్‌కతాలో కొనసాగుతున్న ప్రదర్శనల తర్వాత, యూరోపియన్ యూనియన్ ఫిల్మ్ ఫెస్టివల్ (ఈయూఎఫ్ఎఫ్) 29వ ఎడిషన్ యూరోపియన్ సినిమాల్లోని అత్యుత్తమ చిత్రాలను హైదరాబాద్‌కు తీసుకురావడానికి సిద్ధంగా ఉందని హైదరాబాద్ ఫిల్మ్ క్లబ్ అధ్యక్షుడు కెవి రావు, కార్యదర్శి బిఎస్ఎస్ ప్రకాష్ రెడ్డి తెలిపారు. యూరోపియన్ సినిమా ఈ వార్షిక వేడుక ఇండో యూరోపియన్ భాగస్వామ్యానికి ఒక శక్తివంతమైన నివాళి అని, ఇది కళ సంస్కృతి పట్ల భాగస్వామ్య ప్రేమను హైలైట్ చేస్తుందన్నారు. హైదరాబాద్ ఎడిషన్ డిసెంబర్ 6 నుండి డిసెంబర్ 15 వరకు ప్రసాద్ ల్యాబ్స్ ప్రివ్యూ థియేటర్ (రోడ్ నెం.2, బంజారాహిల్స్) లో జరుగుతుందన్నారు. ఈ ఉత్సవం 31 భాషలలో 26 అవార్డులు గెలుచుకున్న చిత్రాల ద్వారా ఆకర్షణీయమైన సినిమా ప్రయాణాన్ని వాగ్దానం చేస్తుందన్నారు. ఇది యూరోపియన్ సమాజం, సంస్కృతి వ్యక్తులకు ఒక విండోను అందిస్తుందన్నారు.

వివో స్విచ్ ఆఫ్ 2024 సర్వే

ముంబయి: స్మార్ట్‌ఫోన్లు మన జీవితంలో అనివార్యమైన భాగంగా మారడంతో, అధిక స్మార్ట్‌ఫోన్ వాడకం గురించి అన్ని వయసులవారిలో, ముఖ్యంగా పిల్లలలో ఆందోళనలు పెరుగుతున్నాయి. మానవ సంబంధాలపై, ముఖ్యంగా తల్లిదండ్రులు, పిల్లలలో అధిక స్మార్ట్‌ఫోన్ వాడకం ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి, గ్లోబల్ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ వివో, సైబర్ మీడియా రీసెర్చ్ (సిఎంఆర్) సహకారంతో, తన స్విచ్ ఆఫ్ పరిశోధన అధ్యయనం ఆరవ ఎడిషన్ ఫలితాలను ఆవిష్కరించింది. తల్లిదండ్రులు-పిల్లల సంబంధాలపై స్మార్ట్‌ఫోన్ల ప్రభావం అనే శీర్షికతో నిర్వహించిన ఈ అధ్యయనంలో మితిమీరిన, అనియంత్రిత స్మార్ట్‌ఫోన్ వాడకం పిల్లలు, వారి తల్లిదండ్రుల మధ్య బంధాలను ఎంతగా ప్రభావితం చేస్తుందో నొక్కి చెప్పింది. ఆరేళ్ల క్రితం ప్రారంభించిన వివో స్విచ్ ఆఫ్ క్యాంపెయిన్ బాధ్యతాయుతమైన స్మార్ట్‌ఫోన్ వాడకాన్ని ప్రోత్సహిస్తుంది. నిజజీవిత సంబంధాలకు ప్రాధాన్యత ఇవ్వడానికి కుటుంబాలను ప్రోత్సహిస్తుంది. భారతదేశంలో దశాబ్దపు విజయాన్ని జరుపుకుంటున్న సందర్భంగా లోతైన మానవ సంబంధాలను పెంపొందించడానికి వివో నిబద్ధతను ఈ చొరవ ప్రతిబింబిస్తుంది.

బీఎన్ రెడ్డి నగర్‌లో వెల్‌స్పన్ ఫ్రాంచైజీ ఓన్డ్ ఎక్స్‌క్లూజివ్ స్టోర్

హైదరాబాద్: వినూత్న హెూమ్ టెక్స్ టైల్ ఉత్పాదనల్లో అంతర్జాతీయ అగ్రగామి అయిన వెల్‌స్పన్ భారతదేశం అంతటా ప్రథమ, ద్వితీయ శ్రేణి నగరాల్లో తన ప్రత్యేక ఫోఫో (ఎఫ్ఓఎఫ్ఓ-ఫ్రాంచైజ్ ఓన్డ్ ఫ్రాంచైజ్ ఆపరేటెడ్) స్టోర్‌లతో తన ఉనికిని బలోపేతం చేసుకుంటూనే ఉంది. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్‌లో బీఎన్‌రెడ్డి నగర్‌లో ఉన్న ఈ స్టోర్ వెల్స్పన్ ప్రతిష్టాత్మక బ్రాండ్ క్రింద హెూమ్ టెక్స్‌టైల్ ఉత్పాదనలకు సంబంధించి ప్రీమియం స్టోర్‌గా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఫ్రాంఛైజ్ ఓన్డ్ ఫ్రాంచైజ్ ఆపరేటెడ్ మోడల్ అనేది ఫ్రాంచైజీల యాజమాన్యంలో ఫ్రాంచైజీచే నిర్వహించబడే ప్రత్యేకమైన సింగిల్-బ్రాండెడ్ స్టోర్‌లను కలిగి ఉంటుంది. ఈ మోడల్ వెల్‌స్పన్ పరిధిని విస్తరించడానికి, తన లక్ష్య వినియోగదారులతో అనుసంధానం అయ్యేందుకు, బీఎస్ రెడ్డి నగర్ సహా వివిధ నగరాల్లో ప్రీమియం నాణ్యత గల హెూమ్ టెక్స్ టైల్ ఉత్పత్తులను వినియోగదారులకు అందించడానికి వీలు కల్పిస్తుంది. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 33-35 స్టోర్‌లతో, వెల్స్పన్%ఖీూఖీూ% అవుట్‌లెట్‌లు విలువ, వినూత్నత, శైలిని మిళితం చేసే క్యూరేటెడ్ షాపింగ్ అనుభవాన్ని అందిస్తాయి.

కోటక్ మ్యూచువల్ ఫండ్ మార్కెట్ అవుట్ లుక్ విడుదల

ముంబయి : కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్మెంట్ కంపెనీ లిమిటెడ్ బుధవారంనాడు మార్కెట్ ఔట్లుక్ 2025 నివేదికను విడుదల చేసింది. కోటక్ మ్యూచువల్ ఫండ్, భారత ఆర్థిక వ్యవస్థ, మూలధన మార్కెట్ల దిశలో స్థూల-ఆర్థిక దృక్పథాన్ని పంచుకుంటూ, రాబోయే సంవత్సరంలో పెట్టుబడిదారులు చూడగలిగే వివిధ పెట్టుబడి థీమ్లను హైలైట్ చేస్తూ నివేదికను ప్రారంభించింది. 2025లో మార్కెట్లకు సహాయపడే ఐదు కీలక థీమ్‌లను నివేదిక హైలైట్ చేస్తుంది. వాటిలో కాపెక్స్ సైకిల్ పునరుద్ధరణ, ఫైనాన్షియల్ సర్వీసుల విస్తరణ, సాంకేతికత-ఆధునిక యుగం సేవా ఆఫర్లు, వినియోగం మరియు గ్రామీణ పునరుజ్జీవనం, ఆరోగ్య సంరక్షణ అంశాలు ఉన్నాయి. భారతదేశం ప్రస్తుతం గణనీయమైన మూలధన వ్యయం (కాపెక్స్) చక్రాన్ని ఎదుర్కొంటోందని, ఆర్థిక సేవల రంగం దాని ఉపవర్గాలలో విభిన్న పనితీరును ప్రదర్శిస్తుందని, క్లౌడ్ సేవల్లో ఖర్చు పెరగడంతో ఐటీ సేవల వ్యయం మెరుగుపడుతుందని భావిస్తున్నట్లు నివేదిక పేర్కొంది.

టాటా ఏస్ ఈవీ ఫ్లీట్‌తో గ్రీన్ డ్రైవ్ మొబిలిటీ లాస్ట్-మైల్ డెలివరీ

హైదరాబాద్: సుస్థిరమైన అర్బన్ లాజిస్టిక్స్ వైపు గణనీయమైన పురోగతితో, గ్రీన్ డ్రైవ్ మొబిలిటీ భారతదేశంలోని ఎలక్ట్రిక్ మొబిలిటీ విప్లవంలో కీలకపాత్ర పోషిస్తూ, గేమ్ చేంజర్లలో ఒకటిగా నిలిచింది, ఇది టాటా మోటార్స్ ఏస్ ఈవీ అత్యంత అధునాతనమైన, జీరో-ఎమిషన్, నాలుగు- చక్రాల చిన్న వాణిజ్య వాహనం ద్వారా ఆధారితమైనది. ఇప్పుడు దేశవ్యాప్తంగా 100కు పైగా ఏస్ ఈవీలు పని చేస్తున్నందున, పర్యావరణ బాధ్యత, వ్యాపార సామర్థ్యం కలిసికట్టుగా సాగుతాయని కంపెనీ నిరూపించింది. ఈ భాగస్వామ్యం ఇప్పటికే ఆకట్టుకునే ప్రయోజనాలను అందించింది, ఏస్ ఈవీ అధిక సంపాదన సామర్థ్యాలను, తక్కువ మొత్తం యాజమాన్యంని ఉపయోగించుకుంటూ 160 టన్నులకు పైగా సీఓ2 ఉద్గారాలను ఆదా చేసింది. భారతదేశం లాజిస్టిక్స్ రంగం సాంప్రదాయ ఇంధన ఆధారిత డెలివరీ వాహనాలకు సుస్థిరమైన ప్రత్యామ్నాయాల కోసం చూస్తున్న సమయంలో ఈ విజయం దక్కినట్లు గ్రీన్ డ్రైవ్ మొబిలిటీ వ్యవస్థాపకుడు, సీఈవో హరి కృష్ణ తెలిపారు.

2 కొత్త శాఖలను ప్రారంభించిన సుందరం ఫైనాన్స్

హైదరాబాద్: సుందరం ఫైనాన్స్ లిమిటెడ్, ఆటోమోటివ్ లెండింగ్, జనరల్ ఇన్సూరెన్స్, హౌసింగ్ లోన్‌లు, అసెట్ మేనేజ్‌మెంట్‌లో ఆసక్తి ఉన్న భారతదేశంలోని ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థల్లో ఒకటి. తాజాగా కొంపల్లి, ఘట్‌కేసర్, హైదరాబాద్‌లో రెండు కొత్త శాఖలను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ రెండు శాఖలను పలువురు ప్రముఖులు, చిరకాల కస్టమర్లు, శ్రేయోభిలాషుల సమక్షంలో కంపెనీ అధికారులు ప్రారంభించారు. కొంపల్లి బ్రాంచ్ ప్లాట్ నెం 9, 4వ అంతస్తు, సర్వే నెం 12, ఎస్‌బీఐ బ్యాంక్ రోడ్, పెట్‌బషీర్‌బాద్, కొంపల్లి, రంగారెడ్డి, తెలంగాణ 500005 వద్ద ఉంది. ఘట్‌కేసర్ శాఖ కార్యాలయం ఇం. నం. 9-165/1ఏ, మొదటి అంతస్తు, ఘట్‌కేసర్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా - 501301లో ఉంది. రెండు శాఖలు పూర్తి సమయం పనిచేస్తున్నాయి. హైదరాబాద్ సిటీ కవరేజీని విస్తరించడానికి, కొత్త అవకాశాలతో టచ్ పాయింట్లను సృష్టించడానికి, రెండు కొత్త శాఖలను ప్రారంభించారు.

భారతదేశంలో 67 ట్రిలియన్లకు చేరుకోనున్న గృహాల మార్కెట్: నైట్ ఫ్రాంక్

న్యూఢిల్లీ: భారతదేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ అయిన నైట్ ఫ్రాంక్ ఇండియా తన తాజా నివేదికను విడుదల చేసింది. సీఐఐ కాన్ఫరెన్స్ సందర్భంగా ఆ సంస్థతో కలిసి 'భారత్‌లో సరసమైన హౌసింగ్: డిమాండ్-సప్లై అసెస్‌మెంట్ మరియు ఫైనాన్సింగ్ అవకాశం' అనే అంశం ప్రాతిపదికగా ఇండియన్ హౌసింగ్ ల్యాండ్‌స్కేప్‌పై ఈ నివేదిక విడుదల చేసింది. భారతదేశంలో సరసమైన గృహాల మార్కెట్ 67 ట్రిలియన్లకు చేరుకుంటుందని అంచనా. అలాగే, 2030 నాటికి డిమాండ్ 31.2 మిలియన్ యూనిట్లుగా ఉంటుందని నైట్ ఫ్రాంక్ ఇండియా, సీఐఐ నివేదిక అంచనా వేసింది. భారతదేశంలో సరసమైన గృహాల విభాగానికి ప్రస్తుతం ఉన్న కొరత, రాబోయే డిమాండ్ 2030 నాటికి 30.7 మిలియన్ యూనిట్లుగా అంచనా. నైట్ ఫ్రాంక్ విశ్లేషణ ప్రకారం, పట్టణీకరణ, ఉపాధి అవకాశాలు వంటి అంశాల ఆధారంగా, భారతదేశంలోని పట్టణ కేంద్రాలలో 22.2 మిలియన్ యూనిట్ల గృహాలు అవసరమవుతాయి. 21.1 మిలియన్ యూనిట్లకు సమానమైన ఈ డిమాండ్‌లో 95.2% సరసమైన గృహాల విభాగంలో కేంద్రీకృతమై ఉంటుంది. డిమాండ్‌లో 45.8% ప్రధాన వాటా ఈడబ్ల్యుఎస్ కుటుంబాల మధ్య కేంద్రీకృతమై ఉంటుంది. ఇప్పటికే 10.1 మిలియన్ యూనిట్ల కొరత ఉంది.

రూ.5.5 కోట్ల ఇ-కామర్స్ మోసం కేసులో నిందితుల అరెస్టు

విశాలాంధ్ర-హైదరాబాద్: బెంగళూరు సైబర్ క్రైమ్ పోలీసులు విజయవంతంగా రూ. 5.5 కోట్ల ఇ-కామర్స్ ప్లాట్‌ఫారమ్ మీషోకి సంబంధించిన మోసం కేసు, గుజరాత్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసింది. జూలై 1, 2024న మీషో దాఖలు చేసిన ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఎఫ్ఐఆర్) ఆధారంగా బెంగళూరు సైబర్ సెల్ నేరస్తులను న్యాయస్థానం ముందుకు తీసుకురావడానికి వేగంగా, క్షుణ్ణంగా దర్యాప్తు చేసింది. మీషో ట్రస్ట్, సేఫ్టీ బృందం మొదట మోసపూరిత కార్యకలాపాలను గుర్తించింది. పెద్ద ఎత్తున మోసపూరిత రిటర్న్‌లు, తప్పుడు రీఫండ్ క్లెయిమ్‌లను కలిగి ఉన్న ఆపరేషన్ వివరాలను వెలికితీసేందుకు అధునాతన పరిశోధనాత్మక పద్ధతులను ఉపయోగించుకుంటూ పోలీసు బృందం నిర్ణయాత్మకంగా వ్యవహరించింది. ఈ కేసును పరిష్కరించడంలో సత్వర సమర్థవంతమైన చర్య తీసుకున్నందుకు బెంగళూరు సిటీ పోలీసులు సైబర్ క్రైమ్ సెల్‌కు మీషో జనరల్ న్యాయవాది లోపాముద్రరావు ధన్యవాదాలు తెలిపారు.

సంపాదకీయం

ప్రజాస్వామ్యానికి అర చేయి అడ్డం!

ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం తీర్చనప్పుడు విసిగిపోయి ప్రజలే తమ ఆకాంక్షలను తామే తీర్చుకునే ప్రయత్నం చేయడంలో ఆశ్చర్యం లేదు. మహారాష్ట్రలోని సోలాపూర్ పరిధిలోని మల్షిరా గ్రామ ప్రజలు అదే పనిచేశారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు సాంకేతికంగా ఎంత ఉత్తమమైనవి అయినప్పటికీ వాటి మీద అనుమానాలు మాత్రం తలెత్తుతూనే ఉన్నాయి. వాటి బ్యాటరీలకు సంబంధించి ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఇటీవల మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల సమయంలో 93 నియోజకవర్గాల పరిధిలో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు పొంతన లేదంటున్నారు. అనేక చోట్ల పోలైన ఓట్ల కన్నా లెక్కించిన ఓట్ల సంఖ్య ఎక్కువగా ఉంటుందన్న ఆరోపణలు దండిగా వచ్చాయి. కొన్ని చోట్ల తక్కువ ఓట్లు లెక్కించిన సందర్భాలూ ఉండవచ్చు. పోలింగ్ ముగిసిన తరవాత ఎన్నికల సంఘం పోలింగ్ సరళిని ప్రకటిస్తుంది. సాధారణంగా పోలింగ్ ముగిసిన కొద్ది సేపటికే ఇంత శాతం ఓట్లు పోలయ్యాయి అని చెప్తోంది. ఇంతకు ముందు ఇలా ఇంత శాతం అని కాకుండా ఏ పోలింగ్ కేంద్రంలో ఎన్ని ఓట్లు పోలయ్యాయో కూడా చెప్పేవారు. ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిగా రాజీవ్ కుమార్ వచ్చినప్పటినుంచి కేవలం పోలింగ్ సరళిని శాతాల్లోనే ప్రకటిస్తున్నారు తప్ప పోలైన ఓట్ల సంఖ్య ఎంతో ఎప్పుడోగాని చెప్పడంలేదు. పోలింగ్ ముగిసిన రోజునే వెంటనే ఎన్నికల కమిషన్ ఓటింగ్ సరళిని ప్రకటిస్తుంది. ఓటు వేయడానికి సమయం గడవడానికి ముందు బారులు తీరినవారు ఎంతమంది ఉన్నా గడువుతో సంబంధం లేకుండా వారికి ఓటు వేసే అవకాశం ఇస్తారు. అంటే గడువు ముగిసిన తరవాత గడువుకు ముందు బారుల్లో ఉన్న వారందరికీ ఓటువేసే అవకాశం ఉంటుంది. వారందరూ ఓటు వేయడానికి అదనంగా కొన్ని గంటల సమయం పట్టొచ్చు. ఆ తరవాత మళ్లీ పోలైన ఓట్ల వివరాలు ప్రకటిస్తారు. ఇంకా ఏమైనా తేడాలుంటే మరుసటి రోజైనా ప్రకటిస్తారు. అయితే ఈ మధ్య పోలైన ఓట్ల కన్నా అనేక చోట్ల ఎక్కువ ఓట్లు లెక్కిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఎన్నికల కమిషన్ ప్రకటించే గణాంకాల్లో వ్యత్యాసాలు విపరీతంగా ఉంటున్నాయి. దీనితో ఎలక్ట్రానిక్ ఓటింగ్ పరికరాల ద్వారా ఏదో మతలబు జరుగుతోందన్న అనుమానం పెరిగిపోతోంది. అందుకే చాలా మంది ఇదివరకటి లాగా బ్యాలెట్ పత్రాలతో ఓటింగ్ జరిపించాలంటున్నారు. ఈ వాదన కచ్చితంగా ఓటింగ్ యంత్రాల తయారీని ప్రశ్నించడంకాదు. ఆ సాంకేతికత నాణ్యతపై, సమర్థతపై అనుమానాలు లేవనెత్తడంకాదు. ఆ తరవాత ఏదో మాయ జరుగుతోందన్న అనుమానం మాత్రం అందరినీ పీడిస్తోంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలలో మాయ జరిగిందన్న ఆరోపణలు వచ్చిన చోటల్లా ఎన్.డి.ఎ. అభ్యర్థులే విజయం సాధిస్తున్నారన్న ఆరోపణా ఉంది. పోలింగ్‌లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నప్పుడు రీపోలింగ్ జరిపే ఆనవాయితీ కూడా ఉంది. కానీ ఓటింగ్ పరికరాలు సవ్యంగానే ఉన్నాయని ఎన్నికల కమిషన్ అడ్డంగా వాదిస్తోంది. వి.వి.ప్యాట్ల సహాయంతో పోలైన ప్రతి ఓటును ముద్రించి ఓటర్లకు చూపించాలన్న వాదనను ఎన్నికల కమిషన్ తో పాటు సుప్రీంకోర్టూ అంగీకరించడం లేదు.

మహారాష్ట్రలోని మల్షిర అసెంబ్లీ నియోజకవర్గంలో భాగమైన మర్కడ్వాడీ గ్రామ ప్రజలు అక్కడి నుంచి ఎన్నికైన ఎన్.సి.పి. అభ్యర్థి ఉత్తం రావ్ జాంకర్ సమర్థకులే. ఆ గ్రామంలో మొత్తం 1900 ఓట్లు ఉన్నాయి. జాంకర్ బీజేపీ అభ్యర్థిని రామ్ సత్పుతెను ఓడించారు. ఆ గ్రామంలో ఎక్కువ మంది జాంకర్ నే సమర్థించారు. కానీ జాంకర్ కు 843 ఓట్లు వస్తే బీజేపీ అభ్యర్థికి 1,003 ఓట్లు వచ్చాయి. గ్రామంలో ఎక్కువ మంది జాంకర్ మద్దతుదార్లుగా ఉన్నప్పుడు బీజేపీ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు రావడం ఆ గ్రామస్థులను ఆశ్చర్య పరిచింది. కనీసం మరోసారి ఉదాహరణ ప్రాయంగానైనా బ్యాలెట్ పత్రాల ద్వారా పోలింగ్ జరిపించారని ఆ గ్రామస్థులు తమ ప్రాంత తహసీల్దారు, ఎన్నికల అధికారిని అభ్యర్థించారు. కానీ ఆయన అంగీకరించలేదు. అందుకని వారే బ్యాలెట్ పత్రాలను వినియోగించి పోలింగ్ జరిపించడానికి సకల ఏర్పాట్లుచేశారు. కానీ ఏలిన వారికి ఇది నచ్చలేదు. నిజానికి ఆ గ్రామస్థులు తలపెట్టింది దొంగ పోలీసు ఆటలాంటిదే. దానివల్ల ఆ నియోజకవర్గం ఫలితాల మీద ఎలాంటి ప్రభావం ఉండేది కాదు. అయినా అధికారులు ఒప్పలేదు. చట్టరీత్యా చర్య తీసుకుంటామని ముందే హెచ్చరించారు. బీజేపీ అభ్యర్థికన్నా తాము సమర్థించే ఎన్.సి.పి. అభ్యర్థికి వచ్చిన ఓట్లు తగ్గడం వారికి ఆశ్చర్యం కలిగించింది. అందుకే బ్యాలెట్ ద్వారా మళ్లీ ఓటింగ్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. కావలసిన సామాగ్రి ఇవ్వాలని చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం మన్నించలేదు. అందుకని తామే బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ పెట్టెల లాంటివి ఏర్పాటు చేసుకున్నారు. పోలింగ్ నిర్వహించేవారిని కూడా నియమించుకున్నారు. అయినా అధికారులు ససేమిరా అన్నారు. ఆ గ్రామంలో నలుగురికన్నా ఎక్కువ గుమి కూడదన్న నిషేధం విధించారు. గ్రామంలో పోలీసు బలగాలను దించారు. మహా వికాస్ అగాఢీకి చెందిన వారు కావాలనే గ్రామస్థులను రెచ్చగొడ్తున్నారని బీజేపీ యాగీ చేసింది. గెలిచిన జాంకర్ మాత్రం నోరు మెదపలేదు. ఆయనను సంప్రదించడానికి చేసిన ఏ ప్రయత్నమూ ఫలించలేదు. మర్కడ్వాడీ గ్రామస్థులు మాత్రం ఎన్నికల కమిషన్ కబుర్లు తాము నమ్మబోమని స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయంగా బ్యాలెట్ పత్రాల ద్వారా పోలింగ్ నిర్వహించాలనుకున్నారు. వారి ప్రయత్నం ఫలించి ఉండకపోవచ్చు. కానీ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మీద అనుమానాలు మిగిలే ఉంటాయి. మల్షిర ప్రాంత ప్రజలు ప్రయోగాత్మకంగా బ్యాలెట్ పత్రాల ద్వారా పోలింగ్ జరిపించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వెనక దాగిన మర్మాన్ని బట్టబయలు చేయడం ఈసారికి కుదిరి ఉండకపోవచ్చు. అసలు సమస్య ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల సమర్థత కానేకాదు. వాటిని మాయ చేయడం నిజమో కాదో తేలాలి. అది తేల్చడానికే మల్షిరా గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా ఓ ప్రయోగం చేయాలనుకున్నారు. కానీ దానితోనే అధికారవర్గం బెంబేలెత్తిపోయింది. ఆ ఉత్తుత్తి పోలింగ్ కూడా జరగకుండా చేశారు. ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసం ఆంక్షల ద్వారా, నిషేధాజ్ఞల ద్వారా పునరుద్ధరించడం కుదరదు. అనేక మంది నిపుణులు ఇప్పటికే ఓటింగ్ పరికరాలను మాయ చేయడం సాధ్యమేనని నిరూపించారు. ఎదుర్కోవాల్సింది ఇలాంటి సవాళ్లను. ఆ పని చేయనంత కాలం ఎన్నికల ఫలితాలపై అనుమానాలు పెరుగుతాయే తప్ప తగ్గవు. అధికారులు ప్రస్తుతానికి ప్రజాస్వామ్య భావ వ్యక్తీకరణకు అరచేయి అడ్డం పెట్టి ఉండొచ్చు. ప్రజలు వ్యతిరేకిస్తున్నది ఓటింగ్ పరికరాలను కాదు. వాటి ఆసరాగా జరిగే మాయమర్మాలనే.

ధన్కర్ మాటల తూటాలు

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ మాటల తూటాల గురి ఎప్పుడు ఎటు ఉంటుందో చెప్పడం కష్టం. బహుశః ఆయనకు కూడా ఈ విషయం తెలిసి ఉండకపోవచ్చు. తాజాగా ఉపరాష్ట్రపతి ధన్కర్ తన విమర్శనాస్త్రాలను నేరుగా కేంద్ర ప్రభుత్వం మీదే ఎక్కు పెట్టారు. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి మీద ప్రశ్నల వర్షం కురిపించారు. దేశ ప్రతిష్ఠ అంతర్జాతీయ స్థాయిలో పెరుగు తోంది అంటూనే రైతులకు ఇచ్చిన హామీలు ఇంకా ఎందుకు అమలు కాలేదని నిలదీశారు. రైతుల సమస్యలు పరిష్కరించలేని విశ్వ విఖ్యాతి వల్ల ప్రయోజనం ఏమిటి అని ప్రశ్నించారు. అక్కడితో ఊరుకోకుండా విధాన నిర్ణయాలు పట్టాల మీద లేవు అని తీవ్రంగా దుయ్యబట్టారు. వ్యవసాయ మంత్రిగారూ మీకు ప్రతి క్షణం విలువైనదే. రైతులకు ఏమి హామీలు ఇచ్చారో దయచేసి నాకు చెప్పండి. ఈ హామీలను నెరవేర్చాలంటే మనం ఏం చేయాలి? కిందటేడాది రైతులు ఆందోళన చేశారు. ఈసారి కూడా ఆందోళన చేస్తున్నారు. కాల చక్రం తిరుగుతున్నా మనం ఏమీ చేయడం లేదు" అని ధన్ కర్ ఘాటుగా మాట్లాడారు. పత్తికి సంబంధించిన సాంకేతికతపై భారత వ్యవసాయ పరిశోధనా కేంద్రం నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ విషయాలన్నీ లేవనెత్తారు."దేశంలో మార్పు రావడం నేను మొట్టమొదటి సారి చూస్తున్నాను. అభివృద్ధి చెందిన భారత్ మన కలకాదు అది మన లక్ష్యం అని మొట్టమొదటిసారి అనిపిస్తోంది. భారత్ ప్రపంచ చిత్రపటంపై ఇంత అగ్రస్థానంలో ఎప్పుడూ లేదు. ఒకవేపు ఈ పరిస్థితి ఉంటే రైతు ఎందుకు బాధ అనుభవిస్తున్నాడు?" అని ఆయన ప్రశ్నాస్త్రాలు సంధించారు. వేదికమీద ఉన్న వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నిరుత్తరంగా మిగిలిపోయారు. ప్రస్తుతం కేంద్ర వ్యవసాయమంత్రిగా ఉన్న చౌహాన్ అంతకు ముందు పదిహేనేళ్లపాటు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న విషయం తెలిసిందే. ఉపరాష్ట్రపతి తాను రైతు కుటుంబం నుంచి వచ్చానని అందువల్ల తానూ రైతునే అని చెప్తూ ఉంటారు. రైతు పడే కష్టాలు ఏమిటో తనకు బాగా తెలుసునంటారు.ధన్కర్ వ్యాఖ్యలు అసందర్భంగా చేసినవి కావు. మళ్లీ ఆందోళనకు దిగిన రైతులు పంజాబ్, హర్యానా సరిహద్దులోని శంభు, ఖనౌరీ వద్ద గత ఫిబ్రవరి నుంచి బైఠాయించారు. తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర అందించాలని, కొత్త చట్టాల ప్రకారం పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. ఏ పదవిలో ఉన్నవారైనా ఏదో ఒక వర్గానికి చెందిన వారే అయి ఉంటారు. అలా చూస్తే ధన్కర్ వ్యవసాయదారుల వర్గం నుంచి వచ్చారు. కానీ ధన్కర్ ఒకప్పుడు పేరున్న న్యాయవాది. విద్యాధికుడు. ఉపరాష్ట్రపతి హోదాలో ఆయనే రాజ్యసభ అధ్యక్షులు. ఆ

ఒకే ఒక్కడు

స్థానంలో ఉన్నప్పుడు ఆయన నడవడికే అంతుపట్టకుండా ఉంటోంది. రైతుల సమస్యల గురించి ధన్కర్ వ్యక్తం చేసిన అభిప్రాయాలలో అభ్యంతరకరమైన మాట ఒక్కటీ కూడా లేదు. నిర్మొహమాటంగానే మాట్లాడారు. అయితే రాజ్యసభ అధ్యక్ష స్థానంలో ఉన్నప్పుడు ఆయన నడవడిక ఎప్పుడూ వివాదాస్పదంగానే ఉంటోంది. అసలు సభాధ్యక్ష స్థానంలో ఉన్నవారు వర్తమాన రాజకీయాల గురించి వ్యాఖ్యానించవచ్చునా అన్న ప్రశ్న ఉండనే ఉంది.సభ్యులు ఏదైనా అంశాన్ని సభలో లేవనెత్తగానే దీనికి సాధికారికత ఏమిటి అని ప్రశ్నిస్తుంటారు. ఈ మాటలకు మీరు బాధ్యత తీసుకుంటారా అని అడుగుతుంటారు. ఒక రకంగా పౌరులకు ఉన్న వాక్ స్వాతంత్ర్యాన్ని మించిన స్వాతంత్ర్యం పార్లమెంటు సభ్యులకు ఉంది. సభలో మాట్లాడింది తప్పయినా, ఎవరి పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేదైనా వారి మీద చట్టం ప్రకారం చర్య తీసుకోవడానికి అవకాశం ఉండదు. ఇంతటి స్వేచ్ఛను ఇటీవల మన ఎంపీలు ఎలా ఉపయోగించుకుంటున్నారన్నది వేరే విషయం. ధన్కర్ సభాధ్యక్ష స్థానంలో ఉన్నప్పుడు ఒక్కొక్క సారి ప్రతిపక్ష నాయకులు మాటలు మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడినా ఆయన భరించలేరు. "ఈ విషయం ఒక్క ముక్క కూడా రికార్డుల్లోకి వెళ్లదు" అని అదే పనిగా అంటూ ఉంటారు.కొన్ని సందర్భాలలో ప్రతిపక్ష సభ్యులు మాట్లాడుతుంటే ఉన్న ఫళాన మైకులు మూగవోతాయి. నిజానికి సభాధ్యక్ష స్థానంలో ఉన్న వారి దగ్గర మైకులు కట్టేయడానికి సంబంధించిన మీటలు, పరికరాలు ఏమీ ఉండవు. సౌండ్ ఇంజనీర్ ఆ పక్కన ఎక్కడో కూర్చుని ఉంటారు. కానీ సౌండ్ ఇంజనీర్ సభ్యుల మాటలు కత్తిరించే సాహసం చేయరుగా. బాధ్యతాయుత స్థానంలో ఉన్నవారెవరైనా ఆదేశించినప్పుడే ఆయన ఆ పని చేయగలుగు తారు. అలా ఆదేశించే అధికారం సభాధ్యక్షులకు, లేదా సభ జరుగుతున్న ప్పుడు ఆ స్థానంలో ఉన్న వారికి మాత్రమే ఉంటుంది. ధన్కర్ ధోరణి చూస్తుంటే ఆయన మోదీ మీదే విమర్శనాస్త్రాలు ఎక్కుపెడ్తున్నట్టు కనిపిస్తు న్నారు. నితీశ్ కుమార్ తనకు అనువైనప్పుడే మోదీకి వ్యతిరేకంగా మాట్లాడతారు. కానీ ధన్కర్ మాత్రం అవకాశం దొరికినప్పుడల్లా మోదీ మీద విమర్శలు గుప్పిస్తూనే ఉంటారు. నేను దేశంలో రెండవ అతి పెద్ద స్థానంలో ఉన్నాను అని గుర్తు చేస్తుంటారు. అందుకే రైతులను ఎందుకు మోసం చేస్తున్నారు అని నేరుగా ప్రశ్నిస్తున్నారు. "మీరు విశ్వగురువు అంటారు. వివిధ దేశాల మధ్య మధ్యవర్తిత్వం చేస్తానంటారు. మరి రైతుల సమస్యలు ఎందుకు పరిష్కరించడం లేదు అని అడుగుతున్నారు. రైతులతో ఎందుకు చర్చిండం లేదు? వాళ్లు గత సంవత్సరం కూడా రోడ్డెక్కారు. ఈ సారీ అదే పని చేస్తున్నారు" అని గుర్తు చేస్తున్నారు. అయినా ప్రభుత్వంవారితో చర్చించడంలేదు. కనీసం కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి కూడా వారిని సంప్రదించడం లేదు అని నిలదీస్తున్నారు. ధన్కర్ ను ఉపరాష్ట్రపతి పదవిలో కూర్చో పెట్టడానికి అనేక రకాలుగా ప్రయత్నించింది మోదీనే. అయినా ధన్ కర్ ప్రశ్నలు ఎందుకు సంధిస్తున్నట్టు? రైతుల సమస్యలను పట్టించుకోకపోవడం అంటే పరిస్థితిని సరిగ్గా అవగాహన చేసుకోకపోవడమేనంటున్నారు. రైతులకు గిట్టుబాటు ధర ఇస్తే మిన్ను విరిగి మీద పడబోదు అంటున్నారు. రైతులకు ఇచ్చిన వాగ్దానాలేమిటి? అవి ఎందుకు నెరవేర్చలేదో సమాధానం చెప్పాలని అదే వేదిక మీద ఉన్న వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను నిర్మొహమాటంగా అడిగారు. అక్కడితో ఆగకుండా దేశంలో అత్యున్నత పదవుల్లో రెండో స్థానంలో ఉన్న వాడిగా ఈ ప్రశ్న అడుగుతున్నాను సమాధానం చెప్పండి అంటున్నారు. ప్రధానమంత్రి మోదీ ఏ సమస్యనైనా సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలంటూ ఉంటారు కదా. ఇదివరకు రైతులు ఆందోళనకు దిగినప్పుడు మీకన్నా ముందు వ్యవసాయ శాఖమంత్రిగా ఉన్న వారు వారికి ఏం వాగ్దానాలు చేశారో చెప్పండి. వాటిని మీరెందుకు నెరవేర్చడం లేదు అని ప్రశ్నిస్తున్నారు. ఇదంతా చూస్తూ ఉంటే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పదవీ కాలం ముగిసిన తరవాత తనను రాష్ట్రపతిని చేస్తామని ఇచ్చిన హామీని మోదీ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పే అవకాశం ఏమైనా ఆయనకు కనిపిస్తోందేమో!

– అనన్య వర్మ

తీవ్ర సంక్షోభంలో ఐరోపా కార్ల పరిశ్రమ

బుడ్డిగ జమిందార్

ప్రపంచ ఆటోమోటివ్ పరిశ్రమ ముఖ్యంగా కార్ల పరిశ్రమ ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొని సంక్షోభంలో నడుస్తోంది. కార్ల ఉత్పత్తి, అమ్మకాల్లో 2022, 2023 సంవత్సరాల్లో నమోదైయిన ద్రవ్యోల్బణం, ముడిసరుకుల పెరుగుదలతో పాటుగా ఎలక్ట్రిక్ వాహనాల పోటీతో తీవ్ర సవాళ్లు ఎదురౌతున్నాయి. వినియోగదార్ల కొనుగోలుశక్తి తగ్గటంతో పాటుగా వాహనాల ఉత్పత్తి ఖర్చులు పెరగటంతో పరిశ్రమల లాభాలపై ప్రభావం చూపుతున్నాయని పరిశ్రమదారులు అంటున్నారు. నాటో యుద్ధ కూటమిని అండగా చేసుకొని ఉక్రెయిన్ రష్యాపై యుద్ధం చేస్తుండటంతో ఐరోపా ఖండం అంతా ఇంధన (గ్యాసు) సమస్యలు ఏర్పడి నిత్యావసర వస్తువుల ధరలు, పారిశ్రామిక ధరలు పెరిగిపోయాయి.

చైనా కార్ల ఎగుమతి దూకుడును ఐరోపా కార్ల పరిశ్రమ తట్టుకోలేకపోతుంది. 2021 నుంచి చైనా ఎగుమతి చేస్తున్న ఎలక్ట్రిక్ కార్లు 1,150 శాతానికి పెరిగాయి అని హంబర్ కమర్షియల్ బ్యాంక్ చీఫ్ ఎకనామిస్ట్ డా॥ రూబియా చెప్పారు. డీజిల్, పెట్రోలు కార్లు, ఎలక్ట్రిక్ కార్లలో కలిపితే మొత్తం మీద చైనా కార్ల ఉత్పత్తి 600 శాతానికి పెరిగింది. కార్ల ఎగుమతులంటే గుర్తుకొచ్చే జర్మనీ కార్ల ఎగుమతులు ఇదే సమయంలో కేవలం 60 శాతం మాత్రమే పెరిగాయి. కాబట్టి ఇక్కడ ప్రపంచ కార్ల అమ్మకాల మార్కెట్ల షేర్లలో స్పష్టమైన మార్పు చైనా కార్ల వైపు కనపడుతున్నది. దీని పర్యావసానంగా జర్మనీ చరిత్రలో 87 సంవత్సరాల ఫోల్క్స్ వాగెన్ పరిశ్రమ వోల్ఫ్‌బుర్గ్‌లో మూసివేస్తానంటుంది. గడచిన 25 నెలల్లో లక్షా20వేల మంది ఫోల్క్స్ వాగెన్ ఉద్యోగులకు ఒక సెంటు జీతం కూడా పెరగలేదు. కొద్దిగా పనిగంటలు మాత్రం తగ్గించారు. బోనసులు అనేవి ఇవ్వటం లేదు. తద్వారా పరిశ్రమలో 11 వేల కార్మికులు నిరుద్యోగానికి గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఈ కంపెనీతో పాటుగా మరో 2 ఫోల్క్స్ వాగెన్ కంపెనీలు కూడా మూసివేసే ప్రక్రియలో ఉన్నాయి. చైనాలో ఫోల్స్‌వాగెన్స్ చేస్తున్న కార్ల ఉత్పత్తి 20 శాతానికి పడిపోయాయి.

జర్మనీలో ఇప్పటికే మెటల్, ఎలక్ట్రికల్ పరిశ్రమలలో 40 లక్షల మంది ఉద్యోగులకు కుదుర్చుకొన్న అభద్రతా ఒప్పందాలు చల్లారక ముందే కార్ల పరిశ్రమలో మూకుమ్మడి ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ ప్రారంభంతో కార్మికవర్గం రోడ్లపై ప్రదర్శనలుచేస్తూ సార్వత్రిక సమ్మె చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఫోర్డ్ పరిశ్రమ జర్మనీలో 4 వేల కార్మికుల్ని ఉద్యోగాల్నుంచి తీసేస్తానని ప్రకటించింది. ఐరోపాలో ఒకప్పుడు 20 వేల మంది ఫోర్డ్ కంపెనీలో పనిచేస్తూ ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 11,500 మందికి తగ్గింది. మరలా వీరి నుంచి 4 వేలమందిని కంపెనీ తీసేస్తానంటుంది. ఫోర్క్స్ వాగెన్ కంపెనీలో ఉద్యోగాలు తీసివేయటం ద్వారా 150 కోట్ల యూరోలు అదా చేస్తానంటుంది. 2019 తో పోలిస్తే 2035 సంవత్సరం నాటికి లక్ష 86 వేల ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతామని జర్మన్ ఆటోమోటివ్ ఇండస్ట్రీ అసోసియేషన్

ప్రకటించింది. ట్రంప్ నెగ్గిన నాటినుంచీ లాభాలు, మార్కెట్లు, చౌకగా ముడిసరుకులు కొనే ఆలోచనలో ఉన్నాడు తప్ప, కార్మిక శ్రేయస్సు ఏ మాత్రం పట్టించుకోవటంలేదని ప్రపంచ సోషలిస్టు ఆన్‌లైన్ వెబ్‌సైట్ పత్రిక రాసింది. ప్రపంచ ధనవంతుడైన ఎలాన్‌మస్క్ ప్రస్తుతం ట్రంప్‌కు కుడిభుజంగా ఉన్నాడు. లాభాలే ధ్యేయంగా నిర్ణయాలు తీసుకొంటూ

> **ఫోర్డ్ పరిశ్రమ జర్మనీలో 4 వేల కార్మికుల్ని ఉద్యోగాల్నుంచి తీసేస్తానని ప్రకటించింది. ఐరోపాలో ఒకప్పుడు 20 వేల మంది ఫోర్డ్ కంపెనీలో పనిచేస్తూ ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 11,500 మందికి తగ్గింది. మరలా వీరి నుంచి 4 వేలమందిని కంపెనీ తీసేస్తానంటుంది. ఫోర్క్స్ వాగెన్ కంపెనీలో ఉద్యోగాలు తీసివేయటం ద్వారా 150 కోట్ల యూరోలు అదా చేస్తానంటుంది. 2019 తో పోలిస్తే 2035 సంవత్సరం నాటికి లక్ష 86 వేల ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతామని జర్మన్ ఆటోమోటివ్ ఇండస్ట్రీ అసోసియేషన్ ప్రకటించింది.**

విద్యారంగాన్ని, పెన్షన్లు, ఆరోగ్య, భీమా సేవా పథకాలు, సాంఘిక భద్రత వంటి అంశాలను నిర్లక్ష్యం చేస్తున్నాడని ప్రజలు విమర్శిస్తున్నారు. అర్జెంటీనా అధ్యక్షుడు ఫాసిస్టు జానియర్ మిలై తనకు ఆదర్శమని మస్క్ అంటున్నాడు. ఇతని హయాంలో ప్రభుత్వ పథకాలకు 30 శాతం కోతలు పెట్టగా దేశంలో 50 శాతం పేదరికం పెరిగిందని మస్క్ గానీ, ట్రంప్‌గానీ గ్రహించటం లేదు. ప్రస్తుతం జర్మనీలోనూ, యూరపులోనూ ఆనందిస్తూ అనుభవిస్తున్న సంపద భవిష్యత్తులో చేయిజారనుందని బెక్‌హోఫ్ కంపెనీ అధినేత అంటున్నారు. సాధారణంగా కార్ల పారిశ్రామిక సంక్షోభం 5 నుంచి 8 సంవత్సరాల కొకసారి వస్తుందని, కానీ ప్రస్తుతం సంక్షోభం చాలా లోతైనదని దీనినుంచి కోలుకోవటం చాలా కష్టమని బెక్‌హోఫ్ అంచనా వేస్తున్నారు.

సరఫరా గొలుసు సమస్యలు, హెచ్చుతగ్గుల డిమాండుతో పాటు, ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలవైపునకు మళ్లుతుండగా ఓపెల్ కంపెనీ కూడా సర్దుబాట్లు చేసుకోవాల్సి వస్తున్నది. ఈ సమస్యలను జర్మనీలోని ఓపెల్ కంపెనీ రస్సెల్ షీమ్ ప్లాంటు ఎదుర్కొంటున్నది. ఓపెల్ ఆస్ట్రా, డిఎస్4 బ్రాండ్లను ఉత్పత్తి నిలుపుదలచేసి తాత్కాలికంగా ఉద్యోగులను ఇంటికి పంపారు. డిసెంబరు 9 నుంచి ఫ్యాక్టరీ కార్యకలాపాలు ఒకే షిఫ్టుకు పరిమితం చేయాలనుకుంటున్నారు.

అక్టోబరు 21 నాడు ఆక్స్‌ఫామ్ ఇన్‌స్టిట్యూట్, డెవలప్‌మెంట్ ఫైనాన్స్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో పరిశీలించిన 164 దేశాలలో 90 శాతం దేశాలు ఆర్థిక అసమానతలను పెంచేందుకే ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నాయి. అసమానత సూచిక తగ్గించేందుకు దేశాలకు నిబద్ధత అవసరమని దీనికి 3 అంశాలను పేర్కొంది. ప్రజాసేవలకు(విద్య, ఆరోగ్యం, సామాజిక రక్షణ) పెద్దపీట వేయటంతోపాటుగా ప్రగతిశీల పన్నులు ఉండాలని, కార్మిక హక్కులు, వేతనాలు ప్రధానంగా ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపాయి.

ఆర్థిక అసమానతల వ్యత్యాసం తగ్గనంత కాలం పెట్టుబడిదారీ ఆర్థిక సమాజంలో ప్రజలకు కొనుగోలు శక్తి పడిపోతూ ఉంటుంది. తద్వారా వస్తు ఉత్పత్తి డిమాండు తగ్గిపోతుంటుంది. పెట్టుబడిదారుడు తన వస్తూత్పత్తిని ప్రోత్సహించటానికి అమ్మకాల్లో ఫైనాన్స్ క్యాపిటల్ పేరిట ఈఎమ్ఐలు ప్రవేశపెట్టి వడ్డీ వ్యాపారంతో రుణాల్ని వేతన కార్మికులకు, మధ్యతరగతి వర్గాలకు ఇస్తుంటాడు. కానీ ఒకపక్క ద్రవ్యోల్బణం, మరోవైపు పెరగని వేతనాలు, ఇంకోవైపు పన్నుల భారంతో సతమతమయ్యే ప్రజల ఆర్థికస్తోమత పడిపోవటానికి తోడుగా ప్రభుత్వ సాంఘిక కోతల వలన ఆర్థిక అసమానతలు పెరగటంతో ప్రజలు నూతన వస్తువుల కొనుగోళ్లపై ఆసక్తి చూపకపోవటంతో గిరాకి పడిపోయి, పెట్టుబడిదారీ వ్యవస్థలో తయారైన ఉత్పత్తులు సరఫరా గొలుసును చేరలేక ఉత్పత్తి సంక్షోభంలోకి వెళుతుంది. ఇది ఈనాడు కార్ల పరిశ్రమలతో పాటు, మోటారు సైకిళ్లు, గృహాల కొనుగోళ్లు మొదలగు చోట్ల చూపిన్నాయి. ఆర్థిక అసమానతల నిర్మూలనకు సంపద సృష్టించే కార్మికునికి దోపిడీ లేని వేతనం అందించినప్పుడే వస్తు విపణిలో సరుకులు అమ్ముడవుతాయి, ఉద్యోగ భద్రత ఏర్పడుతుంది.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యవర్గ సభ్యులు,
సెల్: 9849491969

చెరకు రైతుల ఉక్కిరి బిక్కిరి

బొల్లిముంత సాంబశివరావు

రైతాంగ ప్రయోజనాలను హరించే విధంగా మోదీ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నది. పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించకపోవటం, విత్తనాలు, ఎరువుల, పురుగుమందుల ధరలు పెంచటం, ఎరువుల ధరల నిర్ణయాధికారం ఎరువుల కంపెనీలకే ఇవ్వటం, పోషకాలను బట్టి ఎరువుల సబ్సిడీ ఇవ్వటం, ధాన్య సేకరణ నుంచి ఎఫ్‌సీఐని తప్పించటం, వ్యవసాయ రంగంలో బహుళ జాతి సంస్థలకు అవకాశం కల్పించటం, ల్యాండ్ టైటిల్ యాక్ట్ పేరుతో భూముల సర్వే చేయించి కార్పొరేట్లకు భూములు కట్టబెట్టటం, రైతుల మోటార్లకు కరెంట్ మీటర్లు బిగించమని రాష్ట్రాలపై ఒత్తిడిచేయడంలాంటి చర్యలు ఇప్పటికే అమలు చేసింది. తాజాగా చెరకు రైతుల రాయితీలు రద్దుచేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ విధానాల వల్ల చెరకు రైతాంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఆ సంక్షోభం ఇంకా ఎక్కువ అయ్యేలా మోదీ ప్రభుత్వం వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ 1966 సుగర్ (నియంత్రణ) ఆర్డర్, 2018 నాటి చక్కెర నియంత్రణ ఆర్డర్‌ను కలిపి ది షుగర్ (నియంత్రణ) ఆర్డర్ 2024 ముసాయిదాను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఉత్పత్తి ప్రక్రియలో సాంకేతిక పురోగతి, పరిశ్రమలో మార్పులను పేర్కొంటూ 2024 ముసాయిదా విడుదల చేసినట్లు చెప్పింది. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందటానికి పంచదార రికవరీ రేటును 8.5శాతం నుంచి 10శాతానికి కొత్త ముసాయిదాలో పెంచింది. భారత దేశంలో రికవరీ రేట్ రీడింగ్‌ను సక్రమంగా తెలిపే మిషన్లు లేవు. రికవరీని పెంచే నాణ్యమైన విత్తనం ముసాయిదాలో పేర్కొన్న 10శాతం రికవరీ రేటు రాక మద్దతు ధర పొందలేరు. దేశంలో పంచదార రికవరీ 9 శాతం మించి ఎప్పుడు రాలేదు. 2024 నవంబర్ మొదటి వారంలో 8.82 శాతం మాత్రమే ఉంది. బ్రెజిల్ లాంటి కొన్ని దేశాల్లో 11 నుంచి 14శాతం పైగా పంచదార రికవరీ వస్తుంది. సుగర్(నియంత్రణ) ఆర్డర్ 1966లోని సెక్షన్ 5ఎ, చక్కెర మిల్లుల ద్వారా వచ్చే లాభాల నుంచి అదనపు ధర వాటా పొందేందుకు రైతులకు వీలు కల్పించింది. ఇప్పుడు ఆ నిబంధన తొలగించటంతో లాభాలను పంచకుండా తప్పించుకుంటున్న మిల్లులకు వరమైంది. ప్రభుత్వం ప్రకటించిన ధరతో పాటు, రాష్ట్ర ప్రభుత్వాలు అదనంగా సలహా (ఎస్ఏపీ) ధరను ప్రకటించటానికి 1966 ముసాయిదాలో వీలు కల్పించిన నిబంధనను కూడా కేంద్ర ప్రభుత్వ కొత్త ఆర్డర్ ముసాయిదా

తొలగించింది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక మరికొన్ని రాష్ట్రాలు 2 నుంచి 5 వందల వరకు సలహా ధరను ప్రకటిస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కొన్ని సంవత్సరాలు 200 సలహా ధరను ప్రకటించింది. కొత్త సుగర్ (నియంత్రణ) ఆర్డర్ ప్రకారం రాష్ట్రాలు సలహా ధరను ప్రకటించలేవు. చక్కెర మిల్లులు బ్యాంకుల్లో తనఖా పెట్టిన పంచదార అమ్ముకోవటానికి కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పదని కొత్త ముసాయిదాలో పేర్కొన్నారు. ఫలితంగా చెరకు కొనుగోలు చేసిన 14 రోజుల లోపు మిల్లులు డబ్బులు చెల్లించాలన్న నిబంధన నిరుపయోగంగా మారింది. రైతులకు డబ్బులు ఎప్పుడు చెల్లించాలన్న అధికారం మిల్లులకు దక్కింది. చెరకు విక్రయ డబ్బులు పొందటానికి మిల్లర్ల దయపై రైతులు ఆధారపడాల్సి వస్తుంది. ప్రపంచంలోని 195దేశాల్లో 124దేశాలు చెరకు పండిస్తున్నాయి. భారతదేశంలో 50 లక్షల ఎకరాల్లో చెరకు పండిస్తున్నారు. చక్కెర తయారీ పరిశ్రమలకే కాకుండా కాగితం, మద్యం, పశువుల దాణా, రసాయనాల తయారీకి ముడి పదార్థాల ఉత్పత్తిని చెరకు సేద్యం అందిస్తుంది. ఎకరాకి సగటు దిగుబడి 30 టన్నులు వస్తుంది. ఎకరాకు సేద్యానికి అన్ని రకాల ఖర్చు లక్ష దాకా ఉంది. కౌలు రైతుకు అదనంగా మరో 20వేలు ఖర్చుగా పెట్టాలి. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, దేశంలోని వ్యవసాయ పరిశ్రమల్లో చక్కెర పరిశ్రమ రెండవ పెద్ద పరిశ్రమ. చక్కెర ఉత్పత్తిలో బ్రెజిల్ మొదటి స్థానంకాగా, భారత్ రెండవ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 5.60 లక్షల ఎకరాల్లో రైతులు చెరకు సాగు చేస్తున్నారు.

రైతాంగ వ్యతిరేక విధానాలు: దేశంలో లక్షలాది రైతు కుటుంబాలకు జీవనోపాధిగా ఉండి, ఎందరికో ఉపాధికల్పిస్తూ, పెద్ద మొత్తంలో విదేశీమారక ద్రవ్యాన్ని దేశానికి అందిస్తున్న చెరకు రైతాంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా చెరకు సేద్యం నేడు తీవ్ర సంక్షోభంలో ఉంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధర చెరకు రైతులకు ఏమాత్రం మేలు చేయలేదు. దిగుబడి ఎకరాకు 30 టన్నులు. ప్రభుత్వం చెప్పే క్వింటాల్ చెరకు ఉత్పత్తి ఖర్చు 157 రూపాయలు. వాస్తవ ఖర్చు 305 రూపాయలు. కేంద్రం ప్రకటించిన క్వింటాల్ మద్దతు ధర 350 రూపాయలు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం వాస్తవ ఖర్చుపై 50శాతం పెంచితే 450 ప్రకటించాలి. 10శాతం పంచదార రికవరీ వచ్చే చెరకుకి మాత్రమే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుంది. అంతకన్నా తక్కువ రికవరీ వస్తే తగ్గిన దాని ప్రకారం మద్దతు ధరలో కోత పడుతుంది. మద్దతు ధర ప్రకారం 30 క్వింటాళ్లు వచ్చిన రైతుకు లక్షా ఐదువేల ఆదాయం వస్తుంది. ఈ ఆదాయం సొంత భూమి రైతులకు ఖర్చులకు సరిపోవటం లేదా నామ మాత్రపు మిగులు ఉంటుంది. కౌలు రైతులకు పెట్టుబడి కూడా రాదు. టన్ను చెరకు ద్వారా 280 కిలోల పంచదార లభిస్తుంది. కిలో 30 చొప్పున 8680 రూపాయలు వస్తుంది. మద్దతు ధర ప్రకారం టన్ను చెరకు ద్వారా రైతుకు లభించేది 3500 రూపాయలు. మిల్లు యజమానులకు మిగులుతున్నది 5,180 రూపాయలు. ఎకరం చెరకుపైన మిల్లు యజమాని 1,60,580 రూపాయలు మిగులు పొందుతాడు. ఫ్యాక్టరీ ఖర్చుల కింద 50 వేలు తీసేసినా లక్షకు పైగా మిగులుతుంది.

దేశంలో 453 చక్కెర మిల్లులు ఉంటే వాటిల్లో 252 సహకార రంగంలో, 67 ప్రభుత్వ రంగంలో, 134 ప్రైవేట్ రంగంలో ఉన్నాయి. సహకార, ప్రభుత్వ పంచదార మిల్లులను ప్రోత్సహించాల్సిన మోదీ ప్రభుత్వం, అందుకు విరుద్ధంగా వాటిని మూసివేయటం లేదా అమ్మి వేయటం చేస్తున్నది. చెరకు రంగమంతా ఎక్కువగా ప్రైవేట్ పరిశ్రమల చేతుల్లో ఉంది. రైతులు ప్రైవేట్ మిల్లులకే 90శాతం చెరకు విక్రయిస్తున్నారు. మిల్లుల యజమానులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకన్నా తక్కువఇస్తూ రైతాంగాన్ని దోచుకుంటున్నారు. సకాలంలో డబ్బులు ఇవ్వకుండా రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సంవత్సరాల తరబడి వేలాది రూపాయలు రైతులకు బకాయిలు పెట్టారు. ప్రస్తుతం 5వేల కోట్ల దాక రైతులకు చెల్లించాల్సిన బకాయిలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి మిల్లు ఇవ్వాల్సిన డబ్బులు ఇచ్చేలా చర్యలు తీసుకోకుండా మిల్లు యజమానుల ప్రయోజనాలకోసం తానే హామీ ఉండి వేలాది కోట్లు బ్యాంకుల నుంచి అప్పులు ఇప్పించింది. రైతాంగం మాత్రం అప్పుల్లో కూరుకు పోయారు.

మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా చెరకు సేద్యం నష్ట దాయకంగా మారటంతో చెరకు సేద్యంపై రైతుల్లో విముఖత ఏర్పడి లక్షలాది ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గింది. ఫలితంగా 2022లో పంచదార ఉత్పత్తి 328.7 లక్షల టన్నులు కాగా, 2023 నాటికి 311లక్షల టన్నులకు తగ్గింది. సేద్యాన్ని నష్టదాయకంగా మార్చి రైతాంగం సాగు నుంచి తప్పుకునేలాచేసి, చెరకు పంటను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి, పంచదారను విదేశాల నుంచి మోదీ ప్రభుత్వం దిగుమతి చేసుకోనుంది. ఇప్పటికే 3 లక్షల టన్నులు దేశంలోకి దిగుమతి అయింది. మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా యావన్మంది చెరకు రైతులు ఉద్యమించాలి. 2024 సుగర్ (నియంత్రణ) ఆర్డర్ ముసాయిదాను ఉపసంహరించాలని, టన్నుకు చెరకుకు 4,775 రూపాయల మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేయాలి.

సెల్:9885983526

దిల్లీలో మెరుగైన వాయు నాణ్యత

న్యూదిల్లీ: గత కొన్ని రోజులుగా తీవ్ర వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అయిన దిల్లీ వాసులకు కాస్త ఉపశమనం లభించింది. రాజధాని ప్రాంతంలో బుధవారం గాలి నాణ్యత కాస్త మెరుగుపడింది. బుధవారం ఉదయం 8 గంటల సమయంలో దిల్లీలో వాయునాణ్యత 211గా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా వెల్లడించింది. దీన్ని మోడరేట్ కేటగిరీ కింద సూచిస్తారు. కాగా, 20 రోజుల క్రితం దిల్లీలో వాయు కాలుష్య సూచీ (ఏక్యూఐ) 500 మార్క్‌ను తాకి ప్రమాదకర స్థాయిలో నమోదైన విషయం తెలిసిందే. ఆ తర్వాత కాస్త తగ్గుతూ వచ్చింది. ఈ వారం మరింత తగ్గుముఖం పట్టింది. ఆదివారం 285, సోమవారం 273గా నమోదైన ఏక్యూఐ స్థాయిలు... మంగళవారం 268 వద్ద నిలిచిన విషయం తెలిసిందే. బుధవారం ఇంకాస్త మెరుగుపడటంతో రాజధాని వాసులు ఊపిరి పీల్చుకుంటున్నారు. మరోవైపు దిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. సీజన్ సగటు కంటే 2.5 డిగ్రీలు ఎక్కువగా నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది.

కల్తీ మద్యం మృతులకు రూ.10 వేల పరిహారమా: సీమాన్

చెన్నై: రాష్ట్రంలో గౌరవప్రదమైన మరణం అంటే కల్తీ మద్యం తాగి మరణించడమేనా.. ద్రవిడన్ అంటే దొంగ... సంఘీ అంటే స్నేహితుడంటున్నారని నామ్ తమిళర్ కట్చి సమన్వయకర్త సీమాన్ వ్యాఖ్యానించారు. స్థానిక విమానాశ్రయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు చేస్తున్న ఆదాయ పన్ను శాఖ అధికారులు ముఖ్యమంత్రి స్టాలిన్ గురించి పట్టించుకోవట్లేదన్నారు. విధి నిర్వహణలో మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు రూ. రెండు లక్షలు, ప్రకృతి వైపరీత్యాల ప్రమాదాల్లో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.ఐదు లక్షలు ఆర్థిక సాయం అందజేస్తున్న స్టాలిన్ ప్రభుత్వం... కల్తీ మద్యం తాగి మరణించిన వారి కుటుంబాలకు మాత్రం రూ.10 లక్షలు నష్టపరిహారంగా చెల్లించడం విడ్డూరంగా ఉందన్నారు.

భార్య ప్రయాణిస్తున్న కారుకు నిప్పంటించిన భర్త

తిరువనంతపురం: ఒక వ్యక్తితో కలిసి మహిళ కారులో వెళ్తుండగా... ఈ విషయం తెలిసిన ఆమె భర్త మరో కారులో వెంబడించాడు. ఒక చోట ఆ కారును అడ్డగించి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. మంటల్లో కాలి అతడి భార్య మరణించింది. ఆ కారులో ఉన్న వ్యక్తి గాయాలతో బయటపడ్డాడు. కేరళలోని కొల్లాంలో ఈ దారుణ ఘటన జరిగింది. 44 ఏళ్ల మహిళ ఒక వ్యక్తితో కలిసి కారులో ప్రయాణించింది. ఈ విషయం తెలుసుకున్న ఆ మహిళ భర్త పద్మరాజన్ (50) మరో కారులో వెంబడించాడు. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో కొల్లాం సిటీ ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చెమ్మమ్ముక్కు ప్రాంతంలో ఆ కారును పద్మరాజన్ అడ్డుకున్నాడు. ఆ వాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. అతడి భార్య అనీలా మంటల్లో కాలి మరణించింది. ఆ కారులో ఉన్న మరో వ్యక్తికి కాలిన గాయాలయ్యాయి. మరోవైపు ఈ విషయం తెలిసిన పోలీసులు మృతురాలి భర్త పద్మరాజన్‌ను అరెస్ట్ చేశారు. కాలిన గాయాలైన వ్యక్తిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

జగన్నాథస్వామి సేవలో రాష్ట్రపతి ముర్ము

భువనేశ్వర్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒడిశా రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా పూరీలోని ప్రఖ్యాత జగన్నాథ ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, ఒడిశా సీఎం మోహన్ చరణ్ తో కలిసి ఆలయానికి చేరుకున్న రాష్ట్రపతికి అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో రాష్ట్రపతి ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు ముర్మును శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బస్సును ఢీకొన్న లారీ: ఒకరి మృతి

తిరువనంతపురం: కేరళ రాష్ట్రం కొల్లాం జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. శబరిమలకు భక్తుల తో వెళ్తున్న బస్సును లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. డజను మందికిపైగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున 3:45 గంటల ప్రాంతంలో ఆర్యన్ కావు గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అతి వేగంగా వెళ్తున్న లారీ.. బస్సును బలంగా ఢీ కొట్టింది. దీంతో బస్సు రోడ్డు పక్కన 40 అడుగుల లోతులోకి పడిపోయింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. మృతుడు సేలంకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ ప్రమాదంలో చిన్నారులు, వృద్ధులు సహా మొత్తం 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

సీఎం పదవి 'సాంకేతికమే'

- మిత్రపక్షాలతో కలిసి పని చేస్తా : ఫడ్నవీస్
- డిప్యూటీగా ఉంటా : అజిత్ పవార్
- నా రెండేళ్ల పాలనతో సంతృప్తి చెందా : షిండే

ముంబై : ముఖ్యమంత్రి పదవి ఒక 'సాంకేతిక ఏర్పాటు' అని బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ బుధవారం అన్నారు. మిత్రపక్షాలు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌ను కలుపుకుని మహారాష్ట్రలో మహాయుతి కొత్త సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతానని తెలిపారు. తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ఆహ్వానించిన గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసిన అనంతరం ఫడ్నవీస్ విలేకరులతో మాట్లాడారు. ఆయన వెంట షిండే, పవార్ ఉన్నారు. 'ముఖ్యమంత్రి పదవి అనేది సాంకేతిక ఏర్పాటు. మేం ముగ్గురం కలిసి ఐక్యంగా పని చేస్తాం' అని ఫడ్నవీస్ చెప్పారు. 'నేను, ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తాం (గురువారం సాయంత్రం ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా) ఎంత మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తారనేది ఇంకా నిర్ణయించలేదు' అని అన్నారు. మంగళవారం సాయంత్రం షిండేతో సమావేశమై ప్రభుత్వంలో చేరాల్సిందిగా ఆహ్వానించినట్లు ఫడ్నవీస్ తెలిపారు. అయితే ప్రస్తుతం ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్న షిండేను ప్రభుత్వంలో చేరతారా అని అడిగినప్పుడు సమాధానాన్ని దాట వేశారు. 'సాయంత్రం వరకు ఆగండి' అని జులై 2022 నుంచి మహాయుతి ప్రభుత్వానికి ముఖ్యమంత్రిగా ఉన్న శివసేన అధ్యక్షుడు అన్నారు. అజిత్ పవార్ జోక్యం చేసుకుంటూ, తాను (ఉప ముఖ్యమంత్రిగా) ప్రమాణ స్వీకారం చేయబోతున్నానని నవ్వుతూ చెప్పారు. దీనికి షిండే అదే పంథాలో బదులిస్తూ... 'అతనికి అనుభవం ఉంది. అతను ఉదయం, సాయంత్రం ప్రమాణం చేయవచ్చు' అని అన్నారు. 2019లో బీజేపీ, అజిత్ నేతృత్వంలోని ఎన్సీపీ వర్గం స్వల్పకాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు ఫడ్నవీస్ డిప్యూటీగా అజిత్ పవార్ ఉదయం ప్రమాణ స్వీకారం చేయడాన్ని స్పష్టంగా ప్రస్తావించారు. శివసేన, ఎన్సీపీతో పాటు రాష్ట్రీయ సమాజ్ పక్ష, జన్సురాజ్య శక్తి పార్టీ, యువ స్వాభిమాన్ పార్టీ రవి రాణా, మరో ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు మద్దతు లేఖలు ఇచ్చారని ఫడ్నవీస్ తెలిపారు. కొత్త ప్రభుత్వం ఐక్యంగా పనిచేస్తుందని అజిత్ పవార్ చెప్పగా, తన రెండున్నరేళ్ల పదవీ కాలంలో సంక్షేమ చర్యలు, అభివృద్ధి అజెండాను సమతుల్యంగా కొనసాగించడం పట్ల తాను సంతృప్తి చెందానని షిండే చెప్పారు.

'మేం ఒక టీమ్‌గా పనిచేస్తాం. భారీ ఆదేశం కారణంగా మా బాధ్యత పెరిగింది' అని షిండే అన్నారు. గత నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి 288 స్థానాలకు గాను 230 స్థానాలను కైవసం చేసుకుని భారీ మెజారిటీతో గెలుపొందింది.

దిల్లీలో కుటుంబంపై కత్తులతో దాడి

దంపతులు సహా కుమార్తె మృతి

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ఒకే కుటుంబానికి ముగ్గురు వ్యక్తులు దారుణ హత్యకు గురయ్యారు. దక్షిణ దిల్లీలోని నెబ్ సరాయ్‌లో బుధవారం ఉదయం ఈ ఘటన వెలుగుచూసింది. స్థానిక నెబ్‌సరాయ్ ప్రాంతంలో దంపతులు తమ కుమారుడు, కుమార్తెతో కలిసి నివసిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు వారి ఇంట్లోకి చొరబడి దంపతులు రాజేష్(55), కోమల్(47), వారి కుమార్తె కవిత(23)లపై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేసి హత్య చేశారు. ఉదయం నడకకు వెళ్లిన ఆయన కుమారుడు ప్రాణాలతో బయటపడ్డాడు. కొడుకు తన మార్నింగ్ వాక్ కోసం ఉదయం 5 గంటలకు ఇంటి నుండి బయలుదేరాడు. అతను ఇంటికి తిరిగి వచ్చేసరికి.. తన తల్లిదండ్రులు, సోదరి రక్తపు మడుగులో పడి ఉండటాన్ని చూసి దిగ్భ్రాంతికి గురయ్యాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన తండ్రి రాజేష్ ఆర్మీలో పని చేసి రిటైర్ అయ్యాడని తెలిపాడు. డిసెంబర్ 4న తమ తల్లిదండ్రుల వివాహ వార్షికోత్సవం ఉందని... ఇందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. తెల్లారితే వారితో సంతోషంగా జరుపుకుందామనుకునేలోపు ఈ దారుణం చోటుచేసుకుందని కుమారుడు కన్నీరుమున్నీరయ్యాడు. దిల్లీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. హంతకుల ఆచూకీ కోసం వెంటనే గాలింపు ప్రారంభించారు. ఈ కేసును అనేక కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, ఫోరెన్సిక్ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని అదనపు ఆధారాల కోసం శోధిస్తున్నాయని పోలీసు అధికారి తెలిపారు. ఇంట్లో ఎలాంటి వస్తువులు దొంగతనం జరగలేదని తెలిపారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని... దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు.

గంగానది నీరు కేవలం స్నానానికే!

మానవ వ్యర్థాల వల్ల నది కలుషితం

డెహ్రాడూన్: హరిద్వార్‌లోని గంగా నది నీరు తాగడానికి పనికిరాదని ఉత్తరాఖండ్ కాలుష్య నియంత్రణ మండలి తేల్చిచెప్పింది. అయితే స్నానానికి వినియోగించుకోవచ్చని సూచించింది. గంగా నదిలో నీటి నాణ్యత కేటగిరీ 'బి' స్థాయికి పడిపోయిందని వెల్లడించింది. "కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నీటి నాణ్యతను ఐదు తరగతులుగా విభజించింది. అందుకు పీహెచ్, కరిగిన ఆక్సిజన్, బయోలాజికల్ ఆక్సిజన్, కోలిఫాం బ్యాక్టీరియా వంటి నాలుగు పరిమితుల ఆధారంగా నీటి నాణ్యతను అంచనా వేస్తోంది. హరిద్వార్?లో గంగా నదిలోని నీటి నాణ్యత 'బి' కేటగిరీలో ఉంది. అంటే ఆ గంగా జలం తాగడానికి పనికిరావు. స్నానానికి అనువుగా ఉంటాయి" అని ఉత్తరాఖండ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (యూకేపీసీబీ) ప్రాంతీయ అధికారి రాజేంద్ర సింగ్ తెలిపారు. హరిద్వార్‌లో గంగా నది నీటి కాలుష్యంపై స్థానిక పూజారి ఉజ్వల్ పండింట్ ఆందోళన వ్యక్తం చేశారు. మానవ వ్యర్థాల వల్ల గంగాజల స్వచ్ఛత దెబ్బతింటుందని ఆరోపించారు. "గంగాజలంతో స్నానం చేయడం క్యాన్సర్ సహా శరీరంలోని ఇతర రోగాలు నయమవుతాయి. గంగాజలాన్ని తీసుకుని 10 ఏళ్ల తర్వాత తనిఖీ చేసినా దాని స్వచ్ఛత తగ్గదు. గంగాజలం స్వచ్ఛత మానవ వ్యర్థాల వల్లే దెబ్బతింటోంది. దానిని అరికట్టాల్సిన అవసరం ఉంది" అని పూజారి ఉజ్వల్ పండిట్ వ్యాఖ్యానించారు. కాగా... ఉత్తరాఖండ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రతి నెలా హరిద్వార్ చుట్టూ ఉన్న ఎనిమిది ప్రదేశాలలో గంగా జలాన్ని పరీక్షిస్తుంది. నవంబర్ నెలకు సంబంధించి జరిపిన పరీక్షల్లో హరిద్వార్‌లోని గంగా నది నీరు 'బి' కేటగిరీగా తేలింది. అయితే నది నీటి నాణ్యతను ఐదు కేటగిరీలుగా విభజించారు. 'ఎ' కేటగిరి నీరు అతి తక్కువ విషపూరితమైనది. అంటే క్రిమిసంహారణ తర్వాత ఆ నీటిని తాగొచ్చు. 'ఇ' కేటగిరీ వచ్చిన నీటిని అత్యంత విషపూరితమైనదిగా తేల్చారు.

టికెట్లపై రూ.57 వేల కోట్ల రాయితీ

రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్

న్యూదిల్లీ: అన్ని రకాల టికెట్లపై ఏటా రూ.56,993 కోట్ల రాయితీని కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పార్లమెంట్ సమావేశాల ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ... 'ప్రతి రైల్వే టికెట్‌పై భారతీయ రైల్వే 46 శాతం రాయితీ ఇస్తోంది. ఒక్కో ప్రయాణికుడి టికెట్‌పై రూ.100 వెచ్చించాల్సిన చోట రూ.54 మాత్రమే ఖర్చు పెట్టేలా చూస్తున్నాం. ఈ రాయితీ అన్ని తరగతుల ప్రయాణికులకు వర్తింపజేస్తున్నాం' అని వివరించారు. అత్యంత వేగవంతమైన రైల్వే సేవలపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 'భుజ్- అహ్మదాబాద్‌ల మధ్య ఇప్పటికే నమో భారత్ రైలు సేవలను ప్రారంభించాం. ఈ రెండు ప్రాంతాల మధ్య 359 కిలోమీటర్లు ఉండగా... కేవలం ఐదు గంటల 45 నిమిషాల్లో గమ్యస్థానాన్ని చేరుకోవచ్చు. భారత రైల్వే అందిస్తున్న సౌకర్యాలపై ప్రయాణికులు సంతృప్తి చెందుతున్నట్లు భావిస్తున్నాం' అని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

థరూర్‌జీ... అవసరమైతే ధర్నాకు కూర్చోండి

తిరువనంతపురంలో రైల్వే ప్రాజెక్టు జాప్యంపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అడిగిన ప్రశ్నకు అశ్వినీ వైష్ణవ్ సమాధానం ఇచ్చారు. ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టులు పూర్తయ్యేలా భూ సేకరణ కోసం రైల్వేలకు సహకరించేలా రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేయాలని కోరారు. రైల్వే ప్రాజెక్టు నిర్మాణానికి భూసేకరణ కోసం అవసరమైతే కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కేరళలో ధర్నా చేయవచ్చని వైష్ణవ్ సూచించారు. లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో శశిథరూర్ తన సొంత నియోజకవర్గమైన తిరువనంతపురంలో నెమోమ్ రైల్వే టెర్మినల్ ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం, నిధుల కొరతపై అడిగిన ప్రశ్నకు వైష్ణవ్ పైవిధంగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం పెద్ద నగరాలు, జంక్షన్లలో రద్దీని తగ్గించడం... కొత్త టెర్మినల్స్ నిర్మాణంపై దృష్టిపెట్టిందన్నారు. కేరళలో నిధుల సమస్య కాదని, ఇప్పటికే భూసేకరణ కోసం రూ.2,150 కోట్లు డిపాజిట్ చేసినట్లు మంత్రి వెల్లడించారు. భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందు ధర్నాకు కూర్చోవాలని థరూర్‌ని కోరుతున్నట్లు వైష్ణవ్ తెలిపారు.

10వేల జనరల్ బోగీల తయారీకి ప్రత్యేక చర్యలు

దేశ వ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలకు సేవలందిస్తోన్న రైళ్లకు కొత్త జనరల్ బోగీల తయారీపై దృష్టిపెట్టినట్లు కేంద్ర రైల్వేమంత్రి వెల్లడించారు. 'ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ బోగీలపై కాకుండా జనరల్ కోచ్‌లపైనే ఎక్కువ ఫోకస్ పెట్టాం. ఈ నెలాఖరు నాటికి 1,000 జనరల్ కోచ్‌లను రైల్వే నెట్‌వర్క్‌లకు జత చేస్తాం. 10వేల జనరల్ కోచ్‌ల తయారీకి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 1,300 రైల్వే స్టేషన్లను పునర్నిర్మించి ఆధునీకరిస్తున్నాం. ఈ ప్రాజెక్టు కింద అనేక రైల్వే స్టేషన్లను రూ.700 - 800 కోట్లతో, మరికొన్ని రూ.100- రూ.200 కోట్లతో పునర్నిర్మిస్తున్నాం. ఈ ప్రాజెక్టు పూర్తయితే... రైల్వే స్టేషన్లు మరింతగా మెరుగుపడాలన్న ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయి' అన్నారు.

బాదల్‌పై దాడికి పెద్ద కుట్ర: కేజ్రీవాల్

న్యూదిల్లీ: శిరోమణి అకాలీ దళ్ (ఎస్ఏడీ) అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై హత్యాయత్నం వెనుక పెద్ద కుట్రే జరిగిందని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఇది పంజాబ్‌తో పాటు పంజాబీల పరువు తీసే పన్నాగమని ఆరోపించారు. పంజాబ్ పోలీసుల అప్రమత్తతతోనే బాదల్ సురక్షితంగా ఉన్నారని అన్నారు. కేజ్రీవాల్ బుధవారం దిల్లీ అసెంబ్లీలో మాట్లాడుతూ బాదల్‌పై దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ దాడి వెనుక పెద్ద శక్తులే ఉన్నాయని, అప్రమత్తంగా ఉండటం వల్ల శాంతి భద్రతలను ఎలా పరిరక్షించవచ్చో ఈ ఘటన ద్వారా దేశానికి స్పష్టమైందని కేజ్రీవాల్ అన్నారు. 'దిల్లీలో హత్యలు, షూటౌట్లు జరుగుతున్నాయి. దేశ రాజధాని గ్యాంగ్‌స్టర్ల నియంత్రణలో ఉంది. మాదకద్రవ్యాల అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. మహిళలపై అత్యాచారాలు చోటుచేసుకుంటు న్నాయి. కానీ అసలు నేరాలే జరగడం లేదన్నట్లు బీజేపీ, ఆ పార్టీ అగ్రనేతల తీరు ఉంటుంది' అని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. దిలీలో జరిగే నేరాలు -ఘోరాలపై బీజేపీ మౌనం హిస్తోందని దుయ్యబట్టారు.

తమిళనాడు మంత్రికి బెయిల్ ఇస్తే...

మీకూ ఇవ్వాలా: సుప్రీం

న్యూదిల్లీ: తమిళనాడు మంత్రి వి.సెంథిల్ బాలాజీకి బెయిల్ ఇచ్చినందున తనకు కూడా ఇవ్వాలన్న పశ్చిమబెంగాల్ మాజీ విద్యాశాఖ మంత్రి వాదనను సుప్రీంకోర్టు బుధవారం తోసిపుచ్చింది. పార్థ ఛటర్జీ బెయిల్ పిటిషన్‌పై తీర్పును కోర్టు రిజర్వ్ చేసింది. 'ఇక్కడ మంత్రుల మధ్య సమానత్వం అంటూ ఏదీ లేదు. తమిళనాడులో మంత్రికి బెయిల్ వచ్చింది. కావున పశ్చిమబెంగాల్‌లో కూడా మంత్రికి బెయిల్ రావాలని లేదు. ఈ దేశంలో 'మంత్రులందరి' సంఘం వంటిది ఏదీ లేదు' అని జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఛటర్జీ రెండున్నర సంవత్సరాలుగా జైలులో ఉన్నారని, ఈ కేసులోని ఇతర నిందితులు బెయిల్‌పై బయట ఉన్నారని ఆయన తరపు న్యాయవాది ముకుల్ రోహిత్గీ వాదనలు వినిపించారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న మంత్రి ఛటర్జీ ఒక్కరేనని, మాజీ మంత్రికి సంబంధించిన భవనం నుండి రూ.28 కోట్లు స్వాధీనం చేసుకున్నారని ధర్మాసనం పేర్కొంది. స్వాధీనం చేసుకున్న నగదుతో కానీ, సంబంధిత భవనంతో గానీ తనకు ఎలాంటి సంబంధం లేదని నిందితుడు ఖండించలేదని తెలిపింది. ఇప్పుడు తాము సమాజానికి ఏ సందేశం ఇవ్వాలని కోరుకుంటున్నారని జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. అవినీతిపరులు ఇలాగే బెయిల్ పొందవచ్చా, రెండున్నరేళ్లు జైలులో ఉంటే బెయిల్ ఇవ్వాలా అనే దానిపై విచారణకు సమయం పడుతుందని స్పష్టం చేశారు. ఉద్యోగం కోసం నగదు కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో పార్థఛటర్జీని 2022 జులైలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసింది.

మాకు అదానీ కాదు... సంభల్ ముఖ్యం: ఎస్పీ

న్యూదిల్లీ: పారిశ్రామిక దిగ్గజం గౌతం అదానీ అవినీతిపై విచారణకు డిమాండ్ చేస్తూ పార్లమెంట్ వెలుపల ఇండియా ఐక్య సంఘటన అధ్వర్యంలో బుధవారం ఆందోళన జరిగింది. ఈ ఆందోళనలో సమాజ్‌వాదీ పార్టీ పాల్గొనలేదు. దీనిపై ఎస్పీ సీనియర్ నేత ఒకరు మాట్లాడుతూ కాంగ్రెస్‌కు అదానీ వ్యవహారం ముఖ్యం కాగా సమాజ్‌వాదీ పార్టీకి సంభల్ హింస ముఖ్యమని చెప్పారు. సంభల్ హింసపై దృష్టి పెట్టాలని సమాజ్‌వాదీ పార్టీ భావిస్తోంది, ఆ వ్యవహారం నుంచి దృష్టి మళ్లించాలని అనుకోవడం లేదు. కాంగ్రెస్ పార్టీ అదానీ వ్యవహారానికి ప్రాధాన్యత ఇస్తోంది. మాది ప్రాంతీయ పార్టీ... మాకు సంభల్ ముఖ్యం. ఆందోళనలో పాల్గొనడం ద్వారా సంభల్ వ్యవహారాన్ని నీరుగార్చే ఉద్దేశంలేదు' అని అన్నారు. సంభల్‌కు వెళ్లకుండా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అడ్డుకునే అంశాన్ని లోక్‌సభలో కాంగ్రెస్ ప్రస్తావించినప్పుడు, డింపుల్ యాదవ్ నేతృత్వంలో ఎస్పీ ఎంపీలంతా మద్దతుగా వాకౌట్ చేసింది కూడా ఇందు కోసమేనని ఎస్పీ నేత రాంగోపాల్ యాదవ్ వివరించారు. రాజ్యసభలో రైతుల అంశాన్ని లేవనెత్తనున్నట్లు కాంగ్రెస్ ముందే చెప్పివుంటే ఆ పార్టీకి మద్దతుగా సభ కార్యకలాపాలను బహిష్కరించేవా ళ్లమన్నారు. వారు సభలో మాట్లాడేంత వరకు తమకు విషయం తెలియదన్నారు. పార్లమెంటు వెలుపల కాంగ్రెస్ మంగళవారం చేసిన ఆందోళనలోనూ ఎస్పీ పాల్గొనలేదు.

ప్రవేశ ద్వారం వద్ద ఆందోళనలు వద్దు

పార్లమెంటు సభ్యులకు స్పీకర్ సూచన

న్యూదిల్లీ: పార్లమెంటు ప్రవేశ ద్వారం వద్ద ఆందోళనలు చేయొద్దని సభ్యులకు స్పీకర్ ఓం బిర్లా సూచించారు. భవనం లోపలికి వచ్చే వారికి ముఖ్యంగా మహిళా సభ్యులకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. పార్లమెంటు హౌస్ ఎంట్రీ వద్ద ప్రతిపక్ష సభ్యుల ఆందోళన బుధవారం కొనసాగింది. దీంతో స్పీకర్ తాజా సూచనలు చేశారు. 'పార్లమెంటు ప్రవేశ మార్గాన్ని దిగ్బంధించవద్దని, అక్కడ ఆందోళనలు చేపట్టి లోపలికి వచ్చే వారికి అవరోధం సృష్టించవద్దని రాజకీయ పార్టీలన్నింటినీ కోరుతున్నా' అని జీరో అవర్‌కు ముందు ఓం బిర్లా అన్నారు. ఆందోళన వల్ల తమకు ఇబ్బంది కలుగుతున్నట్లు కొందరు మహిళా ఎంపీలు తన దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు. నా సూచనలను అనుసరిస్తారని, ఏదైన సమస్య వస్తే నేరుగా వచ్చి నన్ను కలుస్తారని, ఎంట్రీ గేట్ వద్ద ఆందోళనలు చేపట్టి లోపలికి వచ్చే వారికి ఇబ్బంది కలిగించరని ఆకాంక్షిస్తున్నా అని ఆయనన్నారు. పార్లమెంటు ఔన్నత్యాన్ని కాపాడాలని కోరారు. ఇదిలావుంటే, పార్లమెంట్ సెక్రటేరియట్ కూడా మంగళవారం ఇదే తరహా సూచనలనే సభ్యులకు చేసింది.

పదవీ విరమణ వయసు మారదు: కేంద్రం

న్యూదిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు మార్పు ఊహాగానాలపై కేంద్రం స్పందించింది. ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు మార్చే ప్రతిపాదన ఏదీ తమ పరిశీలనలో లేదని కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. లోక్‌సభ లో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ విషయాన్ని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రస్తుతం 60 ఏళ్లు నిండిన తర్వాత పదవీ విరమణ చేస్తున్న విషయం తెలిసిందే. యువతకు ఉపాధి కల్పించే విధానాలు, కార్యక్రమాలను రూపొందించడంలో ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తోందని మంత్రి తెలిపారు. ఖాళీగా ఉన్న పోస్టులను సమయానుకూలంగా భర్తీ చేయాలని కేంద్ర ప్రభుత్వంలోని మంత్రిత్వ శాఖలు, విభాగాలను ఎప్పటికప్పుడు ఆదేశిస్తున్నామన్నారు. రోజ్‌గార్ మేళాల ద్వారా అన్ని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, స్వయంప్రతిపత్తి సంస్థలు, విద్యా, ఆరోగ్య రంగాల్లోని సంస్థల్లో మిషన్ మోడ్‌లో ఖాళీలు భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాదల్ కుటుంబానికి గడ్డుకాలం

మతపరమైన శిక్షలు... ఖలిస్థానీల నుంచి ముప్పు

చండీగఢ్: పంజాబ్‌లో కొన్ని దశాబ్దాల పాటు రాజకీయాలను శాసించిన బాదల్ కుటుంబం తీవ్రమైన గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది. మతపరమైన శిక్షలకు తోడు ఇప్పుడు ఖలిస్థానీల నుంచి ముప్పు ఎదుర్కొంటోంది. అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయ ప్రాంగణంలో ఏకంగా పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి సుఖ్‌బీర్ సింగ్ బాదల్ పైనే తుపాకీ కాల్పులు జరగడం సంచలనం రేపింది. పంజాబ్‌లో 'ఫస్ట్‌ఫ్యామిలీ'గా ఒక వెలుగు వెలిగిన బాదల్ కుటుంబం... రాజకీయంగా కష్టకాలంలో ఉన్న ఈ సమయంలో దాడి జరగడం చర్చనీయాంశమైంది. సిక్కు ప్రయోజనాల కోసం పనిచేసే శిరోమణి అకాలీదళ్ పార్టీ సుఖ్‌బీర్‌ను అధ్యక్ష పదవిని వీడమనటం, సిక్కులకు ద్రోహం చేసిన వ్యక్తి (తంఖయ్య)గా ఆయన్ను ప్రకటించడం ఆ కుటుంబానికి పెద్ద ఎదురుదెబ్బలుగా భావిస్తున్నారు.

1947లో పంజాబ్ రాజకీయాల్లోకి బ్లాక్ సమితి చైర్మన్‌గా అడుగుపెట్టిన ప్రకాశ్ సింగ్ బాదల్ ఆ తర్వాత పదేళ్లలోనే అకాలీదళ్ నుంచి రాష్ట్ర విధాన సభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత అంచలంచెలుగా ఎదిగి... 1970లో తొలిసారి సీఎం పీఠంపై కూర్చొన్నారు. ఆ తర్వాత 1977-2017 మధ్యలో నాలుగుసార్లు ఆయన ముఖ్యమంత్రిగా పాలించారు. ఈ కాలంలో పంజాబ్‌పై బాదల్ కుటుంబానికి బలమైన పట్టుండేది. ప్రకాశ్‌సింగ్‌కు కుమారుడు సుఖ్‌బీర్ సింగ్, కుమార్తె ప్రణీత్ కౌర్ కైరాన్ ఉన్నారు. తరచూ మీడియా ఈ కుటుంబాన్ని పంజాబ్ ఫస్ట్ ఫ్యామిలీగా అభివర్ణించేది. సుఖ్‌బీర్ కేంద్ర మంత్రిగా, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా, ఎంపీగానూ పని చేశారు. ఆయన భార్య హర్ సిమ్రత్ కౌర్ కూడా కేంద్ర మంత్రిగా పనిచేశారు. సుఖ్‌బీర్ సోదరి ప్రణీత్ కౌర్ కైరాన్, ఆమె భర్త ఆదేశ్ ప్రతాప్‌సింగ్ కైరాన్ కూడా నాలుగు సార్లు అకాలీ దళ్ తరఫున ఎమ్మెల్యేగా పనిచేశారు. ప్రకాశ్‌సింగ్ బాదల్ తన వారసుడిగా సుఖ్‌బీర్‌ను ముందుకుతెచ్చేందుకు పెద్ద నాయకులను సైతం రాజకీయంగా అణచివేశారు. 1996లో కెప్టెన్ అమరీందర్ సింగ్‌కు పటియాల టికెట్ నిరాకరించడంతో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో సుఖ్‌బీర్‌ను సవాలు చేసేవారు లేకుండా చేసి 2008లో అతనికి పగ్గాలు అందించారు. అప్పటికి ఆయన వయసు కేవలం 45 ఏళ్లు మాత్రమే. నాటినుంచి నేటివరకు అకాలీదళ్ నాయకత్వం ఆయన వద్దే ఉంది.

ఖలిస్థానీ ఉద్యమంతో ఇబ్బందులు

పంజాబ్‌లో అకాలీదళ్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు తెరపైకి వచ్చిన ఖలిస్థాన్ ఉద్యమం బాదల్ కుటుంబానికి ఇబ్బందికరంగా మారింది. భింద్రన్ వాలాపై సైనిక చర్యలకు ప్రకాశ్‌సింగ్ మద్దతు పలికారని కొన్నాళ్ల క్రితం ఆ రాష్ట్ర మాజీ సీఎం అమరీందర్ సింగ్ వెల్లడించారు. కానీ చాలా సంవత్సరాలుగా పంజాబ్‌లో వేర్పాటువాదంపై అకాలీదళ్ వైఖరిలో కొంత మార్పు వచ్చింది. కానీ,

తాజాగా ఖలిస్థానీ మద్దతుదారు సంస్థ బబ్బర్ ఖల్సాకు చెందిన నరైన్ చౌరా అనే మిలిటెంట్ సుఖ్‌బీర్‌పై స్వర్ణ దేవాలయంలో దాడికి పాల్పడ్డాడు. 1984లో పంజాబ్‌లో ఉగ్రవాదం పెరిగిన సమయంలో నరైన్ పాకిస్థాన్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది.

తంఖయ్యగా...

మతపరమైన దుష్ప్రవర్తనకు పాల్పడినందుకు సిక్కుల అత్యున్నత స్థానమైన శ్రీ అకాల్‌తక్త్ సాహెబ్ డిసెంబర్ 2న సుఖ్‌బీర్‌ను తంఖయ్య (దోషి)గా ప్రకటించిన సంగతి విదితమే. ఆయనతోపాటు మరో 12 మంది అకాలీదళ్ నేతలను మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి స్వర్ణదేవాలయ ప్రాంగణంలో రెండ్రోజులపాటు వాష్‌రూమ్‌లను కడగడం, ఊడ్చడం, గిన్నెలు తోమడం వంటి పనులు చేయాలని ఆదేశించింది. ఈ శిక్షను పాటించకపోతే వారిని మత బహిష్కరణ చేసే అవకాశం కూడా ఉంది. అంతేకాదు దివంగత ప్రకాశ్‌సింగ్ బాదల్‌కు ఇచ్చిన 'ఫకర్ ఈ క్వామ్' గౌరవాన్ని కూడా వెనక్కు తీసుకొంది. 2007-17 మధ్యలో అకాలీదళ్-బీజేపీ ప్రభుత్వం ఉన్న సమయంలో తీసుకొన్న కొన్ని మతపరమైన తప్పుడు నిర్ణయాలకు ఈ శిక్షను విధించినట్లు తెలిపింది. గతంలో పెద్ద నాయకులు మాజీ రాష్ట్రపతి జ్ఞాని జైల్‌సింగ్, కాంగ్రెస్ నేత బూటా సింగ్, మాజీ సీఎంలు సుర్జీత్ సింగ్ బర్నాల, కెప్టెన్ అమరీందర్ సింగ్ వంటి వారిని కూడా తంఖయ్యలుగా ప్రకటించారు. ఇలా ప్రకటించినవారు కొన్నాళ్లపాటు సామాజిక సేవ చేయాల్సి ఉంటుంది. తాజాగా దాడి అనంతరం కూడా సుఖ్‌బీర్ స్వర్ణ దేవాలయంలో సేవను కొనసాగిస్తున్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

రైతులకు అందుబాటులో ఉండాలి : మంత్రి జూపల్లి

విశాలాంధ్ర - ఆమనగల్లు : పాలకవర్గం సభ్యులు రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని రాష్ట్ర ఎక్సైజ్ పర్యటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. బుధవారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. స్థానిక శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్లో రాష్ట్ర ఎక్సైజ్ పర్యటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, సిడబ్ల్యూసి చల్లా వంశీ చంద్‌రెడ్డి సమక్షంలో ఛైర్మన్ గాయాట గీతనర్సింహా, వైస్ ఛైర్మన్‌గా గూడూరు భాస్కర్ రెడ్డితోపాటు పలువురు డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో మార్కెట్ కమిటీలు అభివృద్ధి పథంలో ముందుకెళ్తున్నాయని చెప్పారు. రైతుల సంక్షేమం అజెండాగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని, రైతులకు ఏ కష్టం వచ్చినా పార్టీలకతీతంగా అక్కున చేర్చుకొని పనిచేయాలని, వచ్చిన పదవికి మంచి పేరు తెచ్చుకోవాలని మంత్రి సూచించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గంగా ప్రమాణం చేసిన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ మార్కెట్ అభివృద్ధికి కొత్త కార్యవర్గం పాటు పడాలన్నారు. ప్రమాణస్వీకారం అనంతరం కమిటీ చైర్మన్ యాట గీత రిజిస్టర్‌లో సంతకాలు చేసి బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్ యాట గీతనర్సింహా మాట్లాడుతూ మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తామని, రైతులకు సేవలందించేందుకు తమ కమిటీ నిరంతరం శ్రమిస్తుందన్నారు. అందుకు నాయకులు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

మంత్రివర్గ విస్తరణలో ఎమ్మెల్యే మల్ రెడ్డికి స్థానం కల్పించాలి

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : మంత్రివర్గ విస్తరణలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి స్థానం కల్పించాలని సామాజిక కార్యకర్త, తెలంగాణ బత్రాజు యోజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు కూరపాటి నరసింహారాజు అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కూరపాటి నరసింహారాజు, సరికొండ రుషికేశ్వర్ రాజులు క్యాంప్ కార్యాలయం నుండి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వరకు పాదయాత్రగా బయలుదేరారు.

మృత్తిక సంరక్షణపై అవగాహన

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రతి డిసెంబర్ 5న జరుపబడే ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా గురువారం మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లాలోని అన్ని రైతువేదికలలో మృత్తిక (నేల) సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. మానవాళికి ఆహారం అందించే నేలని సంరక్షించుకున్నట్లయితేనే భావితరాలకు ఆరోగ్యకరమైన ఉత్పత్తుల్ని అందించే వ్యవసాయాన్ని మనం చేయగలమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి చంద్రకళ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలు ప్రతి రైతు వేదికలో ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నిర్వహించబడును. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ శాఖ అందరు రైతు సోదరులను, ప్రజాప్రతినిధులను, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులను ఆహ్వానిస్తోంది. వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం మరియు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు కూడా ఇందులో పాల్గొంటారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారులు మట్టి నమూనాలు సేకరించే పద్ధతిని మరియు నేల ఆరోగ్య సూచికను ఎలా అర్థం చేసుకోవాలో వివరిస్తారు. అదేవిధంగా ఆయా క్లస్టర్లలో ఉన్న నేలల స్వభావాన్ని, వాటి యాజమాన్య పద్ధతుల్ని, తగిన పంటల సరళిని యాసంగి పంట సాగులో పాటించాల్సిన మెలకువల్ని తెలియజేస్తారు. ఈ కార్యక్రమంలో రైతు సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని మృత్తిక (నేల) సంరక్షణపై అవగాహన పొందాలని ఆమె కోరారు.

అయ్యప్ప పడి పూజలో కొలను శ్రీనివాస్‌రెడ్డి



విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: అయ్యప్ప స్వామి చల్లని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. 18 కలశాల మహా పడిపూజ కార్యక్రమం కూకట్ పల్లి వివేకానంద నగర్ కాలనీలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొలను శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సమేతంగా సతీమణి కార్పొరేటర్ కొలను తేజశ్రీ, కుమారులు తరుణ్ రెడ్డి, రిత్విక్ రెడ్డితో కలిసి ఈ మహా పడిపూజా పూజలు జరిపించారు. ఈ సందర్భంగా కొలను శ్రీనివాస్ రెడ్డి ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరారు. అనంతరం భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొంది, తీర్థప్రసాదాలు, అల్పాహారాలు స్వీకరించారు. ఈ మహా పడి పూజా మహోత్సవానికి కూకట్పల్లి, కుత్బుల్లాపూర్ ప్రాంతాల నుంచి అయ్యప్ప మాల ధార భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

6న అంబేద్కర్ జీవితం-ఆశయంపై స్మారకోపన్యాసం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 6న 'అంబేద్కర్ జీవితం- ఆశయం' అనే అంశంపై స్మారకోపన్యాసం నిర్వహిస్తున్నట్లు మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె.లింగయ్య, ప్రధాన కార్యదర్శి జి. జ్ఞానేశ్వర్లు తెలిపారు. బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 6న సాయంత్రం ఈ స్మారకోపన్యాసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు వెల్లడించారు.

ప్రజా పాలనలో పేదవాడి సొంతింటి కల సాకారం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాదు: తెలంగాణలో నిరుపేదలు ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న పేదవాడి సొంతింటి కల సాకారం కానుంది. బడుగు బలహీన వర్గాల మహిళలు ఆత్మ గౌరవంతో బతకాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో నీడలేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇండ్ల పథకం అమలుకు ఉన్న అవరోధాలను అధిగమిస్తూ అమలుకు అవసరమైన కార్యాచరణను వేగవంతం చేసిందని రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం, కాంగ్రెస్ అంటే ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్లకు కాంగ్రెస్ పేటెంట్. ఈ రోజు కూడా రాష్ట్రంలో ఏ గ్రామానికి పోయినా, ఏ తండాకు పోయినా, ఏమారుమూల ప్రాంతానికి పోయినా ఇందిరమ్మ ఇళ్ళే కనబడతాయి. ఈ ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలు ఒక వంతు అయితే, మేం కట్టించే ఇందిరమ్మ ఇళ్లు మరో వంతు. మేం గర్వంగా చెబుతున్నాం ప్రతి పేదవాడికి ఇల్లు కట్టించి ఇస్తామని చెబుతున్నాం. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండేలా ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా రాజకీయ ప్రమేయానికి తావు లేకుండా అర్హులైన వారిని ఎంపిక చేయడానికి వీలుగా మొబైల్ యాప్‌ను రూపొందించాం. ఈ యాప్‌ను ముఖ్యమంత్రి గురువారం ఆవిష్కరించనున్నారు. లబ్ధిదారుల ఆర్థిక, ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి స్వరూపం, కుటుంబ సభ్యుల వివరాలు, ఇంటి నిర్మాణానికి సంబంధించిన భూమి వివరాలు వంటి అంశాలు ఈ యాప్‌లో ప్రధానంగా ఉండనున్నాయి. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు వీలుగా ప్రతి గ్రామం, వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను ఏర్పాటు చేశామన్నారు.

ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు

దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఒక్కో ఇంటికి 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నాం. మహిళా పేరు మీద ఇండ్లు మంజూరు చేస్తున్నాం. ఈ ఇండ్లకు నాలుగు దశల్లో లబ్దిదారులకు చెల్లింపులు చేస్తాం. మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో జమ చేస్తాం. ఈ పథకం కింద నిర్మించే ఇండ్లు కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణం, వంటగది, టాయిలెట్ సౌకర్యాలను కలిగి ఉంటాయి. గత ప్రభుత్వంలో ఇండ్ల నిర్మాణానికి కాంట్రాక్ట్ వ్యవస్థ ఉండేదన్నారు. ఇప్పుడు ఆవ్యవస్థను రద్దు చేసి లబ్దిదారులే ఇళ్లు నిర్మించుకునేలా అవకాశం కల్పిస్తున్నామన్నారు. లబ్దిదారులు తమ సౌలభ్యాన్ని బట్టి 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఎంత విస్తీర్ణంలోనైనా నిర్మించుకోవచ్చు. రాష్ట్రంలోని ప్రతి మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణాలను చేపడతామ న్నారు. ఏన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వచ్చే నాలుగు సంవత్సరాలలో దశల వారీగా సుమారు 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించేందుకు ప్రభుత్వం పూనుకుందని పేర్కొన్నారు. మొదటి విడతలో భాగంగా ఈ ఏడాది నియోజకవర్గానికి 3500 నుంచి 4000 ఇండ్ల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల ఇండ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. మొదటి విడతలో నివాస స్థలం ఉన్నవారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, రెండో దశలో ప్రభుత్వమే నివాస స్థలంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించింది. వికలాంగులు ఒంటరి మహిళలు, అనాథలు, వితంతువులు, ట్రాన్స్ జెండర్లు, సఫాయి కర్మాచారులకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నామని చెప్పారు.

హౌసింగ్ శాఖ పునరుద్ధరణ

పేదలకు ఇండ్లు నిర్మించే హౌసింగ్ శాఖను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. ఆ విభాగాన్ని మూసివేసి ఉన్న ఉద్యోగులను ఇతర శాఖలలో విలీనం చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క అడుగు వేస్తూ ఈ శాఖను పునరుద్ధరించి లబ్దిదారుల ఎంపిక నుంచి ఇండ్ల నిర్మాణం, పర్యవేక్షణ వరకు అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకుంది. 296 మంది ఉద్యోగులను తిరిగి నియమించడం ద్వారా హౌసింగ్ కార్పొరేషన్‌ను బలోపేతం చేశామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆ నాటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో 2006-2007లో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించింది. తెలంగాణ ప్రాంతంలో 2006-2007 నుంచి 2014 వరకు 23,85,188 ఇండ్లను మంజూరు చేయగా 19,32,001 ఇండ్లను పూర్తి చేసింది. 4,53,187 ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉండగా బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని గాలికి వదిలేసిందన్నారు.

జలమండలి కార్మికుల సమస్యలు పరిష్కరించండి

డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకు ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు సంజీవరెడ్డి వినతి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జలమండలి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐ.ఎన్.టి.యు.సి జాతీయ అధ్యక్షులు జి. సంజీవరెడ్డి నేతృత్వంలో హైదరాబాద్ వాటర్ వర్క్స్, సీవరేజ్ కంగారు యూనియన్ అధ్యక్షులు, ఐ.ఎస్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి, ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్, యూనియన్ ప్రధాన కార్యదర్శి సి.హెచ్. సురేష్ బాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ బి.భూమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్, కె.రామరాజు తదితరులు హైదరాబాద్‌లో బుధవారం తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కను కలసి వినతిపత్రం అందజేశారు. వేతనాలు పెంచడం, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, హెల్త్ కార్డులు, ప్రమోషన్ చానల్ లేనటువంటి (క్యూ.ఏ.టీ) జె.టీ.ఓ. అప్గ్రేడేషన్ ఏ.టీ.ఓ ప్రమోషన్లు వంటి ప్రధాన సమస్యలను జి.సంజీవ రెడ్డి, మొగుళ్ళ రాజి రెడ్డి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారు. ఐ.ఎన్.టి.యు.సి అనేక పోరాటాల ఫలితంగా గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పెర్మనెంట్ చేసిందని గుర్తు చేసారు. త్వరలో జరగబోయే జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐ.ఎన్.టి.యు.సి అనుబంధ హైదరాబాద్ వాటర్ వర్క్స్, సీవరేజ్ కంగారు యూనియన్ పోటీ చేస్తుందని, ఐ.ఎన్.టి.యు.సి విజయ బావుటా ఎగరవేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జలమండలి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క స్పందిస్తూ జలమండలి కార్మికుల సమస్యలను వెంటనే ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మహిళా దివ్యాంగులకు అధిక ప్రాధాన్యత

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహిళ వికలాంగుల సాధికారత సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో బుధవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిధులుగా ఎమ్మెల్సీ కోదండరాం, రాష్ట్ర ప్రభుత్వ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాం కోదండరాం మాట్లాడుతూ ఉద్యమాల నుండి వచ్చిన వ్యక్తులు ప్రభుత్వంలో ఉంటే ప్రజలకి అనేక రకాలుగా మేలు జరుగుతుంది ఇవాళా వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య నీ చూస్తుంటే కూడా ఉద్యమ నాయకుల ప్రాధాన్యత అర్థం అవుతుంది అన్నారు. వీరయ్య వికలాంగుల అంశంపై గత 10 ఏండ్లు ఉద్యమాలు చేసి రావటం వల్ల కార్పొరేషన్‌లో అనేక మార్పులు చేయగలరని మాట్లాడుతున్నపుడు నాకు ప్రభుత్వం తీసుకుంటున్న పలు వికలాంగుల సంక్షేమ విషయాలపై అవగాహనకీ వచ్చిందన్నారు. నేను కూడా వికలాంగులకు సమాన అవకాశాలు రావడానికి కృషి చేస్తాను అని, అండగా ఉంటా అన్నారు.

వీరయ్య మాట్లాడుతూ మహిళా వికలాంగులకు అధిక ప్రాధాన్యత ఇస్తామని, రాష్ట్ర ప్రభుత్వ పరంగా మహిళలకు అందిస్తున్న అన్నీ పథకాల్లో 5 శాతం మహిళ వికలాంగులకు ప్రాధాన్యత 2016 వికలాంగుల చట్టం ప్రకారం వచ్చేలా కృషి చేస్తాను అన్నారు. 2014 నుండీ బిజేపి కేంద్రంలో ఉండి ఒక్క రూపాయి కూడా పెన్షన్ పెంచలేదని విమర్శించారు. ఇంకా రూ. 300 ఇస్తుందని దీనితో ఒక్క నూనే ప్యాకెట్ కూడా రాదని కేంద్ర మంత్రులు, బిజేపి ఎంపీలు, బిజేపికి గతంలో, ప్రస్తుత మద్దతు ఉన్న సంఘాలు బిజేపిపై కనీసం రూ. 3000 పెంచమని ఒత్తిడి చేయాలీ అన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈ అంశంపై సందించాలన్నారు. మేము పెన్షన్ ఖచ్చితంగా పెంచుతాం కానీ మీరూ ఈ రూ.300లను రూ.3000 చేయిస్తారా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థలు ప్రతినిదులు, వికలాంగుల సంఘాల నాయకులు అన్నారు.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అందే మోహన్

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణానికి చెందిన యువ నేతలు తమ సత్తా చాటారు. రాష్ట్రస్థాయిలో ప్రధాన కార్యదర్శిగా కాంగ్రెస్ పార్టీ యువ నేత అందేమోహన్ మరోసారి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గెలుపొందారు. 8695 ఓట్లతో ఆయన భారీ మేటితో గెలుపొందారు. అదేవిధంగా షాద్ నగర్ అసెంబ్లీ అధ్యక్షుడిగా పులిమామిడి రాజేష్ గౌడ్ 4710 ఓట్లతో గెలుపొందారు. పట్టణ అధ్యక్షుడిగా సాయి వంశీ 747 ఓట్లతో గెలుపొందారు. యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గెలుపొందిన అందేమోహన్ రాష్ట్రస్థాయిలో తన పట్టును సాధించుకున్నారు. షాద్ నగర్ పట్టణంలో బూత్ స్థాయి అధ్యక్షుడిగా సేవలందించిన అందేమోహన్ పట్టణ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. అదేవిధంగా రాష్ట్ర కార్యదర్శిగా, ఆ తర్వాత ప్రధాన కార్యదర్శిగా కూడా సేవలు అందించారు. ఇప్పుడు మరోసారి ప్రధాన కార్యదర్శిగా భారీ స్థాయిలో గెలుపొంది తన చరిష్మా చాటుకున్నారు. యువజన కాంగ్రెస్ విభాగంలో పెద్ద ఎత్తున సేవలందించిన అందేమోహన్‌కు మంచి పేరుంది. ఇక పులిమామిడి రాజేష్ గౌడ్, సాయి వంశీతో పాటు జిల్లా కార్యదర్శిలు, నియోజకవర్గ ఉపాధ్యక్షులు గెలుపొందారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి అందేమోహన్ భారీ ర్యాలీగా వచ్చి పట్టణ ముఖ్య కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

యువజన కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో బాణా సంచాలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

15న జనరల్ బాడీ సమావేశం

విశాలాంధ్ర-దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపల్ పరిధి అపర్ణ పాల్మ్ గ్రో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ 2024 సంవత్సరపు జనరల్ బాడీ మీటింగ్ డిసెంబర్ 15 ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. కావున ప్లాట్ ఓనర్లు, కాలనీ వాసులు ప్రతి ఒక్కరు పాల్గొని సమస్యలపై చరించాల్సిందిగా అపర్ణ పాల్మ్ గ్రో ప్రెసిడెంట్ సంగీత రెడ్డి, కమిటీ సభ్యులు కోరుతున్నారు.

ప్రజా పాలన కాదు... రాక్షస పాలన : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దుండిగల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో నడుస్తోంది ప్రజా పాలన కాదు, రాక్షస పాలనా అని ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు పేర్కొన్నారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి గండి మైసమ్మ మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మల్కాజ్ గిరి బిఆర్ఎస్ పార్లమెంట్ ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావుపై కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులపై ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయ్యింది. ఈ సంవత్సర కాలంలో 420 అబద్ధపు హామీలు, ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామన్నారు. కానీ ఏడాది పూర్తయ్యినా ఇచ్చిన 420 హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయమని ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా మాజీ మంత్రి హరీశ్‌రావుపై కేసులు నమోదు చేయడం సరికాదని, ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు అవతలి వ్యక్తి ఎవరూ, వారి చరిత్ర ఏంటి, విశ్వసనీయత ఏంటీ అని పోలీసులు ఆలోచించాలి. చక్రదర్‌గౌడ్ అనే చీటర్ వెళ్లి కేసు పెడితే ఎలాంటి ఆధారాలు లేకున్నా హరీశ్‌రావు లాంటి వ్యక్తిపై కేసు నమోదు చేస్తారాని ప్రశ్నించారు. మేము కూడా కేసులు పెడతాం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారా. కొడంగల్ నియోజకవర్గంలోని కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి తన చావుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులే కారణం అని నోట్ రాసిపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. కానీ పోలీసులు ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను బుల్డోజర్లు ఎక్కిస్తాం అని అంటున్నా పోలీసులు కేసులు నమోదు చేయడం లేదు.రైతు రుణమాఫీ, రైతుబంధు, వృద్ధులకు, వికలాంగులు పింఛన్, మహిళలు 2500, కేసీఆర్ కిట్లు, నిరుద్యోగులకు భృతి, 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. అవన్నీ ఎందుకు ఇవ్వడం లేదని మాజీ మంత్రి హరీశ్ ప్రశ్నిస్తే వాటికి సమాధానం చెప్పలేక, తప్పుడు కేసులు పెడుతున్నారు. తక్షణమే మాజీ మంత్రి హరీశ్ రావుపై పెట్టిన బూటకపు కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

రుణాల మంజూరుపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

విశాలాంధ్ర - పటాన్ చెరువు : ఇందిరా మహిళా శక్తి సంఘాలకు, ఎస్సీ, ఎస్టీ , బీసీ కార్పొరేషన్లకు బ్యాంకు లింకేజ్ రుణాలు పెండింగ్ పెట్టకుండా మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్సీ కార్పొరేషన్, ఎస్టీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ - ఇందిరా క్రాంతి వంటి ప్రాధాన్యత గల పథకాల కింద రుణాలను శీఘ్రంగా అందించాలని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి సంఘాల ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ మహిళలను కోటీశ్వరులను చేయాలనే ప్రభుత్వ సంకల్పానికి బ్యాంకులు సహకారాలు అందించాలని అన్నారు. సామాజిక, ఆర్థిక స్థిరత్వం సాధించడంలో మహిళల పాత్రను పెంపొందించేందుకు రుణాలు అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. రుణాలను ఇచ్చే ప్రక్రియలో పారదర్శకత, వేగం అవసరమని కలెక్టర్ స్పష్టం చేశారు. బ్యాంకులు, రుణగ్రహీతల మధ్య సమన్వయానికి ప్రాధాన్యం ఇచ్చి, అవసరమైన చోట ప్రభుత్వ యంత్రాంగం జోక్యం చేసుకోవాలని సూచించారు. రుణాల మంజూరులో సమస్యలు ఎదురవుతున్న చోట వాటిని వెంటనే పరిష్కరించాల్సిన బాధ్యత బ్యాంకులదేనని ఆమె పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాల ద్వారా సామాజిక ప్రయోజనాలను సాధించడానికి బ్యాంకుల సహకారం కీలకమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్‌బీఐ మేనేజర్ తాన్య, నాబార్డ్ డిడిఎం కృష్ణ తేజ, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ గోపాల్ రెడ్డి, జానకి రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంత కుమారి, పిడీ మెప్మా గీత, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ రామాచారి, ఇతర బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై వినతుల స్వీకరణ

విశాలాంధ్ర - పటాన్ చెరువు : సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణపై విచారణ జరపడానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ సమీమ్ అక్తర్ బుధవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్లో ఎస్సీ కుల సంఘాల నుండి వినతులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఏక సభ్య కమిషన్ చైర్మన్ కుస్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వివిధ కుల సంఘాల నాయకులు స్వచ్ఛంద సంస్థల నుండి ఏక సభ్య కమిషన్ చైర్మన్ వినతులు స్వీకరించారు. జస్టిస్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ, ఎస్సీ కుల సంఘాల నుండి 212 వినతులు అందాయని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి న్యాయపరమైన అంశాలు, సామాజిక పరిస్థితులు, చరిత్రాత్మక వ్యవహారాలను అధ్యయనం చేయడం కోసం కమిషన్ ఏర్పాటయ్యిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేక అధ్యయనం కోసం ప్రతిపాదనలు, వినతులు కీలకమైనదని తెలిపారు. సమాజంలోని అన్ని ఎస్సి వర్గాల అభిప్రాయాలు పరిశీలించి, తగిన నివేదిక సిద్ధం చేస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి కుల సంఘాల అభ్యర్థనలు సేకరించి, రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి నివేదిక సమర్పిస్తామని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేక అధ్యయనం కోసం ప్రతిపాదనలు, వినతులు కీలకమైనదని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల అభిప్రాయాలు పరిశీలించి, తగిన నివేదిక సిద్ధం చేస్తామన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎస్సీ కుల సంఘాల నాయకులు అధిక సంఖ్యలో బహిరంగ విచారణకు హాజరై తమ తమ వినతులను కమిషన్‌కు అందించారు. వర్గీకరణ విషయంలో నిర్ణయాలు సమర్థవంతంగా తీసుకుంటే ఎస్సీ వర్గాలకు మరింత సంక్షేమం చేకూరుతుందని హాజరైన వివిధ సంఘాలు నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం కంది మండలకేంద్రంలోని ఎస్సి కాలనీని సందర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ అదనపు సంచాలకులు శ్రీధర్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, సంబంధిత అధికారులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జల పర్యాటకం, సాహస క్రీడలకు ప్రాధాన్యం

హుస్సేన్‌సాగర్‌లో వాటర్ స్పోర్ట్స్‌ను ప్రారంభించిన మంత్రి జూపల్లి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు జల పర్యాటకం, సాహస క్రీడలకు సరికొత్త రూపు సంతరించుకునే దిశగా సీయం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జల పర్యాటకం అభివృద్ధిలో భాగంగా హుస్సేన్ సాగర్‌లో అమరావతి బోటింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ స్పోర్ట్స్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం టీజీటీడీసీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డితో కలిసి మంత్రి జూపల్లి జెట్ స్కి పై హుస్సేన్ సాగర్‌లో కాసేపు విహరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలోని అందమైన పర్యాటక ప్రాంతాలు, పురాతన, చారిత్రాత్మక ప్రాంతాలతో పాటు టెంపుల్ టూరిజం, జల, సాహస క్రీడల టూరిజానికి అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. ఇటీవలి కాలంలో వాటర్ స్పోర్ట్స్ విపరీతమైన ప్రజాదరణ పొందుతున్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో జల పర్యాటకాన్ని ప్రోత్సహించడంతోపాటు జల విహార అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నీటివనరులను పరిశీలించి పర్యాటక అభివృద్ధికి అనుకూలమైన ప్రాంతాలను గుర్తించే పని ఉన్నామని చెప్పారు. అంతర్జాతీయ ప్రాముఖ్యత వచ్చేలా కృష్ణా నది పరిహాక ప్రాంతంలోని సోమశిల బ్యాక్ వాటర్స్, నాగర్జున సాగర్, ఇతర రిజర్వాయర్లు, హైదరాబాద్ లోని హుస్సేన్ సాగర్, తదితర ప్రాంతాలను తీర్చిదిద్దితే రాష్ట్రంలో జల పర్యాటక రంగం గణనీయంగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. పర్యాటక అభివృద్ధి వల్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు రాష్ట్ర ఆదాయం పెరుగుతుందని తెలిపారు. హుస్సేన్ సాగర్‌ను మంచి నీటి సరస్సుగా మారుస్తామని గత పాలకులు ప్రగాల్భాలు పలికారని, కానీ అవి నీటిమూటలుగానే మారాయని అన్నారు. హుస్సేన్ సాగర్‌ను నీటిని శుద్ధి చేసి పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. పర్యాటక రంగాన్ని కూడా గత పదేళ్లలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. సీయం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ రూపొందించి, దాని అమలు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. చాలా చోట్ల ప్రభుత్వ స్థలాలు, ఆస్తులు నిరర్థకంగా ఉన్నాయని వాటిని ఉపయోగంలోకి తెచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యంతో పర్యాటక రంగం అభివృద్ధికి కృషి చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వానికి వ్యాపారత్మక ధోరణి లేదని, నిరుపయోగంగా ఉన్న వాటిని పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పీపీపీ మోడల్‌లో మౌలిక వసతుల కల్పిస్తామని అన్నారు. హుస్సేన్‌సాగర్‌లో పెద్దలు, పిల్లలు కలిసి వాటర్ స్పోర్ట్స్ ఎంజాయ్ చేసే విధంగా జెట్ స్కి, కయక్, జెట్ అటాక్, వాటర్ రోలర్ (జాబింగ్)ను పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చినట్లు నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మెనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో తరుణ్ కాకాని పాల్గొన్నారు.

6వ డివిజన్‌లో మేయర్ పర్యటన

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్‌లో మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్లు బుధవారం పర్యటించారు. కాలనీలో ఉన్న సమస్యల గురించి కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో కాలనీలోని సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులుకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భీమ్‌రెడ్డి నవీన్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, సీనియర్ నాయకులు మాదుగుల చంద్రారెడ్డి, పప్పుల అంజిరెడ్డి, వంగూరి పరమేష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అంజమ్మ మృతి కాలనీ వాసులకు తీరనిలోటు

జవహర్‌నగర్ - విశాలాంధ్ర: జవహర్ నగర్ మున్సిపల్ కార్పోరేషన్ సిపిఎం సీనియర్ నాయకులు దావత్ నాగేష్ సతీమణి అంజమ్మ మృతికి పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన నేతలు సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాలాజీనగర్, జ్యోతి కాలనీలోని తన నివాసంలో గత ఆరు సంవత్సరాలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. అంజమ్మ మరణవార్త తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డిజీ. నర్సింగరావు, కోమటి రవి, జి. శ్రీనివాస్ పార్టీ మేడ్చల్ జిల్లా నాయకులు, టి.రాంచందర్ ప్రజానాట్యమండలి, ఐద్వా మాదవి, విజయక్క, సిఐటియు శివన్నారాయణ, సిపిఐ దశరథ, దర్శనం యాదగిరి, బీఎస్పీ బిర్రు యాకస్వామి, టిడిపి చెన్నాపురం యాదగిరి తధితరులు పార్థివదేహాన్ని సందర్శించి, పూలమాలలతో నివాళులు అర్పించి, అంజమ్మకు బుదవారం విప్లవ జోహార్లు తెలియజేశారు. సిపిఎం రాజకీయ విశ్వాసాలకు, వారి ఆచరణకు అండగా నిలిచిన అంజమ్మ మరణం తమ పార్టీకే గాక, జ్యోతి కాలనీ వాసులకు కూడ తీరనిలోటు అని ఆ పార్టీకి చెందిన రాష్ట్ర, జిల్లా నాయకత్వం గుర్తుచేశారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలు

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం కమ్మదనం గ్రామ శివారులో ఉన్న అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటిన రేంజర్ వెంకటయ్య గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్, గురుకుల పాఠశాల విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. హెచ్‌ఎండిఏ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు రేంజర్ తెలిపారు. త్వరలోనే కమ్మదనం అటవీ ప్రాంతంలో ఉదయం వాకింగ్‌కు చేసేందుకు ప్రజలకు అవకాశం కల్పించనున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆజిస్, నాయకులు కృష్ణ రెడ్డి, బల్ రాజ్ గౌడ్, ఎండి. ఇబ్రహీం, మాజీ జెడ్పిటిసి, మాజీ సర్పంచు, అటవీ శాఖ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, నిరుపేదల ఆర్థిక ఎదుగుదల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని కో-ఆర్డినేటర్ ఇంచార్జి పన్యాల శ్రవణ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవాల సంబరాలలో భాగంగా 132 డివిజన్ జీడిమెట్ల పరిధిలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన విజయోత్సవాల సంబరాల కార్యక్రమానికి కో-ఆర్డినేటర్ ఇంచార్జి డా. పన్యాల శ్రవణ్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతు గడిచిన సంవత్సర కాలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన ఆరు గ్యారెంటీలలోని రైతుభరోసా, మహిళ ఉచిత బస్సు, గృహజ్యోతి వంటివి ప్రజలలోకి తీసుకెళ్లి రానున్న కాలంలో మహాలక్ష్మి వంటి మిగితా గ్యారెంటిలాలను కుడా అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు బేకు శ్రీనివాస్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు రంగయ్య, మధుసూదన్ రెడ్డి, నర్సింగ్ రావు, సతీష్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు బేకు పవని, సుజాత యాదవ్, లక్ష్మి, నాగమణి, భవాని, లక్ష్మి యాదవ్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు భయాందోళన చెందొవద్దు : కలెక్టర్

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : సమ్మక్క సారలమ్మ దీవెనలతోనే బుధవారం ఉదయం సంభవించిన భూకంపంతో జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరగలేదని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్ అన్నారు. బుధవారం సాయంకాలం తాడ్వాయి మండలం లోని మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ తల్లులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. దర్శించుకున్నారు. అనంతరం మేడారంలోని అమ్మవార్ల పూజారులతో ప్రత్యేక సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 4న దట్టమైన అటవీ ప్రాంతంలో టోర్నోడు కారణంగా వేలాది చెట్లు నేలమట్ట కావడానికి బుధవారం ఉదయం జరిగిన భూకంపానికి ఇలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. భూమిలో జరిగిన కొన్ని చర్యల వలన భూకంపం వస్తుందని, భూమిపైన జరిగిన కొన్ని చర్యల వలన చెట్లు కూలిపోతాయని తెలిపారు. రెండు సంఘటనలు ములుగు జిల్లాలోని జరగడంతో జిల్లా ప్రజల ఆందోళన చెందుతున్నారని ఇలాంటి సంఘటన జరగడం సహజమని అన్నారు. బుధవారం ఉదయం 7 గంటల 27 నిమిషాల సమయంలో 6 సెకండ్ల నుండి 8 సెకండ్ల మధ్యన భూకంపం సంభవించిందని దీంతో జిల్లాలో జరిగిన నష్ట వివరాలను తెలుసుకోవడం కోసం అన్ని శాఖల అధికారుల అప్రమత్తం చేయడంతో పాటు పూర్తి వివరాలను తీసుకోవడం జరిగిందని, ఒకచోట పాక్షికంగా ఇల్లు దెబ్బ తిన్నట్లు అధికారులు వివరించారని తెలిపారు. ఈరోజు ఉదయం జరిగిన సంఘటనతో తాను సైతం తన ఇంటి నుండి బయటకు వచ్చానని, ఇలాంటి సంఘటన జరిగిన సమయంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అధికారులకు తెలియజేయాలని అన్నారు. కలెక్టర్ వెంట మేడారం ఈవో రాజేందర్, అమ్మవార్ల పూజారులు పాల్గొన్నారు.

సయ్యద్ ఒమర్ అలీ అక్రమాలపై విచారణ జరిపించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారి ఉద్యోగులను అధికారులను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్న ఎక్సైజ్ ఆఫీస్ సూపరింటెండెంట్ సయ్యద్ ఒమర్ అలీ అక్రమాలపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుదవారం నాంపల్లిలోని ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో ఒమర్ అలీ అక్రమాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. అనంతరం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుర్చీ వదలకుండా 20 ఏళ్లకు పైగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్నాడన్నారు. ఈ విషయంపై తాము ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తే ప్రభు వినయ్‌ను ఈమధ్యనే సస్పెండ్ చేశారని, కారకుడైన ఒమర్ అలిపై మాత్రం ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. ఒమర్ అలీ తనకున్న అధికారాన్ని అడ్డం పెట్టుకొని అధికారులను, ఉద్యోగులను బ్లాక్ మెయిల్ చేసి దాదాపు వందల కోట్లు సంపాదించినట్లు అతడిపై ఆరోపణలున్నాయన్నారు. ఆయన అక్రమ ఆస్తులపై ఎసిబికి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేసి నిజాయితీ గల ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో బిసి పొలిటికల్ జెఎసి సలహాదారు బడేసాబ్, బిసి విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మూర్తి గౌడ్, గాలిగల్ల సాయిబాబా, రఘురాం గౌడ్, వెంకట్, వెంకన్న, మహేష్ పాల్గొన్నారు.

శబరిమల యాత్రకు బయలుదేరిన కొలను

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: నియోజకవర్గం పరిధి నిజాంపేట్ మున్సిపాల్ కార్పొరేషన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి (గురుస్వామి) అయ్యప్ప స్వామి వారి మండల దీక్షను పూర్తిచేసుకుని బుధవారం అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో గణపతి హెూమం నిర్వహించి సన్నిధానం స్వాములతో కలిసి శబరి యాత్రకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి, ఎన్ ఎం సి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు రూ.18 వేల వేతనం చెల్లించాలి

సీఐటీయు జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్

విశాలాంధ్ర -జిల్లా బ్యూరో మహబూబాబాద్: ఆశా వర్కర్లకు 18 వేల ఫిక్స్ వేతనం చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ తెలిపారు. బుధవారం (సి ఐ టి యు)ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ ముందు ధర్నా నిర్వహించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి పాలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయి డబ్బులు చెల్లించాలని, ఫిక్స్ వేతనం, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2022 నుండి లెప్రసీ సర్వే, పల్స్ పోలియో కార్యక్రమాల డబ్బులు నేటికీ ఆశాలకు చెల్లించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.సంవత్సరాల తరబడి చేసిన పనికి డబ్బులు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వ మోసం చేస్తూ ఇప్పుడు మళ్లీ కొత్తగా లెప్రసీ సర్వే చేయాలని అధికారులు ఆశాలపై ఒత్తిడి చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. కష్టమేమో బారెడు జీతమేమో మూరెడు అన్న చందంగా ఉందని ఇప్పటికైనా అధికారులు పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, పల్స్ పోలియో డబ్బులు వెంటనే చెల్లించాలని లేకపోతే సర్వేలు చేయమని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు సమ్మెట రాజమౌళి, కుమ్మరికుంట్ల నాగన్న, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి వడ్లకొండ ఉపేంద్ర, సుజిత, ఆసియా, సునీత, కాళేశ్వరి, నిర్మల, స్వరూప, చంద్రకళ, నళిని, సవిత, విజయ, జ్యోతి, రమాదేవి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

మహిళల పరువు హత్యలు, హత్యాచారాలపై పోరాడాలి

విశాలాంధ్ర - వనపర్తి : రాష్ట్రంలో పరువు హత్యలు, హత్యాచారాలపై పోరాడాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణవేణి, గీత, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు పి కళావతమ్మ పిలుపునిచ్చారు. బుధవారం వనపర్తి ఆఫీస్‌లో ఎన్ఎఫ్ఐ డబ్ల్యు ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ బాల మల్లేష్ మృతి సందర్భంగా సంతాప సమావేశం నిర్వహించారు. బాల మల్లేష్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం పరిధిలోని రాయపూర్‌లో పోలీస్ కానిస్టేబుల్ కొంగర నాగమణి కులాంతర వివాహం చేసుకుందని పరువు పేరుతో సొంత తమ్ముడు హత్య చేయటం దుర్మార్గమని ఖండించారు. కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కులాంత వివాహం చేసుకున్న కూతుళ్లను కుటుంబ సభ్యులు దారుణంగా చంపేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు బాలికలపై హత్యలు అత్యాచారాలు పెరిగిపోయాయని కేసులు నమోదవుతున్న శిక్షలు మాత్రం పడటం లేదన్నారు. అందువల్లనే మహిళలపై నేరాలు తగ్గటం లేదన్నారు. నేరస్తులకు శిక్షలు పడేవిధంగా పోలీసులు కృషి చేయాలన్నారు. కుటుంబంలో ఆడపిల్లల పట్ల వివక్ష పోవాలన్నారు. వారి ఎదగటానికి అవకాశాలు కల్పించాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. ఎన్ఎఫ్ఐ డబ్ల్యు పట్టణ కన్వీనర్ జయమ్మ, కో కన్వీనర్లు భూమిక, శిరీష సిపిఐ నాయకులు రమేష్, శ్రీరామ్, గోపాలకృష్ణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పెన్షనర్ల సదస్సును జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఖమ్మం : ఈనెల ఎనిమిదిన ఖమ్మంలో నిర్వహించే పెన్షనర్ల సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం (ఎస్ జిపిఏటి) ఖమ్మం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పరిషత్ - సమావేశ మందిరంలో ఎస్ జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ పుల్లయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్దారుల సంఘం (ఎస్ జిపిఏటి) ఆధ్వర్యంలో ఈనెల ఎనిమిదిన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పెన్షనర్ల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సదస్సులో ప్రధాన వక్తగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు అర్విణి రాజేంద్రబాబు వక్తలుగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవి నర్సింహారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. రాంమోహన్‌లు హాజరవుతారని పుల్లయ్య తెలిపారు. ఈ సదస్సులో పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్దారులందరూ ఈ సదస్సుకు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కన్నెకంటి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు పెదమాళ్ళ సత్యనారాయణ, గుబ్బల వెంకటేశ్వరరావు, ఎండి అబ్దుల్ జబ్బార్, రాయల రవికుమార్, పమిడిమర్రి వీరభద్రరావు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

విశాలాంధ్ర - కాప్రా : పెండింగ్లో ఉన్న పనులను మంజూరు చేయించి పనులను ప్రారంభించాలని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి బుధవారం మున్సిపల్ అధికారులు డిఈ రూప, ఏఈ స్రవంతి లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మల్లాపూర్ ఓల్డ్ విలేజ్, వివిధ కాలనీలలో సిసి రోడ్డు పనుల మంజూరు చేయించి పనులు త్వరగా ప్రారంభించాలని, మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరస్తా థీమ్ పార్కులో పెండింగ్ పనులకు నిధులు మంజూరుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎలిఫెంట్ చౌరస్తా అభివృద్ధి కోసం తగు చర్యలు తీసుకోవాలని నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్ కావడంవల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ట్రాఫిక్ జామ్ కావడం వల్ల గంటలకు రోడ్డుపై వేచి ఉండాల్సి వస్తుందని వెంటనే ఎలిఫెంట్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

విశాలాంధ్ర - వనపర్తి : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ముందుగా సూపర్ వైజర్లు తిన్న తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ రేవల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలతో పాటు, తల్పునూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రంను ఆకస్మికంగా సందర్శించారు. కేజీబీవీలో వంట సామాగ్రిని భద్రపరిచిన గదిని తనిఖీ చేసిన కలెక్టర్ రిజిస్టర్లను పరిశీలించారు. స్టాక్ వచ్చినప్పుడు రిజిస్టర్‌లో ఎంట్రీ చేయాలని చెప్పారు. విద్యార్థుల సమక్షంలోనే స్టాక్‌ను దించుకోవాలని సూచించారు. వంట సామాగ్రికి సంబంధించిన వస్తువులు ఎక్స్పైరి డేట్ తప్పనిసరిగా చెక్ చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం ముందుగా సూపర్ వైజర్లు తిన్న తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని సూచించారు. ఒకవేళ ఆహారం రుచికరంగా లేకపోతే తిరిగి మళ్ళీ వండి విద్యార్థులకు వడ్డించాలని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. తల్పునూరు జెడ్పి పాఠశాలలో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా తలుపులు, కిటికీలు, గేట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ను ఆదేశించారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. జెడ్పి సీఈవో యాదయ్య, డిపిఆర్ఓ సీతారాం, రేవల్లి తహసిల్దార్ లక్ష్మీదేవి, ఎంపీడీవో నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు సిబ్బంది ఉన్నారు.

7న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : ఈనెల 7న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లాలో పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్స వాలు, శంకుస్థాపనల నిమిత్తం రానున్నందున రాష్ట్ర ముఖ్యమంత్రి రాక సందర్భంగా అవసరమైన అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రాక ఏర్పాట్ల విషయమై ముందుగా ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని తన చాంబర్లో సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్, రెవిన్యూ, పోలీస్, ఇరిగేషన్, తదితర అధికారులతో సమావేశం నిర్వహించి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరయ్యే ప్రదేశాలు, అక్కడ చేయవలసిన ఏర్పాట్లు, పోలీస్ బందోబస్తు, తదితరు అంశాలపై చర్చించారు. తర్వాత నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాలకు వెళ్లి వైద్య కళాశాల ప్రారంభానికి కావలసిన ఏర్పాట్లు, విద్యార్థులతో ముఖ్యమంత్రి ముఖాముఖి, వైట్ కోట్ వేరింగ్ సెర్మనీ ఏర్పాట్లపై తగు సూచనలు జారీ చేశారు. మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు, రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి,ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈనెల 7న జిల్లాకు రానున్నారని తెలిపారు. ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రి బ్రాహ్మణ వెల్లేముల ఉదయ సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కింద బ్రాహ్మణ వెల్లెముల డెలివరీ చానల్స్ ప్రారంభిస్తారని తెలిపారు. సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్, అదనపు జెసి.శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, ఇరిగేషన్ సిఈ అజయ్ కుమార్, ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, ఇరిగేషన్ అధికారులు, నల్గొండ ఆర్డీవో అశోక్ రెడ్డి, డిఎస్పి శివరాం రెడ్డి, రెవెన్యూ, పోలీస్ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ముఖ్యమంత్రి, మంత్రుల చిత్ర పటాలకు పాలాభిషేకం

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ఏటూరు నాగారంకు బస్సు డిపో మంజూరు చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర పంచాయతీ రాజ్, మంచినీటి సరఫరా గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కు, చిత్రపాఠాలకు, కాంగ్రెస్ పార్టీ ఏటూరు నాగారం మండల కమిటి ఆధ్వర్యంలో బుధవారం చిత్ర పాఠాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షులు రఘు మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాల నుండి, ఏటూరు నాగారం బస్సు డిపో కోసం, ఏజెన్సీ ప్రజలు ఎదిరి చూసారని, కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం రావటంతో, కొన్ని ఏళ్ళ కళ, ఏటూరునాగారం బస్సు డిపో, మంజూరు చేస్తూ, ఉత్తర్వులు జారీ కావటంతో ప్రజలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ డిపో ఏర్పాటుతో మూడు రాష్ట్ర ప్రజల కష్టాలు తొలిగి పోతాయన్నారు. మండల, గ్రామ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకురాలు, మాజీ ప్రజాప్రతినిధులు,అన్ని అనుబంధ సంఘాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : అయ్యప్ప దీక్ష స్వాములు అయ్యప్ప స్వామికి పడి పూజ చేయడం ఆనవాయతీ. ప్రతి స్వామి శబరిమలై శ్రీ అయ్యప్ప స్వామి దర్శనానికి ముందు పడిపూజ నిర్వహించి ఘనంగా స్వామి వారికి పూజ చేసి, శబరిమలైకు వెళ్లి స్వామి దర్శనం చేసుకోవడం వారి అనుగ్రహ కృపకి పాత్రులుగా కావాలని చిరకాల కోరిక. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్ గూడా డివిజన్, వెంకటగిరికి చెందిన సీనియర్ నాయకులు అప్పల సురేంద్ర యాదవ్ వారి పుత్రులు అప్పల సాయి అమోఘ యాదవ్ శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఉన్న శ్రీ అయ్యప్ప స్వామికి బుధవారం పడిపూజ నిర్వహించారు. భజన, కీర్తనలు, అల్పాహార ప్రసాదము స్వాములకు అందించారు. సురేంద్ర యాదవ్, శ్రీశైలం యాదవ్ ప్రతి సంవత్సరం అయ్యప్ప స్వామి పడి పూజ చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ కార్యక్రమంలో వేణు స్వామి, వినోద్ కుమార్ స్వామి, రామాంజనేయులు స్వామి, సంతోష్ శర్మ స్వామి మొదలైన వారు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-ఆలూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపుదలను ఖండిస్తూ బుధవారం మొలగవల్లి స్వగృహంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణ చట్టాలను అప్పటి ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు నాయుడు వ్యతిరేకించారని, నేడు అధికారానికి వచ్చిన ఆరు మాసాల్లోనే అదే విద్యుత్ చట్టాన్ని అమలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ చర్య రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేయడమేనని విమర్శించారు. గత ప్రభుత్వం కంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విద్యుత్ భారాలను శర వేగంగా రాష్ట్ర ప్రజలపై మోపుతోందన్నారు. ఇది కేవలం కార్పొరేట్

విధానాలను పెంచి పోషించడమేనని తెలిపారు. అదానీ అక్రమాలు ప్రపంచంలో వెలుగుచూసినప్పటి నుంచి మన రాష్ట్రంలో చంద్రబాబు, జగన్, పవన్ కవచంలా నిలిచారని, ఇది రాష్ట్ర ప్రజలకు నమ్మకద్రోహం తలపెట్టినట్లేనని ఆయన విమర్శించారు. వెంటనే రూ.17 వేల కోట్ల ట్రూ అప్ చార్జీల భారాన్ని రద్దు చేయాలని, ఆ భారాన్ని ప్రభుత్వమే భరించాలని, ట్రూ ఆఫ్ విధానాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలని, టీడీపీ కూటమి ఎన్నికల వాగ్దానాన్ని అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సవరణ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించి, పెట్టిన మీటర్లు తొలగించాలన్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహిస్తామని రామకృష్ణ చెప్పారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు 200 నుంచి 350 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సెకీతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని, ఆర్థిక నేరానికి పాల్పడిన అదానీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, రైతు సంఘం మండల కార్యదర్శి గోపాల్, ఎర్రి స్వామి, మాజీ సర్పంచ్ రంగస్వామి, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుల గణనతోనే సమన్యాయం

'ఆలిండియా ఫెడరేషన్ ఫర్ సోషల్ జస్టిస్' సదస్సులో రాజా

న్యూఢిల్లీ: కుల గణన జరిగినప్పుడే సమ న్యాయం సాధ్యమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా నొక్కిచెప్పారు. ఆలిండియా ఫెడరేషన్ ఫర్ సోషల్ జస్టిస్ మూడవ జాతీయ సదస్సులో 'కుల గణన, మహిళల హక్కులు, రిజర్వేషన్లు: సామాజిక న్యాయానికి స్తంభాలు' అంశంపై ఆయన ప్రసంగించారు. సామాజిక న్యాయం జరగాలంటే కుల గణన తప్పనిసరి అని ఆయనన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించి కాషాయ పార్టీ కాలయాపనను దుయ్యబట్టారు. కేంద్రప్రభుత్వ శాఖల్లో ఓబీసీలకు రిజర్వేషన్ల అమలులో జాప్యాన్ని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని అధికరణ 340 సామాజిక న్యాయానికి హామీనిస్తుందని చెప్పారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల ద్వారానే న్యాయం జరగగలదని రాజా అన్నారు. సదస్సులో డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా, తేజస్వీ యాదవ్ (ఆర్జేడీ), బృందా కారత్ (సీపీఎం)తో పాటు అనేక మంది జాతీయ నాయకులు, ప్రముఖ విద్యావేత్తలు, మేధావులు ప్రసంగించారు.

కనీస వేతనం రూ.26 వేలు

స్కీమ్ కార్మికుల సమస్యలపై కేంద్ర విద్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శులకు వినతి

విశాలాంధ్ర-విజయవాడ: ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువచేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన మహిళా కార్మికులకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని స్కీమ్ కార్మికుల రాష్ట్ర ప్రతినిధుల సంఘం (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. ఢిల్లీలోని ఏఐటీయూసీ కేంద్ర కార్యాలయంలో స్కీమ్ కార్మికుల జాతీయ సమావేశం బుధవారం జరిగింది. సంఘ నాయకులు వహీదా, మాధురి, శ్యామ్ కాలే, ఎం.రమేష్ బాబు, జయమ్మ ... స్కీమ్ కార్మికుల సమస్యలపై జాతీయ విద్య వైద్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శులకు వినతిపత్రం అందజేశారు. దేశవ్యాప్తంగా దాదాపు 50 లక్షల మంది పనిచేస్తున్నారని సంఘ నేతలు వివరించారు. 40 ఏళ్లుగా గౌరవ వేతనంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రాట్యుటీ రూ.ఐదు లక్షలు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. విద్యార్థి మెస్ చార్జీలు పెంచాలన్నారు. పింఛన్, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో స్కీమ్ కార్మికుల సమస్యలపై చర్చించాలని కోరారు. జాతీయస్థాయిలో భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. అనంతరం ఎంపీ సెల్వరాజన్తో కలిసి 11 డిమాండ్లను పరిష్కరించాలని శాస్త్రి భవన్లో జాతీయ విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్కి వినతి పత్రం అందించారు. స్పందించిన ఆయన వివిధ శాఖల అధికారులు, ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రతినిధుల సంఘం నాయకులు సరోజమ్మ, జులేఖ (ఆంధ్రప్రదేశ్), జ్యోతి (మహారాష్ట్ర), హోనప్ప (కర్నాటక), నసిం భాను(చండీగఢ్), సునీత(గోవా)పాల్గొన్నారు.

అదానీతో విద్యుత్ ఒప్పందం రద్దు

సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్కు షర్మిల లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో అదానీ గ్రూప్ కంపెనీతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని రద్దు చేయాలని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్కు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల లేఖ రాశారు. అదానీ వద్ద జగన్ రూ.1,750 కోట్ల ముడుపుల వ్యవహారంపై ఏసీబీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్లో బుధవారం ఆమె విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆగస్టు 2021లో అదానీ, ఏపీ రాష్ట్ర డిస్కమ్ల మధ్య విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు జరిగాయని, అదానీ ద్వారా అప్పటి సీఎం జగన్కు రూ.1,750 కోట్లు ముడుపులు అందాయని అమెరికా దర్యాప్తు సంస్థ నిర్ధారించిందన్నారు ఈ ఒప్పందాల వల్ల గత ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై వేల కోట్ల భారం మోపిందని లేఖలో వివరించారు. యూనిట్కు రూ.2.49 చొప్పున ఏడువేల మెగావాట్ల సౌర విద్యుత్ సరఫరా చేయాలని సంతకం చేశారని, సెప్టెంబరు 2024 నుంచి 25 సంవత్సరాల కాలానికి వసూళ్లు చేసేలా ఒప్పంద సంతకం చేశారని వెల్లడించారు. 25 ఏళ్ల కాలానికి ఒప్పందాలు సహేతుకం కాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కోలుకోలేని నష్టమైతే, ఆ భారం చివరికి ప్రజలపై పడుతుందని లేఖలో వివరించారు. అదానీతో చేసిన ఒప్పందం రద్దు చేయడానికి చంద్రబాబు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలైందని, సూపర్ సిక్స్ ఎక్కడ అని నిలదీశారు. రైతుకి రూ.20 వేల ఆర్థిక సహాయం ఎప్పుడిస్తారో తెలియదని, 20 లక్షల ఉద్యోగాలు ఎప్పుడు కల్పిస్తారని నిలదీశారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ రూ.15వేలు ఇస్తామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రస్తావనే లేదన్నారు. వైసీపీ నేత బొత్స సత్యనారాయణ తీరు పచ్చ కామెర్లు వచ్చినట్లు ఉందన్నారు. నేను వ్యక్తిగతంగా మాట్లాడితే జగన్ ఇంట్లో నుంచి అడుగు బయట పెట్టరని అన్నారు. జగన్ ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయారని, అందరి వైఫల్యాల్ని ఎత్తి చూపుతానని చెప్పారు.

వైసీపీ పోరుబాట

కార్యాచరణ ప్రకటించిన జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర రైతుల ఇబ్బందులు, సర్దుబాటు పేరుతో కరెంటు చార్జీల భారం, విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ సమస్యలపై వైసీపీ ఉద్యమ కార్యాచరణ ప్రకటించింది. కూటమి ప్రభుత్వంపై పార్టీ పరంగా పోరుబాటకు నడుం బిగించింది. రాష్ట్రంలోని సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఈనెల 11, 27 తేదీలతో పాటు జనవరి 3న నిరసనలకు పిలుపునిచ్చింది. జగన్ బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులతో సమావేశమయ్యారు. 11వ తేదీన రైతుల సమస్యలపై ర్యాలీలు, కలెక్టర్లకు వినతిపత్రాల అందజేత కార్యక్రమాలు చేపట్టాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. అలాగే రూ.20 వేల పెట్టుబడి సాయం, ధాన్యానికి మద్దతు ధర, ఉచిత పంట బీమా పునరుద్ధరణకు పోరాడాలని, ఈనెల 27న పెంచిన విద్యుత్ ఛార్జీలపై ఆందోళన చేయాలని, ఎస్ఈ కార్యాలయాలు, సీఎండీ కార్యాలయాలకు వినతులు అందజేయాలని నిర్ణయించారు. జనవరి 3న ఫీజు రీయింబర్స్మెంట్, పెండింగ్ బకాయిల విడుదలపై ఆందోళనలు, కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలని కూడా సమావేశం నిర్ణయించింది. తొలుత జగన్ మాట్లాడుతూ ఆరు నెలల్లోనే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని విమర్శించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్... గాలికెగిరిపోయాయని, చెప్పిన అబద్ధాలు, చేసిన మోసాలు ప్రజల్లో కోపంగా మారాయన్నారు. ఎక్కడికక్కడ ప్రజలు ప్రశ్నించే పరిస్థితి ఉందని, వ్యవస్థలన్నీ నీరు గారిపోయాయని విమర్శించారు. గ్రామాల్లో బెల్టుషాపులకు బహిరంగ వేలం వేస్తున్నారని, ఎమ్మెల్యేలకు కప్పం కడితే తప్ప ఏ పని జరగట్లేదన్నారు. ప్రజలకు అండగా నిలవాల్సిన సమయమిదేనని ఉద్ఘాటించారు. సంక్రాంతి తర్వాత జిల్లాల పర్యటనలు, ప్రతి బుధ, గురువారాల్లో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తానని జగన్ వెల్లడించారు.

'సీపీఎస్' మహాసభకు మద్దతిస్తాం

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పింఛన్ పథకం (సీపీఎస్) అసోసియేషన్ అధ్వర్యంలో ఈనెల 10న విజయవాడలో పాత పింఛన్ సాధన కోసం నిర్వహించనున్న మహాసభకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీ పాషా వెల్లడించారు. సచివాలయ ఉద్యోగుల తరపున విజయవాడలో మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం పాషా మాట్లాడుతూ మానవ హక్కుల దినం జరుపుకునే రోజున తలపెట్టిన మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫెడరేషన్ సమన్వయకర్త ఎం.శశిధర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్కే సుభాని, సహాయకార్యదర్శి జి.నవీన్ కుమార్, విజయవాడ నగర నాయకులు సీహెచ్ రామకృష్ణ, కోటా రంజిత్ పాల్గొన్నారు.

829 మంది ప్రధానోపాధ్యాయులకు షోకాజ్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైఎస్ఆర్ కడప జిల్లాలో 829 మంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖ అధికారులు షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఏకకాలంలో ఈ నోటీసుల జారీ చర్చానీయాంశంగా మారింది. పాఠశాలల్లో పిల్లల హాజరు నమోదును నిర్దేశిత గడువులోగా పూర్తి చేయకపోవడంతో ఈ నోటీసులు ఇచ్చినట్లు విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పబోవని నోటీసుల్లో హెచ్చరించారు. అయితే సాంకేతిక సమస్య కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందని, ఇందుకు తాము ఎలా బాధ్యులవుతామని ప్రధానోపాధ్యాయులు అంటున్నారు. ముందస్తు సమాచారం లేకుండా నోటీసులు ఇవ్వడాన్ని ప్రశ్నించారు. ఈ నోటీసులు రద్దు చేయాలని డీఈఓను కోరారు.

అడుగడుగునా మత విద్వేషాలు

సూపర్ సిక్స్తో చంద్రబాబు మోసం

దీపాంకర్ భట్టాచార్య

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ఆర్ఎస్ఎస్ ఆదేశాలతో మోదీ ప్రభుత్వం అన్ని రాష్ట్రాలలో తన స్వార్థ ప్రయోజనాలు, అధికారం కోసం మత విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల హక్కులు కాలరాస్తోందని, అటువంటి కుటిల యత్నాలను అడ్డుకోవటానికి, అన్ని వర్గాల ప్రజలను చైతన్యం చేయటానికి కమ్యూనిస్టులు ఏకతాటిపైకి రావాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య పిలుపునిచ్చారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర శాఖ అధ్వర్యంలో బుధవారం విజయవాడలోని జింఖానా మైదానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించటానికి వ్యతిరేకంగా బహిరంగ సభ నిర్వహించారు. ప్రధానంగా సూపర్ సిక్స్ కాదు... ప్రజలు కోరే పీపుల్ సిక్స్ కావాలి... తెలుగు నేల నుంచి మత రాజకీయాలను తరిమేద్దాం అని ప్రజా హక్కుల సభ నిర్వహించారు.

దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు ప్రజలను మోసం చేశారని, ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేటం లేదని ప్రశ్నించారు. హామీలు అమలు చేయకపోతే అందరినీ కలుపుకుని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జార్ఖండ్ ప్రజలు ఎన్నికల్లో బీజేపీకి చరమగీతం పాడారని అన్నారు. అక్కడ ఖనిజ సంపద అంతా అదానీ కంపెనీలకు అప్పజెప్పాలన్న బీజేపీ కుటిలయత్నాలను ప్రజలు తిప్పికొట్టారన్నారు. జార్ఖండ్ ఎన్నికల్లో మన పార్టీ నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఉన్నారని ఆయన తెలిపారు. ఏపీలోవిద్యుత్ కంపెనీలు పెట్టేందుకు పెద్ద మొత్తంలో కుంభకోణం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అవినీతి జరిగిందని చంద్రబాబు చెబుతున్నారని, నేరం ఎవరు చేసినా శిక్ష పడాల్సిందేనని, అందుకు ప్రధాన సూత్రధారి అదానీని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో అదానీ, అంబానీ కంపెనీలు వద్దంటూ నిరసనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది చివరి వరకు సభలు, సమావేశాలు ఏర్పాటు చేయాలని కేంద్ర కమిటీ తరపున పిలుపు ఇస్తున్నామన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం ప్రారంభమై 100 సంవత్సరాలు అవుతుందని, ఇది అందరికీ సంబంధించిన ఉద్యమమని అన్నారు. ఈ కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఆంధ్రప్రదేశ్తో పాటు దేశవ్యాప్తంగా కొనసాగించవలసిన అవసరం ఉందని తెలిపారు.

పార్టీ రాష్ట్ర కార్యదర్శి బంగారు రావు మాట్లాడుతూ జగన్ కన్నా అధిక పథకాలు ఇస్తానని చంద్రబాబు ప్రజలను మోసం చేశారని, ఆ హామీలు నోటిమాటగానే మిగిలిపోయాయని విమర్శించారు. సూపర్ సిక్స్లో ఒక్క హామీ మాత్రమే అమలయిందని, రైతులను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని తెలిపారు. ల్యాండ్ టైటిల్ పేర్లు మార్చి చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రజల జీవనం దుర్భరంగా ఉండటంతో వారు పల్లెలు వదిలి పట్టణాల బాట పట్టారని అన్నారు. పవన్ కల్యాణ్ సనాతన ధర్మం పేరుతో చేస్తున్న మత విద్వేషాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. నిరుద్యోగ భృతి రూ.5 వేలు ఇవ్వటంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కార్మికులకు రూ.600 కనీస వేతనం అందించి ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. స్కీమ్ కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పారిశుద్ధ్యంతో పాటు ఇతర రంగాలలో కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి, ప్రభుత్వ నియామకాల ప్రకారం కనీస వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సభకు ముందు హనుమాన్ పేటలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం నుంచి ర్యాలీగా జింఖానా గ్రౌండ్కు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యవర్గ సభ్యులు డి.హరినాథ్, నాయకులు అర్జున్ రావు, జి.సత్యనారాయణ, రాజలపాటి నాగమణి, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పురుగుల అన్నం... పిల్లలు పస్తు

చీపురుపల్లి బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనం దుస్థితి

విశాలాంధ్ర-చీపురుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాఠశాల విద్యార్థుల కోసం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల లోపం కారణంగా అభాసుపాలవుతోంది. విజయనగరం జిల్లా చీపురుపల్లి పట్టణ పరిధిలోని బాలికల ఉన్నత పాఠశాలలో సుమారు 525 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. బుధవారం పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పురుగులు కనిపించడంతో విద్యార్థులు భోజనం చేయకుండా పస్తులు ఉండాల్సి వచ్చింది. ప్లేటులో వడ్డించుకున్న అన్నం రుచి చూసిన విద్యార్థులు అందులో పురుగులను చూసి భయభ్రాంతులకు గురయ్యారు. ఎంతో ఆకలితో తిందామనుకున్న అన్నంలో పురుగులు కనిపించడంతో చేసేది లేక బయట పారబోశారు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయురాలు బేగంను విలేకరులు ప్రశ్నించగా భోజన నిర్వాహకులకు సరుకులను అందజేసి, తనకు అప్పజెప్పిన విధుల మేరకు ఇతర పాఠశాలలకు విజిట్కు వెళ్లానని ఆమె వివరించారు. వంట పాత్రలు శుభ్రం చేయకపోవడం వలన ఈ పొరపాటు జరిగి ఉండవచ్చని తెలిపారు. బుధవారం మధ్యాహ్న భోజనంలో భాగంగా బిరియానీ, బంగాళదుంప కూర, ఉడకబెట్టిన కోడి గుడ్డును విద్యార్థులకు అందజేశామన్నారు. పాత్రను శుభ్రం చేయకపోవడం వలన జరిగిన పొరపాటు తప్ప అన్నంలో పురుగులు లేవని ఈ సందర్భంగా ఆమె వివరించారు. ఈ విషయమై మండల విద్యాశాఖ అధికారి బూసి నాయుడును విలేకరులు వివరణ కోరగా తనకు సమాచారం అందిన వెంటనే పాఠశాలకు వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. ఇటువంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటామని, ఈ మేరకు నిర్వాహకులను హెచ్చరించినట్లు తెలిపారు.

మిద్దె కూలి ముగ్గురి దుర్మరణం

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: మిద్దె కూలి ముగ్గురు దుర్మరణం చెందిన ఘటన అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కుందుర్పి మండలం రుద్రంపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. దంపతులు గంగన్న (43), శ్రీదేవి (38), వారి కుమార్తె సంధ్య (14) చనిపోయారు. విషయం తెలుసుకున్న మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. రూ.50 వేల తక్షణ సాయాన్ని ప్రకటించారు. అనంతరం కలెక్టర్తో లోకేశ్ ఫోన్ చేసి బాధిత కుటుంబానికి పక్కా ఇల్లు కట్టించి ఇవ్వాలని ఆదేశించారు.

కులవివక్ష అరికట్టండి

రెండు గ్లాసుల పద్ధతి నిలుపుదల చేయండి: కరువది

విశాలాంధ్ర-కూడేరు: దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 77 సంవత్సరాలు అయినా... నేటికీ దళితులు కులవివక్షకు గురవుతున్నారని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురంలోని సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ అడుగడుగునా కులవివక్షకు గురవుతున్నా పాలకులు మాత్రం గ్రామాల్లో కుల వివక్షను రూపుమాపామని పత్రికల్లో ప్రకటనలు గుప్పిస్తున్నారన్నారు. కమిషన్ సిఫార్సులను ఏ అధికారి అమలు చేయకుండా పౌరహక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నామని ఎస్పీ , కలెక్టర్లకు తప్పుడు నివేదికలు ఇస్తున్నారన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మండలం కర్నాటక సరిహద్దు గ్రామాల్లో నేటికీ రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతుందన్నారు. దీన్ని అరికట్టడంలో పాలకపక్షాలు, ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం విడాలని సూచించారు. రెండు గ్లాసుల పద్ధతి లేకుండా చేయాలని కోరారు. గత పాలకులు 27 రకాల దళిత పథకాలను నిలుపుదల చేశారని, అధికారంలోకి వస్తే వాటిని పునరుద్ధరిస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు నోడల్ ఏజెన్సీ ద్వారా దళిత ప్రయోజనాలకు ఖర్చు పెట్టాలన్నారు. వసతి గృహాల్లో నాసిరకం భోజనాలు పెట్టి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. కస్తూరిబా పాఠశాలలో వీటి అవస్థలు వర్ణనాతీతమన్నారు. నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు, సీపీఐ అనంతపురం జిల్లా కార్యదర్శి సీ జాఫర్, డీహెచ్పీఎస్ జిల్లా ఇన్చార్జ్, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ సంజీవప్ప, కన్వీనర్ జే మల్లికార్జున,డీ పెదయ్య, ఓబులేసు, సుంకరాజు, వన్నూరమ్మ, చిన్న ఓబులేసు, సత్య సంజీవ రాయుడు , నాగన్న, సంజమ్మ పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.